

www.andhrajyothy.com
వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 10-11-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 222 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా. 9.02 తదుపరి దశమి; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 11.00 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.5.48-7.18, దుర్ముహూర్తం: సా.4.06-4.51; అమృతఘడియలు: రా.2.52-4.22; రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 5.36

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



2

నో మ్యారేజ్.. నో సెక్స్!

కమలను కాదని ట్రంప్‌ను గెలిపించినందుకు..

అమెరికాలో పురుషులపై మహిళల గుస్సా

దక్షిణకొరియా మహిళల ఉద్యమం స్ఫూర్తితో

ఫ్యాటీ లివర్.. నేటి కిల్లర్

పీఎన్‌పీఎల్‌ఏ 3 జన్యువుతో భారీగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్ కేసులు

దేశంలో 30-40 కోట్ల మంది బాధితులు

మద్యం, శారీరక శ్రమ లేమీ కారణాలే..

రాబోయే 2-3 ఏళ్లలో ఇదే ప్రధాన జబ్బు

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మన శరీరంలో ఏ కీలక అవయవమైనా కాస్త పని చేయకపోతే ఆ లక్షణాలు బయటపడతాయి! అన్ని అవయవాలు పనిచేసేలా పెద్దన్న పాత్ర పోషించే ఒక్క కాలేయం తప్ప! తనలో కొవ్వు చేరితే ఆ అనారోగ్య లక్షణాలను బయటపెట్టదని.. ఆ కొవ్వు పెరుగుతూ పోతున్నా కాలేయం పెద్దగా హెచ్చరించదనే విషయం ఎంతమందికి తెలుసు? చివరికి ఆ కొవ్వు దశలవారీగా

మిగతా 14వ పేజీలో...



రష్యాలో 'శృంగార మంత్రిత్వ శాఖ'!

ఉక్రెయిన్‌తో యుద్ధం.. సైనికుల మరణాలతో భారీగా తగ్గుతున్న రష్యా జనాభా

జన సంఖ్యను పెంచేందుకు మినిస్ట్రీ ఆఫ్ సెక్స్

రాత్రి 10 నుంచి 2 వరకు ఇంటర్నెట్ బంద్

పని ప్రదేశాల్లో సంతానోత్పత్తి బ్రేక్‌లు

2



ముంబైలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్

చెప్పుకోవడానికి సక్సెస్ స్టోరీల్లేక..

అబద్ధాల ప్రచారం

కాంగ్రెస్ గ్యారెంటీలపై మోదీవన్నీ అబద్ధాలే

ఆపకుంటే నిజాలు మాట్లాడుతూనే ఉంటా

రుణమాఫీపై మోదీ ఆరోపణలకు బదులిచ్చా

దాంతో ఆయన ఎక్స్ పోస్టునే తొలగించారు

జాతీయ జనగణనలో కులగణన చేర్చాల్సిందే

రాష్ట్రంలో పూర్తి చేసి మోదీని సవాల్ చేస్తాం

వీరుల గడ్డ మహారాష్ట్రలో గుజరాత్ గులాంలా?

డీకే, సుక్కులతో కలిసి ముంబైలో సీఎం రేవంత్ ప్రెస్‌మీట్.. బీజేపీ ప్రచారానికి కౌంటర్

హైదరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ గ్యారెంటీలపైన మహారాష్ట్ర బీజేపీ నేతలు, ప్రధాని నరేంద్ర మోదీ అడ్డగోలుగా అబద్ధాలు చెబుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మహారాష్ట్ర ఎన్నికల్లో చెప్పుకోవడానికి మోదీ మొదలుకుని ఆ రాష్ట్ర బీజేపీ నేతల వరకు ఎవరికీ సక్సెస్ స్టోరీ ఏదీ లేదన్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేనప్పుడు ఇతరులపై నిందలు మోపి, గెలిచే ప్రయత్నం చేయడం మోదీకి అలవాటని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఆయన అదే చేస్తున్నారన్నారు. మోదీ అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే.. తాను నిజాలు చెప్పడమూ మానబోనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఆ పార్టీ విఫలమైందని, మహారాష్ట్రలో ఆ పార్టీ నేతృత్వంలోని కూటమి మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఐదు గ్యారెంటీలు కూడా అమలు చేసేవి కాదని బీజేపీ ఉధృతంగా ప్రచారం చేస్తున్న

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రాలను ఏటీఎం చేసుకున్నారు

వనరులను దోపిడీ చేస్తున్నారు.. మహావికాస్ అఘాడీ కూటమి అవినీతికి పరాకాష్ఠ

మహారాష్ట్రను ఏటీఎం కానివ్వం

కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు

14 నుంచి 'ప్రజా విజయోత్సవాలు'

డిసెంబరు 9 వరకు 26 రోజుల పాటు నిర్వహణ

ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నందున..: భట్టి

13

వచ్చే నెల 13 వేల కోట్ల రుణమాఫీ

మిగిలిన రైతులందరికీ వర్తింపజేస్తాం: పొంగులేటి

రౌడీ పంచాయితీలు మాకూ తెలుసు

తిట్టడం మొదలెడితే రేపటి వరకు తిడతా

ప్రజల్ని కాపాడాలి గానీ భయపెడతారా?

ఏం కోల్పోయామో ప్రజలకు అర్థమైంది

వచ్చేది 100% బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

సర్కారుపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఫైర్



హైదరాబాద్, మర్కుక్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): "రౌడీ పంచాయితీలు చేయడం మాకూ వచ్చు. తిట్టడం కూడా వచ్చు. ఈరోజు తిట్టడం మొదలు పెడితే.. రేపటి వరకు తిడతా నేను" అని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రజలు తమకు సేవ చేసే అధికారాన్ని కాంగ్రెస్ పార్టీకి ఇచ్చారని చెబుతూ.. "ప్రభుత్వం ప్రజలను కాపాడాలే తప్ప.. భయపెడతారా?" అంటూ మండిపడ్డారు. శనివారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఆయన పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నియోజకవర్గ

మిగతా 13వ పేజీలో...

13

1 కేసీఆర్ పేరును చెరిపేయలేరు

అలా చేయాలనుకుంటే మూర్ఖత్వమే: కేటీఆర్

1 మూసీ కంటే రేవంత్ నోటి కంపే ఎక్కువ

నేతల మాటలకు సెన్సార్ ఉండాలి: హరీశ్

1 దళితబంధు.. హుజూరాబాద్‌లో ఉద్రిక్తత

తోపులాటలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి అస్వస్థత

కుటుంబ సర్వేలో భాగంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో అధికారులు



సమగ్ర ఇంటింటి సర్వే షురూ

వివరాలిచ్చిన గవర్నర్

మంత్రులు దామోదర, పొన్నం కూడా..

కొన్ని చోట్ల సర్వేలో సిబ్బంది అడ్డగింత

మంత్రులు, ఎమ్మెల్యేలూ పాల్గొనండి: భట్టి

11 సర్వేపై ప్రజలు నమ్మకం ఉంచాలి: మంత్రులు

తెలంగాణలో 243 కులాలు

బీసీల్లో 134 సామాజికవర్గాలు

ఎస్సీల్లో 59, ఎస్టీల్లో 32, ఓసీల్లో 18

కులగణనలో కోడ్‌ల కేటాయింపు

కులం, మతం లేదన్నవారికీ ఓ కోడ్

ఇతర రాష్ట్రాల వారికి ప్రత్యేక కోడ్‌లు

నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్లు

భూ సమస్యలపైనా వివరాల సేకరణ

వ్యాపారవేత్తల వార్షిక టర్నోవర్ కూడా

సినీ హీరోలు, దర్శకులు, జ్యోతిష్కులు, కాంట్రాక్టర్లు 'స్వయం ఉపాధి' కింద!

ప్రార్థనాలయాలకు వెళ్లేందుకు వివక్ష, బెదిరింపులున్నాయా అంటూ ఆరా

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అన్ని క్యాటగిరీల్లో కలిపి మొత్తం 243 కులాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బీసీలు, ఎస్సీ, ఎస్టీ, ఓసీల్లో ఏ కేటగిరీలో ఎన్ని కులాలున్నాయో వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కులగణనలో వివరాలను సేకరించేందుకుగాను ఆయా కులాలకు కోడ్‌లను కేటాయించింది. తెలంగాణ వారే కాకుండా ఇక్కడ నివసిస్తున్న ఇతర రాష్ట్రాల వారికి కూడా ప్రత్యేక కోడ్‌లను కేటాయించి గణన చేపడుతోంది. కులం, మతం లేదని చెప్పేవారినీ ప్రత్యేక కోడ్ కింద నమోదు చేస్తోంది. మొత్తంగా కులగణన ప్రశ్నావళిలో కులాలకు సంబంధించి 249 కోడ్‌లను కేటాయించింది. ఈ సర్వేలో కులాల

మిగతా 11వ పేజీలో...

11

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు..

రంగంలోకి ప్రత్యేక కమిషన్

రేపు, ఎల్లుండి మాసబ్‌ట్యాంక్ కార్యాలయంలో అభిప్రాయ సేకరణ.. త్వరలో జిల్లాల్లో

ట్రంప్ తొలిదెబ్బ.. భారతీయులపైనే!

పౌరసత్వ మంజూరుపై కఠిన ఆంక్షలు

గద్దెనెక్కిన తొలిరోజే ఉత్తర్వులిస్తానంటూ ఎన్నికల ప్రచారంలో ప్రకటన

లక్షల మంది భారతీయులు, వారి సంతానంపై తీవ్ర ప్రభావం

కోర్టుల్లో సవాల్ చేసే అవకాశం

వాషింగ్టన్, నవంబరు 9: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. గద్దెనెక్కిన తొలిరోజే భారతీయులకు షాక్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. వలసలను నిరోధిస్తూ.. సహజ పౌరసత్వాల మంజూరును నియంత్రిస్తామని, అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చే కార్యనిర్వాహక ఉత్తర్వు ఇదేనని ట్రంప్, కాబోయే ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఇదే జరిగితే పౌరసత్వం కోసం అమెరికాలోనే ఉండి ఎదురుచూస్తున్న లక్షలాది మంది భారతీయులు, వారి సంతానం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం ఖాయం. ఈ నేపథ్యంలో ట్రంప్ జారీచేసే కార్యనిర్వాహక ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో సవాల్ చేసే

మిగతా 2వ పేజీలో...

భారతీయ విద్యార్థులకు కెనడా షాక్

ఫాస్ట్ ట్రాక్ స్టూడెంట్ వీసా ప్రక్రియ రద్దు



సోషల్ మీడియా వికృత పోకడ!



కొత్త పలుకు!

సోషల్ మీడియా విశ్వసనీయత ఇటీవలి కాలంలో దారుణంగా దెబ్బతింది. దీంతో ప్రజలు వాస్తవాల కోసం మెయిన్ స్ట్రీమ్ మీడియాపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ప్రజలు నమ్మడం లేదు. అందుకే సోషల్ మీడియా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేకపోతున్నది. పదేళ్ల క్రితంతో పోల్చితే ఇప్పుడు సోషల్ మీడియా వికృత పోకడలు పోతోంది. యూట్యూబ్ చానళ్లు కూడా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రాజకీయ పార్టీలు వాటిని స్పాన్సర్ చేస్తున్నాయి. జర్నలిస్టులు కూడా ఏదో ఒక సంస్థలో నిలకడగా ఉద్యోగం చేసే విధానానికి స్వస్తి చెప్పి రాజకీయ పార్టీల ప్రాపకంతో యూట్యూబ్ చానళ్లు ప్రారంభిస్తున్నారు.

తెలుగునాట ప్రింట్ మీడియా విశ్వసనీయతకు కూడా తూట్లు పొడిచే ప్రయత్నాలు జరిగాయి. రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జగన్ రెడ్డి కూడా సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ కూడా సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరూ ముఖ్యమంత్రులు అయ్యారు. వారు సీఎంలు కావడానికి సొంత మీడియా ఎంత ఉపయోగపడిందో తెలియదు కానీ గత ఎన్నికల్లో వారి ఓటమిని మాత్రం తప్పించలేక పోయింది.

రాజకీయాలతో మతాన్ని ముడిపెట్టకూడదు అన్నట్టుగానే కులాన్ని కూడా ముడిపెట్టకూడదు. ఏపీ మాజీ సీఎం జగన్ రెడ్డి విలేకరుల సమావేశం పేరిట తాజాగా విడుదల చేసిన వీడియోలో నాపైన కూడా బురద చల్లే ప్రయత్నం చేశారు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే వల్లెవేసే జగన్ రెడ్డి మా విషయంలో కూడా అలవోకగా అబద్ధం చెప్పారు. పోలీసులు అన్వేషిస్తున్న వర్రా రవీంద్రా రెడ్డిని తప్పించడానికి తన భార్య భారతి కడప ఎస్పీకి ఫోన్ చేసినట్టు 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురించారని, సదరు ఫేక్ వార్త ప్రచురించినందుకు నన్ను బొక్కలో వేయాలని పోలీసులను జగన్ డిమాండ్ చేశారు. తీరా చూస్తే 'ఆంధ్రజ్యోతి'లో అటువంటి వార్త ఏదీ ప్రచురితం కాలేదు.

నిత్యం అసత్యాలు, అర్ధసత్యాలతో నిండి ఉండే తన రోత మీడియా బాటలోనే 'ఆంధ్రజ్యోతి' కూడా నడుస్తోందని అనుకోవడం జగన్ వెర్రితనం. నిజంగానే పొరపాటు చేస్తే క్షమాపణ చెప్పే సంస్కారం మాకు ఉంది.

4

'ఆంధ్రజ్యోతి'కి విశ్వసనీయత ఉందని గర్వంగా చెప్పుకోగలం! మీ రోత మీడియాకు ఉన్న విశ్వసనీయత ఏపాటిదో తెలియదా? అందుకే కదా తాజా ఎన్నికల్లో జగన్‌ను ఓటమి నుంచి మీ మీడియా కాపాడలేకపోయింది? తప్పు జరిగినప్పుడు అంగీకరించడానికి నైతిక బలం ఉండాలి. అబద్ధాలు చెబుతూ జీవించడానికి అలవాటు పడిన వారు తప్పు చేశామని ఎప్పటికీ గుర్తించలేరు.

దెయ్యాలు వేదాలు వల్లిస్తే వినడానికి రోతగా ఉంటుంది. ఇప్పుడు జగన్ నోటి వెంట ప్రజాస్వామ్యం, విలువలు, రాక్షసత్వం, అరాచకం, పోలీసులు దుర్మార్గంగా పనిచేస్తున్నారు... వంటి మాటలు వినపడుతుంటే రోతగానే ఉంటుంది మరి. భరించక తప్పదు!



భూదాన్‌పోచంపల్లి మండలంలో మొలకెత్తిన వడ్లను కిషన్‌రెడ్డికి చూపుతున్న రైతులు

రైతులపై రేవంత్ చిన్నచూపు

రెండు నెలలైనా ధాన్యం కొనుగోళ్లు చేపట్టరా?

రైతు హామీలను విస్మరించారు: కిషన్‌రెడ్డి

విద్యా కమిషన్‌లో నక్సల్స్ సానుభూతిపరులు

ఆ కమిషన్‌ను రద్దు చేయాలి: బండి సంజయ్

భూదాన్‌పోచంపల్లి/భగత్‌నగర్ (కరీంనగర్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు కల్లాల్లో వడ్లు పోసి రెండు నెలలు గడుస్తున్నా.. నేటికీ కొనుగోలు చేయకపోవడం శోచనీయమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి బోటు షికారుపై ఉన్న ధ్యాస.. ధాన్యం కొనుగోళ్లపై లేదని ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం గౌసుకొండ, రేవణపల్లి, పోచంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను

మిగతా 13వ పేజీలో...

HAPPY Holidays

వచ్చే ఏడాది 27 సాధారణ సెలవులు

23 ఐచ్ఛిక సెలవులు.. ప్రకటించిన ప్రభుత్వం 13

జనవరి 1 నుంచి స్విట్జర్లాండ్‌లో

బురఖాపై నిషేధం

బహిరంగ ప్రదేశాల్లో అమలు 2

ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల జరిమానా

ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తల వ్యతిరేకత

సిక్కోలు వాసి అరుదైన రికార్డు

ఆన్‌లైన్‌లో 2,500 కోర్సులు పూర్తి 13

51 ఏళ్ల వయసులో ఎంవీఎస్ఎస్ శాస్త్రి ఘనత

రూ.100 కోట్ల ప్రభుత్వ భూమి భద్రం!

గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు వ్యక్తులకు బదలాయించిన అమోయ్ కుమార్

తిరిగి ప్రభుత్వ భూమిగా మార్చిన మేడ్చల్ కలెక్టర్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మేడ్చల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు వ్యక్తుల పరమైన దాదాపు రూ. 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తిరిగి ప్రభుత్వ భూమిగా మార్చారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన

మిగతా 3వ పేజీలో...

3

మహేశ్వరం కేసు.. పునఃపరిశీలన!

ఈడీ అభ్యర్థనతో సమీక్షిస్తున్న పోలీసులు

రాచకొండ సీపీకి డీజీపీ జితేందర్ ఆదేశం

అవసరమైతే ఎఫ్ఐఆర్‌లో మరిన్ని పేర్లు

రష్యాలో శృంగార శాఖ

» జనాభాను పెంచేందుకే..

న్యూఢిల్లీ, నవంబరు 9: దేశంలో జనాభా తగ్గుతుండటం, వృద్ధుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో పెళ్లిళ్లు చేసుకోండర్రా.. పిల్లలను కనండర్రా అని యువతకు ఉద్బోధిస్తోంది చైనా! జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్న రష్యానైతే ఓ అడుగు ముందుకేసి ప్రత్యేకంగా శృంగార మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ సెక్స్)ను ఏర్పాటు చేయాలని సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఫలితంగా జనాభా భారీగా పడిపోవడంతో జనసంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక ఆదేశాలిచ్చిన మీదటే ఆయన సలహాదారులు ప్రత్యేకంగా శృంగార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. మరి.. ఈ శాఖలో భాగంగా ఏంచేస్తారు? అంటే.. పెళ్లైన జంటలు ఏకాంతంగా గడిపేలా ప్రోత్సహిస్తారు. ఇందుకు రాత్రి 10 నుంచి 2 గంటల వరకు ఇంట్లో లైట్లు, ఇంటర్నెట్ బంద్ చేయాలని, ఇంట్లో ఉండే మహిళలకు జీతం ఇవ్వాలని, కొత్త జంటల ఫస్ట్‌నైట్‌కు హోటల్ ఖర్చుల కోసం ప్రత్యేకంగా డబ్బు ఇవ్వాలనే ప్రతిపాదనలున్నాయి. ఇక పని ప్రదేశాల్లో లంచ్, కాఫీ బ్రేక్‌లు సంతానోత్పత్తి బ్రేక్‌లుగా వాడుకోవాలనేది మరో ఆసక్తికరమైన ప్రతిపాదన.

నో మ్యారేజ్.. నో సెక్స్.. నో కిడ్స్!

న్యూఢిల్లీ, నవంబరు 9: అమెరికా ఆడవాళ్లకు అక్కడి మగాళ్లపై పీకల్దాక కోపమొచ్చింది. కమలా హారిస్‌ను కాదని ట్రంప్‌కు ఓట్లేసి గెలిపించినందుకు పురుష పుంగవులపై లక్షల సంఖ్యలో మహిళామణులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ట్రంప్ స్త్రీవాద వ్యతిరేకి అని కన్నీటి పర్యంతమవుతూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. వీరిలో వేల సంఖ్యలో తరుణులైతే తమ ఈ కోపానికి ప్రతీకార రూపాన్నిచ్చి మగవారిపై కసి తీర్చుకోవాలనుకుంటున్నారు. దక్షిణకొరియాలో తమ హక్కులను కాలరాస్తున్నారనే ఆగ్రహంతో అక్కడి మహిళలు 4బీ ఉద్యమం సాగించినట్లుగా. అందులో ప్రధానమైంది భర్తలను శృంగారానికి దూరంగా ఉంచడం. అంటే.. పడకమీదకు చేరిన భర్తకు 'నో సెక్స్' అని తేల్చి చెబుతారన్నమాట! ఇంకా మగవారితో సంబంధాలే కొనసాగించకపోవడం, అసలు పెళ్లిళ్లకే దూరంగా ఉండటం, ఒకవేళ పెళ్లి చేసుకున్నా పిల్లల్ని కనకపోవడం వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకున్నారట!

జనవరి 1 నుంచి స్విట్జర్లాండ్‌లో బురఖాపై నిషేధం

న్యూఢిల్లీ, నవంబరు 9: స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రజలు తిరిగే ప్రైవేటు భవనాల్లోనూ బురఖాపై నిషేధం ఉంటుంది. ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌ల (రూ.96,947) జరిమానా విధించనున్నారు. ఈ నిర్ణయాన్ని ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో బురఖా నిషేధానికి మద్దతుగా 51 శాతం మంది ప్రజలు ఓటేశారు. అక్కడి పార్లమెంట్‌లోనూ ఈ నిర్ణయానికి ఆమోదం లభించింది. దాదాపు 88.5 లక్షల మంది జనాభా ఉన్న స్విట్జర్లాండ్‌లో.. ముస్లింలు 5 శాతం ఉన్నారు.



నీట్ అభ్యర్థినిపై అత్యాచారం

» బ్లాక్‌మెయిల్ చేసి పలుమార్లు రేప్.. ఇద్దరు కోచింగ్ టీచర్ల అరెస్టు

కాన్పూర్, నవంబరు 9: వైద్య కళాశాలలో సీటు పొందాలన్న లక్ష్యంతో 'నీట్' ప్రవేశ పరీక్షల శిక్షణ కోసం కాన్పూర్ వచ్చిన ఓ బాలిక పలుమార్లు అత్యాచారానికి గురయింది. పేరుపొందిన ఇద్దరు కోచింగ్ టీచర్లే ఈ దారుణానికి పాల్పడ్డారు. ఇంతకాలం భయంతో నోరు విప్పని ఆ బాలిక ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు వారిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. ఓ పోలీసు అధికారి చెప్పిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జనవరిలో బయాలజీ టీచర్ సహీల్ సిద్దిఖీ (32) విద్యార్థులందరికీ పార్టీ ఇస్తున్నానని చెప్పి ఆ బాలికను (ఆ సమయంలో ఆమె మైనర్) తన ఇంటికి పిలిచాడు. వెళ్లి చూసే సరికి ఇతర విద్యార్థులు ఎవరూ లేరు. ఆమెకు మద్యం తాగించి అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే కుటుంబ సభ్యులకు హాని కలిగిస్తానని బెదిరించాడు. అనంతరం పార్టీల పేరుతో పలుమార్లు అత్యాచారం చేశాడు. ఇదే క్రమంలో కెమిస్ట్రీ బోధించే వికాస్ పోర్వాల్ (39) కూడా ఆమెను రేప్ చేశాడు. హోలీ పండగకు ఇంటికి వెళ్లగా వెంటనే రావాలని పిలిపించి అత్యాచారం చేశాడని ఆమె తెలిపింది. సిద్దిఖీపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలతోనే కేసు నమోదయింది. కొద్ది నెలల క్రితం మరో బాలికపై అత్యాచారం చేశాడన్న ఆరోపణలపై అరెస్టయి, ఇటీవలే బెయిల్‌పై వచ్చాడు. బాధితురాలు ఆ ఇద్దరు టీచర్లపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం కేసు నమోదు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి వారిని అదుపులోకి తీసుకున్నారు.

మణిపూర్‌లో మహిళపై అత్యాచారం.. సజీవ దహనం

గువాహటి, నవంబరు 9: మణిపూర్‌లో జాతి విద్వేషం తీవ్రరూపం దాల్చింది. ఆయుధాలతో వచ్చిన చొరబాటుదార్లు జిరిబాం జిల్లాలోని జైరివాన్ గ్రామంలో గురువారం రాత్రి అరాచకం సృష్టించారు. విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ముగ్గురు పిల్లల తల్లి అయిన 31 ఏళ్ల గిరిజన మహిళపై అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను ఇంట్లోనే సజీవ దహనం చేశారు. ఆస్తులను దోచుకొని గ్రామంలో విధ్వంసం సృష్టించారు. 17 ఇళ్లకు నిప్పుపెట్టి దహనం చేశారు. బాధితురాలి భర్త చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రదర్స్, నన్స్‌కు ఐటీ మినహాయింపులు రద్దు

న్యూఢిల్లీ, నవంబరు 9: ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడుస్తున్న విద్యాసంస్థల్లో పనిచేస్తున్న క్రైస్తవ ప్రీస్ట్, బ్రదర్స్, నన్స్‌కు ఇంతవరకు అమలవుతున్న ఆదాయపు పన్ను(ఐటీ) మినహాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. వారికి కూడా టీడీఎస్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. తద్వారా బ్రిటిష్ కాలం నాటి సంప్రదాయానికి ముగింపు పలికింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం గురువారం తీర్పు చెప్పింది. పన్ను చెల్లించాలంటూ 2014లో ఐటీ విభాగం ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ దాఖలైన 93 అప్పీళ్లను కొట్టివేసింది. దేశమంతటా విద్యను విస్తరింపజేయాలన్న ఉద్దేశంతో 1944లో బ్రిటిష్ ప్రభుత్వం ఈ పన్ను మినహాయింపును ఇచ్చింది.

కోడలిని టీవీ చూడొద్దనడం క్రూరత్వం కాదు

న్యూఢిల్లీ, నవంబరు 9: అత్తింటి వారు కోడలిని టీవీ చూడనీయకపోవడం, చాపపై పడుకోమనడం, పొరుగు వారిని కలవనీయకపోవడం వంటివి క్రూరత్వం కిందకు రావని బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ స్పష్టం చేసింది. ఆ మహిళ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో భర్త, అత్తింటి వారికి కింది కోర్టు విధించిన 20 ఏళ్ల జైలు శిక్షను రద్దు చేసి ఊరట కల్పించింది. తమ కూతురిని అత్తింటి వారు తీవ్రంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబీకులు ఆరోపించారు. టీవీ చూడనిచ్చే వారు కాదని.. గుడికి కూడా వెళ్లనీయకపోయే వారని.. తెల్లవారు జామున 1.30 గంటలకు లేపి మంచి నీరు పట్టమనే వారని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై అత్తింటి వారు స్పందిస్తూ.. తమ ప్రాంతానికి ఆ సమయంలోనే మంచి నీరు వచ్చేదని.. తాము కూడా కోడలితో పాటు నీరు పట్టే వారమన్నారు. అయితే ఇవన్నీ ఇంటి వ్యవహారాలని.. ట్రయల్ కోర్టు పేర్కొన్నట్లు 498 (ఏ) ప్రకారం మానసిక, శారీరక క్రూరత్వం కిందకు రావని హైకోర్టు స్పష్టం చేసింది. ఆమె ఆత్మహత్యకు కారణం అత్తింటి వారేనని చెప్పేందుకు ఏ ఆధారాలు లేవని కోర్టు తెలిపింది. దీంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది.

యడియూరప్ప, శ్రీరాములుపై న్యాయ విచారణ!

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో అవినీతి జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై నాటి సీఎం యడియూరప్ప, అప్పటి మంత్రి బి.శ్రీరాములును న్యాయవిచారణ చేయాలని జస్టిస్ కున్హా కమిటీ సిఫార్సు చేసింది. కొవిడ్ సమయంలో నాటి బీజేపీ ప్రభుత్వం కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తునకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ కున్హా కమిటీని ఏడాదిన్న క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జస్టిస్ కున్హా కమిటీ మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి ఆగస్టు 31న సమర్పించింది. పీపీఈ కిట్‌ల కొనుగోళ్లలో రూ.14 కోట్ల అవినీతి జరిగిందని పేర్కొంటూ, అప్పటి సీఎం యడియూరప్ప, ఆరోగ్యశాఖ మంత్రి బి.శ్రీరాములును న్యాయవిచారణ చేయాలని సిఫారసు చేసింది.

'నేవీ డే' విశాఖ నుంచి పూరీకి మార్పు

విశాఖపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం ఏటా డిసెంబరు 4న విశాఖపట్నంలో నిర్వహించే 'నేవీ డే' సాహస విన్యాసాలను ఈసారి ఒడిశాలోని పూరీ తీరంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజున నౌకాదళంలోని అన్ని విభాగాలు తీరంలో సాహస విన్యాసాలు నిర్వహించడం ఆనవాయితీ. రాష్ట్రపతి, త్రివిధ దళాల అధిపతి కూడా అయిన ద్రౌపదీ ముర్ము ఒడిశా రాష్ట్రానికి చెందినవారు కావడంతో ఈసారి విన్యాసాలు అక్కడ నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఈ విన్యాసాలను వీక్షించేందుకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రమైన విశాఖలో కాకుండా వేరే ప్రాంతంలో నేవీ డే విన్యాసాలు నిర్వహించడం ఇదే ప్రథమం.

ట్రంప్ తొలి దెబ్బ భారతీయులపైనే!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ ప్రచార వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డాక్యుమెంట్ ప్రకారం.. అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తొలి రోజే.. వలసలను నివారిస్తూ ఆయన కార్యనిర్వాహక ఆదేశాలు జారీచేస్తారు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు అమెరికన్ పౌరులై ఉండాలని.. లేదా చట్టబద్ధ శాశ్వత నివాసులై (పర్మినెంట్ రెసిడెన్స్-పీఆర్) ఉండాలని.. అప్పుడే వారి పిల్లలు ఆటోమేటిగ్గా అమెరికన్ పౌరులవుతారని.. లేదంటే వారిని స్వదేశాలకు పంపించివేయాలని ఫెడరల్ ఏజెన్సీలకు ఉత్తర్వులు ఇస్తారు. అంటే.. భవిష్యత్‌లో అమెరికా పౌరులు కాని.. శాశ్వత నివాసులు కాని దంపతులకు అక్కడ పుట్టిన పిల్లలు సహజ ప్రక్రియ ద్వారా వారు ఆటోమేటిక్ పౌరులవడానికి అర్హులు కారు. ట్రంప్ తన ప్రతి ప్రచార సభలో కూడా.. అమెరికన్ చరిత్రలోనే అతిపెద్ద డిపోర్టేషన్ (అక్రమ వలసదారులు స్వదేశాలకు అప్పగింత) కార్యక్రమాన్ని అధ్యక్షుడిగా మొదటి రోజే ప్రారంభిస్తానని ప్రకటించారు. అధికారిక గణాంకాలు లేనప్పటికీ.. 2023 మొదటి త్రైమాసికం నాటికి ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డు (అమెరికా పౌరసత్వం) కోసం ఎదురుచూస్తున్న భారతీయుల సంఖ్య పది లక్షలు దాటిందని ఒక అంచనా. గ్రీన్‌కార్డు కోసం వీరి వెయిటింగ్ కాలపరిమితి సగటున 50 ఏళ్లకుపైనే ఉంటుంది. దీనిప్రకారం అమెరికాలో చదువుకునేందుకు లేదా ఉద్యోగం చేసుకోవడానికి వెళ్లిన 5లక్షల మందికిపైగా యువ వలసదారులు.. పౌరసత్వం రాకముందే మరణించే అవకాశముంది. అలాగే దరిదాపుగా రెండున్నర లక్షల మంది పిల్లల వయసు 21 ఏళ్లు దాటుతుంది. విద్యార్థి వీసా వంటి ప్రత్యామ్నాయ వీసా గనుక లేకపోతే వారు అక్రమ వలసదారులవుతారు. ఈ నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని అమెరికన్ న్యాయ నిపుణులు అంటున్నారు. 14వ సవరణను అది ఉల్లంఘిస్తోందని చెబుతున్నారు. ఈ



14వ సవరణలోని ఒకటో సెక్షన్ ప్రకారం.. అమెరికాలో పుట్టిన.. సహజ ప్రక్రియ ద్వారా పౌరులైన వారంతా అమెరికన్ పౌరులే. వారు నివసిస్తున్న రాష్ట్రానికి చెందినవారే. అమెరికా పౌరుల హక్కులు, రక్షణలను నియంత్రించే ఎలాంటి చట్టాలనూ రాష్ట్రాలు చేయరాదు.. అమలు చేయకూడదు. అయితే 14వ సవరణకు సరైన భాష్యం తామే చెబుతున్నామని ట్రంప్ జారీచేయబోతున్న కార్యనిర్వాహక ఆదేశాల ముసాయిదాలో పేర్కొనడం గమనార్హం. 2022 అమెరికా జనాభా లెక్కలను విశ్లేషించిన 'ప్యూ రీసెర్చ్' సంస్థ.. 'అమెరికాలో స్థిరనివాసం ఏర్పరచుకున్న భారతీయ అమెరికన్లు 48 లక్షల మంది. వీరిలో 16 లక్షల మంది అమెరికాలోనే పుట్టి పెరిగి సహజ పౌరులుగా మారారు' అని తెలిపింది. కాగా, ట్రంప్‌ను హత్యచేసేందుకు ఇరాన్ పన్నిన కుట్రను ఎఫ్‌బీఐ భగ్నం చేసింది. ఫర్హాద్ షకేరీ అనే ఆఫ్ఘన్ పౌరుడికి ఐఆర్‌జీసీ ఈ బాధ్యతలు అప్పగించిందంటూ ముగ్గురిపై అమెరికా న్యాయ విభాగం ఫెడరల్ కోర్టులో అభియోగాలు మోపింది. ఈ కేసులో ఇప్పటికే మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. అధ్యక్ష ఎన్నికలకు ముందే ట్రంప్‌ను హత్య చేయాలని ఐఆర్‌జీసీ ఆదేశించినా షకేరీ కావాలనే ఆలస్యం చేశాడు. ఎన్నికల్లో ఓటమిపాలయ్యాక ట్రంప్‌ను హత్య చేయడం సులభమని భావించి పథకాన్ని వాయిదా వేసుకున్నాడు.

భారత విద్యార్థులకు కెనడా షాక్

ఫాస్ట్ ట్రాక్ స్టూడెంట్ వీసా ప్రక్రియ రద్దు

అట్టవా, నవంబరు 9: కెనడాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే భారతీయ విద్యార్థులకు ట్రూడో ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థులు త్వరగా వీసాలు పొందడానికి సహాయపడే ఫాస్ట్ ట్రాక్ స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్) ప్రోగ్రామ్‌ను ఈ నెల 8నుంచి నిలిపివేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటించింది. ఎస్‌డీఎస్‌తో పాటు నైజీరియా నుంచి స్టడీ పర్మిట్ దరఖాస్తులను స్వీకరించే నైజీరియా స్టూడెంట్ ఎక్స్‌ప్రెస్(ఎన్ఎస్ఈ)ని కూడా రద్దు చేస్తున్నట్లు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) ప్రకటించింది. భారత్ సహా 14 దేశాలకు చెందిన విద్యార్థులకు వీసా దరఖాస్తులను వేగవంతం చేసే ఉద్దేశంతో 2018లో ఎస్‌డీఎస్‌ను ప్రారంభించారు. 2022లో మన దేశానికి చెందిన 80శాతం మంది ఈ విధానంలోనే వీసా పొందారు. 2023 జనవరి నుంచి మార్చి వరకూ వీసా కోసం దరఖాస్తు చేసిన ప్రతి ఐదుగురు భారతీయ విద్యార్థుల్లో నలుగురు ఎస్‌డీఎస్ ద్వారా చేసుకున్నారు. వీరిలో 76 శాతం మందికి వీసాలు మంజూరయ్యాయి. ఇదే సమయంలో రెగ్యులర్ విధానంలో వెళ్లిన వారిలో 8శాతం మందికి మాత్రమే వీసా లభించింది. కాగా కెనడాలో పెద్దసంఖ్యలో ఖలిస్థానీ మద్దతుదారులు ఉన్నారని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ఎట్టకేలకు అంగీకరించారు. అయితే వారు మొత్తంగా సిక్కు సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కాదని చెప్పుకొచ్చారు. అదేవిధంగా భారత ప్రధాని మోదీ ప్రభుత్వానికి మద్దతుదారులు కూడా తమ దేశంలో ఉన్నారని, హిందూ కెనడియన్లు అందరికీ వారు ప్రాతినిధ్యం వహించరని అభిప్రాయం వ్యక్తం చేశారు. అట్టవా పార్లమెంట్ హిల్‌లో ఇటీవల నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్న ట్రూడో ఈ వ్యాఖ్యలు చేశారు.

వీసా మోసాల కేసులో నేరం ఒప్పుకొన్న ముగ్గురు ఎన్ఆర్ఐలు

» శిక్షలు విధించనున్న అమెరికా కోర్టు

కాలిఫోర్నియా, నవంబరు 9: ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి, తప్పుడు మార్గాల్లో వీసాలు ఇప్పించామని ముగ్గురు భారత సంతతి వ్యక్తులు నేరాన్ని అంగీకరించారు. ఈ విషయాన్ని నార్తరన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియాలోని అటార్నీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. కాలిఫోర్నియాలో నివసించే కిశోర్ దత్తపురం (55), కుమార్ అశ్వపతి (55), సంతోష్ గిరి (48)లపై కేసు నమోదయింది. నానోసెమాంటిక్స్ పేరుతో నైపుణ్యంగల కార్మికులను సరఫరా చేసే కంపెనీని కిశోర్, అశ్వపతిలు నిర్వహిస్తున్నారు. న్యాయ సహాయం అందించేందుకు లెక్స్‌గిరి పేరుతో సంతోష్ గిరి సొంతంగా మరో సంస్థను నడుపుతున్నాడు. విదేశీయులు తాత్కాలిక ప్రాతిపదికన అమెరికాలో ఉద్యోగాలు చేసేందుకు ఉద్దేశించిన హెచ్-1బీ వీసాల్లో వీరు అక్రమాలకు పాల్పడినట్టు అమెరికా పోలీసులు గుర్తించారు. అశ్వపతికి విధించే శిక్షపై ఈ నెల 25న విచారణ జరగనుంది. కిశోర్, సంతోషగిరిలకు విధించే శిక్షపై ఫిబ్రవరి 24న విచారణ జరగనుంది. వీరికి పదేళ్ల జైలు శిక్ష, 2.50లక్షల డాలర్ల(సుమారు రూ.2కోట్లు) ఫైన్ విధించే అవకాశం ఉంది.

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తత

న్యూఢిల్లీ, నవంబరు 9: బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. ఇస్కాన్ సంస్థను నిషేధించాలని చిట్టగాంగ్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ హెఫాజత్ ఎ ఇస్లాం పిలుపునివ్వడంతో వివాదం నెలకొంది. ఛట్టోగ్రాంలో ఇటీవల జరిగిన ఓ ప్రదర్శనలో హెఫాజత్ కార్యకర్తల నినాదాల వీడియో ను ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇస్కాన్‌పై దాడి చేయాలని, కార్యకర్తలను చంపాలని కొందరు నినదించడం ఆ వీడియోలో కనిపించింది. ఇస్కాన్ భక్తులకు ముప్పు ఉందని తస్లీమా ఆందోళన వ్యక్తంచేశారు.

రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేయడమే కాంగ్రెస్ విధానం: జైరామ్

న్యూఢిల్లీ, నవంబరు 9: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టడం, ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు విధించిన పరిమితులను ఎత్తివేయడమే కాంగ్రెస్ పార్టీ విధానమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. తెలంగాణలో కుల గణన ప్రారంభించిన నేపథ్యంలో శనివారం 'ఎక్స్'లో ఆయన ఈ మేరకు ఓ పోస్ట్ చేశారు. 1931 తర్వాత తొలిసారిగా తెలంగాణలో కుల గణన చేపట్టం ఓ విప్లవాత్మకమైన నిర్ణయం అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను సాకారం చేయడంతోపాటు అంబేడ్కర్ ఆదర్శాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. రాహుల్ ఇటీవల హైదరాబాద్‌లో పేర్కొన్నట్టు తెలంగాణలో జరుగుతున్న కుల గణన దేశానికి ఆదర్శం కావాలని తెలిపారు.

ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు.. ఆరెస్సెస్‌పై నిషేధం!

ఎంవీఏకు మద్దతివ్వడానికి ఉలేమా బోర్డు షరతులు

ముంబై/న్యూఢిల్లీ, నవంబరు 9: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)కి మద్దతు ఇచ్చేందుకు అఖిల భారత ఉలేమా బోర్డు ముందుకొచ్చింది. ఎంవీఏ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తామని ఆ కూటమి నాయకులకు రాసిన లేఖలో పేర్కొంటూ పలు షరతులు విధించింది. ప్రధాన షరతులివీ.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దుకు ఎంవీఏ కృషి చేయాలి. ఎంవీఏ అధికారంలోకి వస్తే మహారాష్ట్ర వక్ఫ్ బోర్డుకు రూ.1,000 కోట్లు కేటాయించాలి. రాష్ట్రంలో ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. ఆరెస్సెస్ పై నిషేధం విధించాలి.

రాష్ట్రాలను ఏటీఎం చేసుకున్నారు

వనరులను దోపిడీ చేస్తున్నారు.. మహారాష్ట్రను ఏటీఎం కానివ్వం

» కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని

» మహారాష్ట్రలో మోదీ సుడిగాలి పర్యటన

నాగ్‌పూర్/నాందేడ్, నవంబరు9: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆ రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేశారు. నాగ్‌పూర్ సమీపంలోని అకోలా, నాందేడ్ సహా పలు నియోజకవర్గాల్లో బీజేపీ నేతృత్వంలోని 'మహాయుతి' కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలను ఆ పార్టీ నేతలు, ముఖ్యంగా రాజకుటుంబం ఏటీఎంలుగా భావిస్తోందని, రాష్ట్రాల ఆర్థిక మూలాలను దోపిడీ చేస్తోందని దుయ్యబట్టారు. తాము అంబేడ్కర్ వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్.. రాజ్యాంగ నిర్మాత కోసం ఏం చేసిందో చెప్పాలన్నారు. అకోలా నియోజకవర్గంలో ప్రధాని మాట్లాడుతూ.. "ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందో ఆ రాష్ట్రం ఆ రాజ కుటుంబానికి ఏటీఎం. కానీ, మహారాష్ట్రను మాత్రం వారికి ఏటీఎం కానివ్వబోం" అన్నారు. "అంబేడ్కర్ పంచతీర్థాలను మీరెప్పుడైనా సందర్శించి ఉంటే నిరూపించండి" అని కాంగ్రెస్ నేతలకు ప్రధాని సవాల్ విసిరారు. అంబేడ్కర్ జన్మస్థలం మౌ, లండన్‌లోని ఆయన నివాసం, నాగ్‌పూర్‌లోని దీక్షా భూమి, ఢిల్లీలోని అంబేడ్కర్ మహాపరినిర్వాణ స్థల్, ముంబైలోని చైత్యభూమిలను అంబేడ్కర్ పంచతీర్థాలుగా అభివర్ణించారు.


మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మోదీ

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో హరియాణా ప్రజలు ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీ కుట్రను భగ్నం చేశారని, మహారాష్ట్ర ప్రజలు కూడా ఐక్యంగా ఉండి కాంగ్రెస్ కుట్రలను ఛేదించాలని ప్రధాని పిలుపునిచ్చారు. "కాంగ్రెస్ కులాల మధ్య చిచ్చుపెడుతోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ కూటవి ి అవినీతి, కుంభకోణాలకు పరాకాష్ఠ. ఆ కూటమి నేతలు లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు" అని నిప్పులుచెరిగారు. నాందేడ్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, దళితులు, ఆదివాసీలు ఐక్యంగా ఉండడంతో కాంగ్రెస్ పునాదులు కదిలిపోతున్నాయన్నారు. "కాంగ్రెస్‌నేతలు ఇటీవల రెడ్ బుక్ చూపుతున్నారు. దీనికి 'భారత రాజ్యాంగం' అని పేరు పెట్టారు. కానీ, లోపలన్నీ ఖాళీ పేజీలే. ఆ పార్టీ నేతల దురదృష్ట, దౌర్భాగ్యకర రాజకీయాలతో దేశం దిగ్భ్రాంతికి గురవుతోంది" అని మోదీ అన్నారు.

మోదీ జీ.. తెలంగాణలో కులగణన మొదలైంది

» త్వరలో మహారాష్ట్రలోనూ

» దేశవ్యాప్తంగా కులగణనను మీరు ఆపలేరు: రాహుల్


న్యూఢిల్లీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): "మోదీ జీ తెలంగాణలో శనివారం కులగణన మొదలైంది. కులగణన లెక్కల ఆధారంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి విధానాలను రూపొందిస్తాం. త్వరలో మహారాష్ట్రలోనూ ఇదే జరగనుంది. దేశంలో సమగ్ర కులగణన చేపట్టడం బీజేపీకి ఇష్టంలేదన్న సంగతి అందరికీ తెలుసు. దేశవ్యాప్తంగా కుల గణనను మీరు ఆపలేరు. ఈ పార్లమెంట్‌లోనే కులగణనను ఆమోదింపజేసేలా చేసి రిజర్వేషన్లపై 50శాతం గోడను బద్దలు కొడతాం" అని రాహుల్ గాంధీ శనివారం 'ఎక్స్'లో స్పష్టంచేశారు. మరోవైపు శనివారం ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్, జంషెడ్‌పూర్‌లలో ఎన్నికల ర్యాలీల్లో రాహుల్ మాట్లాడుతూ, దేశంలో ఓ సామాన్యుడు ఎంతైతే పన్ను చెల్లిస్తున్నాడో అదానీ కూడా అంతే పన్ను కడుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వ పన్నుల విధానం పేదవారిని దోపిడీ చేసేలా ఉందని ఆయన విమర్శించారు.

పాకిస్థాన్‌లో ఫిదాయీ దాడి.. 27 మంది దుర్మరణం

» మృతుల్లో 14 మంది సైనికులు

» బలూచిస్థాన్‌లోని క్వెట్టా రైల్వే స్టేషన్‌లో సైనికులే లక్ష్యంగా మానవబాంబు

» 62 మందికి గాయాలు


పేలుడులో ధ్వంసమైన రైల్వే స్టేషన్

ఇస్లామాబాద్, నవంబరు 9: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో మానవబాంబు దాడిలో 27మంది దుర్మరణంపాలయ్యారు. వారిలో 14మంది సైనికులు ఉన్నారు. మరో 62 మంది తీవ్రగాయాలపాలవ్వగా.. వారిలో 46మంది జవాన్లు ఉన్నారు. క్షతగాత్రుల్లో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బలూచిస్థాన్ ఐజీ మహమ్మద్ జా అన్సారీ, క్వెట్టా ఎస్పీ మహమ్మద్ బలూచీ కథనం ప్రకారం.. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో నెల రోజులుగా క్వెట్టా-పెషావర్ మధ్య రైలు సేవలు నిలిచిపోయాయి. శనివారం ఉదయమే అధికారులు భారీ భద్రత నడుమ సర్వీసులను పునఃప్రారంభించారు. దాంతో 100 మందికిపైగా ప్రయాణికులు ఉదయమే రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఉదయం 8.25 గంటల సమయంలో టికెట్ కౌంటర్, ప్లాట్‌ఫామ్ మధ్యలో జవాన్లే లక్ష్యంగా ఓ ఫిదాయి(ఆత్మాహుతి దళం) తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు కారణంగా 27 మంది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. వారిలో 14 మంది జవాన్లున్నారని, రైల్వే స్టేషన్‌లో భద్రత బలగాలే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు గుర్తించామన్నారు. కాగా.. ఈ ఘటనకు తమదే బాధ్యత అని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ప్రకటించింది. ఓవైపు బీఎల్ఏ, మరోవైపు ఆఫ్ఘానిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న తహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ) ఖైబర్ పంఖ్తుంఖ్వా, బలూచిస్థాన్‌లలో పాక్ సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతున్నాయి. బీఎల్ఏ ప్రధాన పాకిస్థాన్ నుంచి బలూచిస్థాన్‌కు సంబంధాలు, రవాణా నెట్‌వర్క్‌ను కట్ చేసేలా బాంబుదాడులు చేస్తోంది. కోల్‌పూర్-మాచ్ రైల్వే బ్రిడ్జిని ఆగస్టు 26న పేల్చేసింది.

సారీ నాన్నా అమ్మను చంపేశా

» మంత్రాలు చేస్తూ తనను కెనడా వెళ్లకుండా అడ్డుకుంటోందని ఓ కుమారుడి ఘాతుకం

న్యూఢిల్లీ, నవంబరు 9: 'సారీ నాన్నా! అమ్మను చంపేశా!'..ఓ తండ్రితో పెద్ద కుమారుడు అన్న మాటలవి. హత్యకు కారణం-కెనడా వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, అందుకు మంత్రాలు వేస్తోందని అనుమానించడం... ఢిల్లీలో జరిగిన ఈ దారుణం కలవరపరిచింది. నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి బుధవారం సాయంత్రం తీవ్రగాయాలతో ఉన్న మహిళను తీసుకొచ్చారు. పరిస్థితిని గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు ఫోన్ చేశారు. అక్కడికి వచ్చిన పోలీసు బృందం ప్రాథమిక సమాచారం తెలుసుకొని సంఘటన జరిగిన జైత్‌పూర్‌కు వెళ్లారు. దర్యాప్తు జరిపిన పోలీసులకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి. 31 ఏళ్ల క్రిషన్ కాంత్ తన తల్లిని కత్తితో పొడిచి చంపాడు. వెంటనే ఇంటికి రావాలని తన తండ్రి సుర్జిత్‌కు ఫోన్ చేశాడు. ఆయన వచ్చి చూసే సరికి క్రిషన్ కాంత్ కనిపించాడు. 'క్షమించండి నాన్నా' అని వేడుకున్నాడు. మొదటి అంతస్తులోని ఇంటికి తీసుకెళ్లాడు. తండ్రి ఇంట్లోకి వెళ్లగానే బయట గొళ్లెం పెట్టి పారిపోయాడు. ఇంట్లో తన భార్య గీత రక్తం మడుగులో పడి ఉండడం చూసి సుర్జీత్ నిర్ఘాంతపోయాడు. పొరుగువారి సాయంతో తలుపు తీయించి ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. క్రిషన్‌కాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డ క్రిషన్‌కాంత్ నిరుద్యోగి. కెనడా వెళ్లి అక్కడ ఉద్యోగం చేయాలన్నది అతడి లక్ష్యం. తల్లి గీత మాత్రం వ్యతిరేకించేంది. దీంతో, మంత్రాలు వేసి తన కెనడా ప్రయాణాన్ని తల్లి అడ్డుకుంటోందని అనుమానం పెంచుకున్న క్రిషన్ ఆమెను చంపేశాడు.

జిల్లా కోర్టు నుంచి సర్వోన్నత న్యాయస్థానానికి

» 51వ సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

» రేపు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం

» ఆరు నెలలపాటు బాధ్యతలు



న్యూఢిల్లీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ సంజీవ్ ఖన్నా... న్యాయ వ్యవస్థలో శిఖరాగ్రస్థానానికి చేరుకోనున్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన భారత ప్రధాన న్యాయమూర్తిగా కర్తవ్యాన్ని నిర్వహించనున్నారు. సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగియనుండడంతో మరుసటి రోజునే పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆ రోజు ఉదయం జరిగే కార్యక్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నాతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించనున్నారు. అనంతరం ఆయన అక్కడి నుంచి నేరుగా సుప్రీంకోర్టుకు చేరుకుంటారు. కోర్టు నంబర్-1లో సీజేఐ హోదాలో కేసుల విచారణను ప్రారంభిస్తారు. ఆయన దాదాపు ఆరు నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న తన 65వ పుట్టినరోజుకు ఒకరోజు ముందు పదవీ విరమణ చేయనున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో జస్టిస్ ఖన్నా తన అలవాట్లను మార్చుకోనున్నారు. తనకెంతో ఇష్టమైన మార్నింగ్ వాక్‌కు విరామం ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు ఆయన ప్రతి రోజూ లోధి గార్డెన్ వద్ద ఒంటరిగా మార్నింగ్ వాక్ చేసేవారు. ఇప్పుడు తనను అందరూ గుర్తుపట్టే అవకాశం ఉండడం, భద్రత కారణాలు కూడా ఉండడంతో ఉదయపు నడకకు విరామం ప్రకటించినట్టు సమాచారం.

కుటుంబ నేపథ్యం

జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి జస్టిస్ దేవరాజ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. చిన్నాన్న జస్టిస్ హన్సరాజ్ ఖన్నా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఢిల్లీలోని బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా 1980లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా తీసుకున్నారు. అదే యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరును నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా న్యాయస్థానంలో తొలుత ప్రాక్టీస్ చేశారు. 2004లో ఢిల్లీ ప్రభుత్వం తరఫున నేషనల్ క్యాపిటల్ టెరిటరీకి స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, తన చిన్నాన్న జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా కూర్చొన్న కోర్టు గది నుంచి తన మొదటి రోజును ప్రారంభించారు. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు.

ఆరోగ్యం బాగాలేనందునే

- ప్రభుత్వ నోటీసులకు కొత్తగూడెం సీఈ సంజాయిషీ
- పునరావృతం కాకుండా చూసుకుంటా: ఈఎన్‌సీ

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం టెండర్ల వివాదంలో మంత్రుల ముందే పరస్పర దూషణలకు దిగిన వ్యవహారంలో షోకాజ్ నోటీసులు అందుకున్న ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్(సీఈ) ఎ.శ్రీనివాస్‌రెడ్డి.. ప్రభుత్వానికి సంజాయిషీలిచ్చారు. పరిపాలనాపరమైన అనుమతులు తీసుకోకుండా.. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా టెండర్లు పిలవడాన్ని మాత్రమే తాను తప్పుపట్టానని, ఇందులో వేరే ఉద్దేశాలు లేవని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ నివేదించినట్లు సమాచారం. అయితే.. జరిగిన ఘటనపై చింతిస్తున్నానని, మళ్లీ ఇలాంటివి పునరావృతమవ్వకుండా చూసుకుంటానని ఆయన నివేదించారు. కాగా.. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా.. ప్రభుత్వ ఆదేశాలతోనే టెండర్లు పిలిచినట్లు కొత్తగూడెం సీఈ ఎ.శ్రీనివాస్‌రెడ్డి బదులిచ్చినట్లు తెలిసింది. మధుమేహంతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నందున.. సమావేశంలో నియంత్రణ కోల్పోవడం జరిగిందని, ఇక ముందు తప్పిదాలు జరుగకుండా చూసుకుంటానని, తన ప్రవర్తన పట్ల చింతిస్తున్నానని ఆయన తన సంజాయిషీలో పేర్కొన్నట్లు సమాచారం. వివరణతోపాటు.. తన ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నివేదికలను కూడా జతచేసినట్లు తెలిసింది. ఈ నెల 2న తేదీన సీతారామ ప్రాజెక్టుపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జలసౌధలో నిర్వహించిన సమీక్ష జరిగిన విషయం విదిత మే. పరిపాలన అనుమతుల్లేకుండా ఏ విధంగా టెండర్లు పిలుస్తారని మంత్రులు ప్రశ్నించగా.. ఈఎన్‌సీ, సీఈలు పరస్పరం దూషించుకున్నారు. దాంతో.. వారిద్దరిని సంజాయిషీ కోరాలంటూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాను మంత్రి ఆదేశించారు. దాంతో.. ఈనెల 6న వారిద్దరికీ నోటీసులు జారీ కాగా.. మూడ్రోజుల గడువులోగా ఇద్దరూ సంజాయిషీలిచ్చారు.

నాగార్జునసాగర్‌లో.. టీజీ ఉద్యోగిని అడ్డుకున్న ఏపీ అధికారి

- ఉద్యోగిని నిర్బంధించిన ఏపీ పోలీసులు
- ఉన్నతాధికారుల చర్చలతో ప్రశాంతం
- మా అధికారిదే తప్పు.. బదిలీ చేస్తాం : ఏపీ ఎస్ఈ కృష్ణమోహన్

నాగార్జునసాగర్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ వద్ద శనివారం మరోసారి ఏపీ, తెలంగాణ ఉద్యోగుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. సాగర్ ప్రాజెక్టు(తెలంగాణ) జేఈ కృష్ణయ్య కథనం ప్రకారం.. కుడికాల్వ వద్ద నీటి నిల్వల రీడింగ్ తీసుకునేందుకు వర్క్స్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య ఉదయం 8 గంటల సమయంలో ప్రయత్నించగా.. ఏపీ ఏఈ వెంకటసుబ్బయ్య అతణ్ని అడ్డుకున్నారు. దీంతో వీరయ్య ఉన్నతాధికారులకు ఫోన్‌లో విషయం చెప్పారు. ఉదయం 10 గంటల సమయంలో ఏపీ పోలీసులు అతణ్ని రైట్‌బ్యాంక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెంకటసుబ్బయ్యతో వివాదం గురించి గంటపాటు విచారించి, వదిలిపెట్టారు. దీనిపై తెలంగాణ నీటిపారుదల ఎస్ఈ శ్రీధర్‌రావు ఏపీ అధికారితోపాటు.. కృష్ణానది నిర్వహణ మండలి(కేఆర్ఎంబీ) అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో.. ఏపీ ఎస్ఈ కృష్ణమోహన్ డ్యామ్ వద్దకు వచ్చి, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. తమ ఏఈ వెంకటసుబ్బయ్య తీరు వల్లే ఇలా జరిగిందని, అతణ్ని వేరే ప్రాంతానికి బదిలీ చేస్తామని సర్దిచెప్పారు. సమన్వయలోపంతో జరిగిన వివాదాన్ని పెద్దదిగా చేయొద్దని విజ్ఞప్తి చేశారు. దాంతో వివాదం సద్దుమణిగింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తెలంగాణ ఉద్యోగులు కుడికాల్వ వద్ద రీడింగ్ నమోదు చేసుకున్నట్లు జేఈ కృష్ణయ్య వివరించారు.

మహేశ్వరం కేసు పునఃపరిశీలన!

- పీఎంఎల్ఏ కింద కేసు నమోదు కోసమే!
- ఈడీ అభ్యర్థనతో సమీక్షిస్తున్న పోలీసులు
- రాచకొండ సీపీకి డీజీపీ జితేందర్ ఆదేశం
- అవసరమైతే ఎఫ్ఐఆర్‌లో మరికొందరి పేర్లు!
- కొత్తగా కేసులూ నమోదు చేసే అవకాశం

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో వందల కోట్ల రూపాయల విలువైన భూ బదలాయింపుల కేసులో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభ్యర్థన మేరకు ఈ కేసును పోలీసులు మరోసారి పరిశీలిస్తున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్న క్రమంలో అందిన ఫిర్యాదుల నేపథ్యంలో.. ఇందులో నిధుల బదలాంపునకు సంబంధించి ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) ప్రకారం ముందుకెళ్లే యోచనలో ఈడీ అధికారులు ఉన్న విషయం తెలిసిందే. ఇందుకోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాల్సిన అవసరం ఉండడంతో ఈడీ అధికారుల బృందం శనివారం రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను కలిసి చర్చించింది. కేసుకు సంబంధించిన వివరాలతో లేఖను అందజేసింది. మహేశ్వరం పోలీసులు నమోదు చేసిన కేసును పునఃపరిశీలించడంతోపాటు రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్ పాత్రపైనా కూలంకశంగా దర్యాప్తు చేయించేలా స్థానిక పోలీసులను ఆదేశించాలని డీజీపీని ఈడీ అధికారులు కోరారు. ఈ మేరకు మహేశ్వరం కేసును మరోసారి పరిశీలించాల్సిందిగా రాచకొండ సీపీ సుధీర్‌బాబును డీజీపీ జితేందర్ ఆదేశించారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు సివిల్ స్వభావం కలిగి ఉండడంతో అందుకనుగుణంగా చర్యలు తీసుకున్న పోలీసులు.. తాజాగా వాటిని మరోసారి సమీక్షిస్తున్నారు. ఈడీ అధికారులు ఇచ్చిన లేఖ, అందులో పేర్కొన్నవారి ప్రమేయంపైనా దృష్టి సారించారు. పాత కేసులను పూర్తిస్థాయిలో విశ్లేషించి, అవసరమైతే కొత్తగా మరికొందరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చడం లేదా కొత్తగా కేసులు నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది. ఇందుకు అవసరమైన న్యాయసహాయాన్ని కూడా అధికారులు తీసుకుంటున్నారు. మహేశ్వరంతోపాటు శంకర్‌హిల్స్ సొసైటీ, బాలసాయిబాబా ట్రస్ట్ భూములు, రాయదుర్గంలోని మరికొన్ని భూముల బదలాయింపులపైనా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

కొర్రెములలోని తిరిగి ప్రభుత్వ భూమిగా మారిన భూమి ఇదే..



100 కోట్ల ప్రభుత్వ భూమి భద్రం!

(మొదటి పేజీ తరువాయి)

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కథనానికి కలెక్టర్ స్పందించారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ పంచాయతీ, కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వే నం.174లో 18 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమి ఉండగా 2017లో నాటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 6 ఎకరాల 12 గుంటల భూమిని కేటాయించింది. వంద కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసిన ఓ మాజీ ప్రజాప్రతినిధి, కుటుంబ సభ్యులు నీరుడి రామరావు,నీరుడి జంగయ్య, నీరుడి కిష్టయ్య, నీరుడి జంగమ్మ, నీరుడి సత్తయ్యలు నకిలీపత్రాలతో 12ఎకరాల భూమికి తమ పేరుపై పట్టాదారు పాసుపుస్తకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. విచారణ జరిపిన నాటి తహసీల్దారు ఆ దరఖాస్తును తిరస్కరించారు. మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 2023 అక్టోబరు 12న కలెక్టర్ అమోయ్‌కుమార్ బదిలీ అయ్యే రోజే 12 ఎకరాల ఆ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట బదలాయించారు. సర్వే నం.174/1/1/1/1/2లో నీరుడి జంగయ్య తండ్రి వెంకయ్యకు 3 ఎకరాలు, 174/2లో నీరుడి రామారావు తండ్రి సత్తయ్యకు 3 ఎకరాలు, 174/1/2లో నీరుడి జంగమ్మ భర్త అంజయ్యకు 2ఎకరాలు, 174/1/1/2లో నీరుడి సత్తమ్మ భర్తకు 2 ఎకరాలు, 174/1/1/1/2లో నీరు డి కిష్టయ్యకు 2 ఎకరాల చొప్పున కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. దీనిపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో కలెక్టర్ గౌతమ్ నివేదిక తెప్పించుకొని, వెంటనే రికార్డులను మార్చినట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు.

అణగారిన వర్గాలకు న్యాయమే ధ్యేయం

- న్యాయ సేవాధికార సంస్థ సేవలపై హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్

వరంగల్ లీగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదలు, అణగారిన వర్గాలకు న్యాయం అందించడం, వారి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పని చేస్తోందని ఆ సంస్థ చైర్మన్, హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ అందిస్తున్న సేవలపై పారాలీగల్ వలంటీర్లు.. కక్షిదారులకు అవగాహన కల్పించాలని, అలాగే ఈ సేవల విషయాన్ని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాలు కూడా గ్రామాల్లో గడప గడపకూ తీసుకువెళ్లాలన్నారు. హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ మౌసమీ భట్టాచార్య వర్చువల్‌గా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన కక్షిదారులకు న్యాయం అందించడానికి న్యాయ సేవా సంస్థ కృషి చేస్తోందన్నారు. సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి, వరంగ్ జిల్లా జడ్జి వివి నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్ రమేశ్‌బాబు, జడ్జిలు, ఆ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్యే మార్గదర్శకం

కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ మూర్తి

కంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించడమే మార్గదర్శకం కావాలని కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ మూర్తి అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శనివారం మానసిక ఒత్తిడి నిర్వహణపై దేశంలోనే తొలిసారిగా జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ మూర్తి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సంక్షేమం పెంపొందించడానికి యూజీసీ, కేంద్ర ప్రభుత్వాలు ఏడాదిన్నరగా మార్గదర్శకాలు రూపొందిస్తున్నాయన్నారు. ఈ సదస్సులో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 60వేల కోట్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

- ధరణి వచ్చాక రెవెన్యూ అధికారుల భూ దందా
- రిటైర్డ్ రెవెన్యూ అధికారుల సంఘం ఆరోపణ
- దర్యాప్తు కోసం సీఎంతో పాటు కేంద్ర విజిలెన్స్‌కు లేఖ

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ ఏర్పాటు చేసిన తరువాత కొంత మంది రెవెన్యూ అధికారులు, ఉన్నత స్థానంలో ఉన్నవారు చట్టవిరుద్ధంగా ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అప్పగించారని, ఈ క్రమంలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అయ్యాయని రిటైర్డ్ రెవెన్యూ అధికారుల సంఘం ఆరోపించింది. ఈ భూదందాపై దర్యాప్తు జరిపించాలని కేంద్ర విజిలెన్స్ కమిషన్, సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు పలు విచారణ ఏజెన్సీలకు లేఖ రాసింది. రిటైర్డ్ రెవెన్యూ అధికారుల సంఘం కోర్‌కమిటీ హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో శనివారం సమావేశమై అన్యాక్రాంతమైన భూముల గురించి చర్చించినట్లు కమిటీ చైర్మన్ లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లా గుట్టల బేగంపేటలోని సర్వే నంబరు 63లో 42ఎకరాలు, గోపనపల్లి పరిధిలో సర్వే నంబరు 124/10లో 50ఎకరాలు, సర్వే నంబరు 36,37లో 600ఎకరాలు, హఫీజ్‌పేట సర్వే నంబరు 80లో 20 ఎకరాలు, మోఖిలా దగ్గర సర్వే నంబరు 555లో బిల్లాదాఖల భూములు 150ఎకరాలు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కూకట్‌పల్లి మండలం యల్లమ్మబండ(షాంబిగూడ) పరిధిలో సర్వే నంబరు 57లో 92 ఎకరాలను చట్టవిరుద్ధంగా విక్రయించారని విజిలెన్స్ కమిషన్‌కు రాసిన లేఖలో రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. చేతులు మారిన భూములను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శంషాబాద్‌లో సోమయ్య చౌడమ్మ ఆలయంపై 10 మంది దాడి

- పట్టుకునేందుకు యత్నించిన గ్రామస్థులు.. 9 మంది పరారీ
- ఒక్కరికి దేహశుద్ధి.. పోలీసుల అదుపులో నిందితుడు



దుండగులు దాడి చేసిన చౌడమ్మ ఆలయం

శంషాబాద్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని ఆలయాలపై వరుసగా దాడులు జరుగుతుండడం తీవ్ర కలకలం రేపుతోంది. శనివారం జూకల్ గ్రామ సమీపంలో ఉన్న సోమయ్య చౌడమ్మ దేవాలయంలో ఉన్న అమ్మవారి కళ్లు, ఒంటిపై ఉన్న దుస్తులను దుండగులు తొలగించారు. పది మంది వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని వారిని వెంబడించగా 9 మంది పరారయ్యారని గ్రామస్థులు తెలిపారు. ఓ వ్యక్తి మాత్రం గ్రామస్థులకు చిక్కడంతో అతన్ని చితక బాది ఆలయంలో బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆలయంలో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ క్రమంలో గ్రామస్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటన స్థలంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ రాజేష్ తెలిపారు. గత నాలుగు రోజుల వ్యవధిలో ఎయిర్‌పోర్టు కాలనీలో హనుమాన్ దేవాలయంలో నవవిగ్రహాల ధ్వంసం, కట్టమైసమ్మ దేవాలయంలో ముందు ఉన్న త్రిశూలాన్ని తన్నడం, జూకల్‌లో చౌడమ్మ ఆలయంలోపై వరుస దాడులు జరగడం తీవ్ర కలకలం రేపుతోంది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉన్మాదులను వదిలేయాలా?

■ ఆర్కే RK



కొత్తపలుకు

అలుగుటయే ఎరుగని అజాత శత్రువే అలిగిన నాడు సాగరములన్నియు ఏకము కాకపోవునా!...

పాండవుల తరఫున దుర్యోధనుడి వద్దకు రాయబారిగా వచ్చిన శ్రీకృష్ణుడు ధర్మరాజును దృష్టిలో పెట్టుకొని చేసిన హెచ్చరిక ఇది! సౌమ్యుడుగా కనిపించే ధర్మరాజుకు ఆగ్రహం వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో దుర్యోధనుడిని హెచ్చరించడమే దీని సారాంశం. మహాభారతం నుంచి వర్తమానంలోకి వస్తే, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆగ్రహం తెప్పించిన సోషల్ మీడియా ఉన్మాదులు ఫలితాన్ని అనుభవిస్తున్నారు. తాజా ఎన్నికల్లో అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాలుగు నెలలపాటు మెతకగానే ఉన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం తమను ఏమీ చేయలేదని భావించిన వైసీపీ మద్దతుదారులైన సోషల్ మీడియా ఉన్మాదులు కలుగుల్లో నుంచి బయటకు వచ్చి రెచ్చిపోయారు. నాగరిక సమాజం ఏ మాత్రం ఆమోదించని భాషతో కూటమికి చెందిన ముఖ్యుల ఇళ్లలోని ఆడవాళ్లను దూషించడం మొదలుపెట్టారు.

> ఉన్మాద మూక చర్యలు ఎంత దూరం వెళ్లాయంటే... జగన్‌రెడ్డికి మద్దతుగా ఉన్నంత కాలం షర్మిలమ్మ, విజయమ్మ, సునీతమ్మ అని సంబోధించి.. ఇప్పుడు జగన్‌తో విబేధించగానే పేరు చివర 'అమ్మ'లు తొలగించి షర్మిల, విజయలక్ష్మి, సునీత అంటూ నిందించడం మొదలుపెట్టారు. ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక కేవలం జగన్‌రెడ్డి భార్య భారతీరెడ్డిని మాత్రమే భారతమ్మ అని పిలుచుకుంటున్నారు. అంటే, భారతీ రెడ్డికి మాత్రమే పరువు మర్యాదలు ఉన్నాయి, జగన్‌రెడ్డితో విబేధించేవారు రక్త సంబంధీకులైనా వారికి పరువు మర్యాదలు ఉండవనే కదా! దివంగత రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మికి కూడా దురుద్దేశాలు ఆపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చేతులు కలిపారని నిందించారు. రక్తం పంచుకు పుట్టిన వారి మన్ననలు కూడా పొందలేని జగన్‌రెడ్డి కోసం ఇంతలా బరితెగించాలా అంటే సమాధానం లభించదు.


జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ మొదలైన వారి ఇళ్లలోని మహిళలను దారుణంగా కించపరిచారు. అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే బరితెగింపు కొనసాగింది. దీంతో ముఖ్యమంత్రి మెతక వైఖరిపై తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు రగిలిపోయారు. ఈ నేపథ్యంలోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురంలో మాట్లాడుతూ, పోలీసుల పనితీరును విమర్శించడంతోపాటు హోం శాఖను తాను చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. దీంతో సోషల్ మీడియాలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే విశ్లేషకులు కూటమిలో కుంపట్లు అంటూ విశ్లేషణలు మొదలుపెట్టారు. ఈ విశ్లేషణలు కొనసాగుతున్న దశలోనే సరస్వతి సిమెంట్ కంపెనీలో తన పేరిట, తన భార్య పేరిట ఉన్న షేర్లను తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల అక్రమంగా బదలాయించుకున్నారని ఎన్సీఎల్టీలో జగన్మోహన్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీంతో రాజశేఖర రెడ్డి కుటుంబంలో విబేధాలు రచ్చకెక్కాయి. ఈ విబేధాలకు చంద్రబాబు కారకుడు అంటూ విశ్లేషకులతోపాటు సోషల్ మీడియా ఉన్మాదులు వీడియోలు, పోస్టులు పెట్టారు. ఒకవైపు పవన్ కల్యాణ్ తన ఆవేదనను వ్యక్తం చేయడం, మరోవైపు సోషల్ మీడియా ఉన్మాదుల దాడి తీవ్రమవడంతో అదను కోసం వేచివున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మేల్కొన్నారు. తానేమిటో రుజువు చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని భావించారు. పోలీసు ఉన్నతాధికారులను పిలిపించుకొని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి చెందిన సోషల్ మీడియా ఉన్మాదులపై వేట మొదలైంది. అంతే, జగన్మోహన్‌రెడ్డి కూడా తన పాలనలో ఏం చేసిందీ మరచిపోయి నీతి వ్యాఖ్యలు వల్లెవేయాల్సిన పరిస్థితి! ప్రజాస్వామ్యంలో ప్రశ్నించకూడదా? అని ఆయన వాపోయారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంపీ అని కూడా చూడకుండా రఘురామకృష్ణ రాజును చిత్రహింసలు పెట్టించడమే కాకుండా ఏబీఎన్, టీవీ5 చానళ్లకు చెందిన బాధ్యులపై ఏకంగా దేశద్రోహం కేసులు పెట్టించిన విషయం మరిచారు.

ఇదీ బాబు స్వభావం...

ఏ విషయంలోనైనా ఆచితూచి వ్యవహరించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం. 'ఇనుమును కూడా నానబెడతారు' అని ఆయనపై ఛలోక్తులు వినిపిస్తుంటాయి. అయితే చంద్రబాబు అందరూ అనుకున్నంత మెతక కాదు. అలా కనిపిస్తారంతే! సమయం కోసం వేచిచూస్తారు. ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తారు. దీంతో ఆయనది మెతక వైఖరి అని అందరూ భావిస్తారు. అన్ని సమయాలలో ఆయన మెతక వైఖరితో ఉండరు. ఇప్పుడు తాజా పరిణామాల విషయానికి వద్దాం. సోషల్ మీడియా ఉన్మాదులు తన ఉచ్చులో చిక్కే వరకు ఆయన ఓపిక పట్టారు. తెలుగు తమ్ముళ్లు బుసకొడుతున్నా చంద్రబాబు రెచ్చిపోలేదు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కూటమిలో చిచ్చుగా అభివర్ణించే ప్రయత్నం చేసిన వైసీపీ అనుకూల విశ్లేషకుల దిమ్మ తిరిగేలా పావులు కదిపారు. వైసీపీ అనుకూల విశ్లేషకులు ఒక్కసారిగా రెచ్చిపోయి దాడి చేయడం, అదే సమయంలో పవన్ కల్యాణ్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకోవడాన్ని చంద్రబాబు తనకు అనుకూలంగా మలచుకున్నారు. అంతే, రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా ఉన్మాదుల కోసం వేట మొదలైంది. నిజానికి చంద్రబాబు సంయమనం ప్రదర్శించి ఉండకపోతే ఉన్మాద మూకకు ఇంత త్వరగా చెక్ పెట్టే పరిస్థితి వచ్చేది కాదు. గతంలో జగన్ అధికారంలో ఉన్నప్పుడు అడపా దడపా ఎవరైనా పోస్టులు పెట్టినా తెల్లవారేసరికి వారి ఇంటి ముందు పోలీసులు ప్రత్యక్షమయ్యేవారు. ఎల్జీ పాలిమర్స్ ఉదంతంపై పోస్టును ఫార్వర్డ్ చేసిన రంగనాయకమ్మ అనే సీనియర్ సిటిజన్‌కు ఎదురైన అనుభవాన్ని ఎలా మరచిపోగలం! జగన్‌రెడ్డి అండ చూసుకొని వైసీపీ సోషల్ మీడియా ఉన్మాదులు రెచ్చిపోయారు. నీచమైన భాషను వాడారు. రాజకీయాలతో సంబంధం లేని ఇళ్లలోని ఆడవాళ్లను కూడా దారుణంగా దూషించారు. అయినప్పటికీ అప్పట్లో కూటమి నాయకులు నిస్సహాయంగా ఉండిపోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం మారిన తర్వాత సోషల్ మీడియా ఉన్మాదులు కొద్ది రోజుల పాటు గమ్మునున్నారు. గతంలో చేసిన ఘోరాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇక తమకు ఏమీ కాదని, చంద్రబాబు వల్ల తమకు ప్రమాదం లేదనీ భావించారు. ఈ ప్రభుత్వం తమను ఏమీ చేయదన్న ధీమాతో మరింత రెచ్చిపోవడం మొదలెట్టారు. ఆడ, మగ తేడా లేకుండా తమకు అలవాటైన ముతక భాషను ప్రయోగించారు. వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక వాడే భాషను గమనిస్తే, ఏ సంబంధం లేని వారికి కూడా ఆ బూతుగాళ్లను తన్నాలనిపిస్తుంది. ఇక బాధితుల మనోభావాలు ఎంత దారుణంగా దెబ్బతిని ఉంటాయో ఊహించవచ్చు. తన కూతురు కన్నీళ్లు పెట్టుకోవడాన్ని చూసి తట్టుకోలేకపోయానని పవన్ కల్యాణ్ అన్నారు. రాజకీయాలతో సంబంధంలేని మా బోటి వాళ్ల కుటుంబాలనూ దూషించారు. బూతులను యథేచ్ఛగా వాడారు. ప్రత్యర్థులనుకున్న వారందరిపైనా ఫేక్ వార్తలతో విరుచుకుపడ్డారు. ఇదే అదను కోసం ఎదురుచూస్తున్న చంద్రబాబు తనలోని మరో షేడ్‌ను ప్రదర్శించడం మొదలుపెట్టారు. పవన్ కల్యాణ్ ధర్మాగ్రహాన్ని కూటమిలో చిచ్చుగా అభివర్ణించి మురిసిపోయిన వైసీపీ అనుకూల విశ్లేషకులు నోరు వెళ్లబెట్టే పరిస్థితి వచ్చింది. ఇక సోషల్ మీడియా ఉన్మాద మూకకు చెందిన కొందరు తమను క్షమించమంటూ వేడుకుంటున్నారు.

జగన్‌తో పాటు వచ్చిన జాఢ్యం

వాస్తవానికి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర రాజకీయాలు మారిపోయాయి. బూతులు అధికార భాషగా మారాయి. ముతక భాష మాట్లాడిన వారికే జగన్‌రెడ్డి వద్ద మార్కులు లభిస్తుండటంతో ఆ భాషను వాడటంలో నేతలు పోటీ పడ్డారు. నిండు సభలో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. అప్పట్లో ఈ చర్యల వల్ల తమ రక్తం మరిగినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో చంద్రబాబు అండ్ కో ఉండిపోయారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా చంద్రబాబు విలపించడాన్ని చూశాం! వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో వందలాది మంది సొంత మనుషులను నియమించి రాజకీయ ప్రత్యర్థులను, వారి కుటుంబాలను దూషించడానికి జగన్ వారిని ఉపయోగించుకున్నారు. స్థాయితో సంబంధం లేకుండా జగన్‌రెడ్డితో విబేధించిన వారి ఇళ్లలోని మహిళల వ్యక్తిత్వ హననానికి తెగబడ్డారు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ అదే ధోరణి కొనసాగింది. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబానికి, జగన్‌రెడ్డికి మద్దతుగా ఉండే వారికి మాత్రమే పరువు మర్యాదలు ఉంటాయని, ఎదిరించే వారంతా బజారు మనుషులని చిత్రించే ప్రయత్నం చేశారు. ఉన్మాద మూక చర్యలు ఎంత దూరం వెళ్లాయంటే.. జగన్‌రెడ్డికి మద్దతుగా ఉన్నంత కాలం షర్మిలమ్మ, విజయమ్మ, సునీతమ్మ అని సంబోధించి.. ఇప్పుడు జగన్‌తో విబేధించగానే పేరు చివర 'అమ్మ'లు తొలగించి షర్మిల, విజయలక్ష్మి, సునీత అంటూ నిందించడం మొదలుపెట్టారు. వైఎస్ కుటుంబ సభ్యులు అయినప్పటికీ షర్మిల, సునీతల వ్యక్తిత్వ హననానికి సైతం పాల్పడ్డారు. ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక కేవలం జగన్‌రెడ్డి భార్య భారతీరెడ్డిని మాత్రమే భారతమ్మ అని పిలుచుకుంటున్నారు. అంటే, భారతీ రెడ్డికి మాత్రమే పరువు మర్యాదలు ఉన్నాయి, జగన్‌రెడ్డితో విబేధించేవారు రక్త సంబంధీకులైనా వారికి పరువు మర్యాదలు ఉండవనే కదా! దివంగత రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మికి కూడా దురుద్దేశాలు ఆపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చేతులు కలిపారని నిందించారు. రక్తం పంచుకు పుట్టిన వారి మన్ననలు కూడా పొందలేని జగన్‌రెడ్డి కోసం ఇంతలా బరితెగించాలా అంటే సమాధానం లభించదు.



వారించలేదెందుకు?

ప్రజా జీవితంలో కొనసాగే అర్హత ఒక్కటి కూడా లేని జగన్ రెడ్డి కోసం ఇంత మంది ఉన్మాదులు పుట్టుకురావడం ఆశ్చర్యం కలిగించక మానదు. ముఖ్యమంత్రులుగా ఎంతో మందిని చూశాం. జగన్‌రెడ్డిలా రాజకీయాలను భ్రష్టుపట్టించిన వారిని మాత్రం చూడలేదు! చూడబోము కూడా! ఇప్పుడు పోలీసులు అన్వేషిస్తున్న వర్రా రవీంద్రారెడ్డినే తీసుకుందాం. అతను జగన్ భార్య భారతీ రెడ్డికి అనధికార పీఏ అని అందరికీ తెలుసు. అతడు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఇళ్లలోని ఆడవాళ్లను జుగుప్సాకరంగా దూషించినా సాటి మహిళగా భారతి స్పందించకపోవడంలోని మర్మం అంతుపట్టదు. చివరకు తన ఆడపడుచు, రాజశేఖర రెడ్డి బిడ్డ షర్మిలను అతగాడు దూషించినా వారించే ప్రయత్నం చేయకపోవడం ఏమిటి? దీన్ని బట్టి రాష్ట్రంలో ఉన్మాద పోకడలను పెంచి పోషిస్తున్నది జగన్‌రెడ్డి దంపతులే అని భావించవలసి వస్తుంది. ఒకవైపు రోత మీడియాలో, మరో వైపు సోషల్ మీడియాలో తమ ప్రత్యర్థులను టార్గెట్‌గా చేసుకొని బురద చల్లిస్తున్నదీ జగన్‌రెడ్డి దంపతులు కాదా? అబద్ధాలే ఆలంబనగా రాజకీయాలు చేయడానికి అలవాటుపడిన వారు కాల క్రమంలో ఉన్మాదులుగా మారతారేమో? దీనికి మానసిక శాస్త్రవేత్తలే సమాధానం చెప్పాలి.

దారి తప్పిన 'సోషల్ మీడియా'

సోషల్ మీడియా ఉన్మాదులు అచ్చోసిన ఆంబోతుల్లా రాష్ట్రం మీద పడుతున్నారు. ఇలాంటి ఉన్మాదుల వల్ల సోషల్ మీడియా పూర్తిగా కలుషితమైంది. సోషల్ మీడియా అనేది రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. దాన్ని ఎలా ఉపయోగిస్తామన్నదే కీలకం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో సోషల్ మీడియా పోకడలు వెగటు పుట్టిస్తున్నాయి. ప్రజల మెదళ్లలో విషం నింపుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోకడలు పెరుగుతున్నాయి. మైనర్లు, అంటే పదహారేళ్లలోపు వయసు ఉన్నవారు సోషల్ మీడియా వినియోగించకుండా ఆస్ట్రేలియాలో నిషేధం విధించారు. సోషల్ మీడియా వాడకంలోకి వచ్చినప్పుడు సమాచార వ్యాప్తికి, మార్పిడికి దోహదపడింది. 2014 ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాను ఉపయోగించుకొని రాజకీయంగా లబ్ధి పొందారు. ఆ తర్వాత అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియాను ఆశ్రయించాయి. తమ పార్టీల కార్యకలాపాల ప్రచారం కోసం, సమాచార వ్యాప్తికి ఉపయోగించుకున్నాయి. దీంతో సోషల్ మీడియా ప్రాధాన్యం పెరిగింది. యూట్యూబ్ చానల్స్ ప్రారంభమయ్యాయి. ఆరంభంలో ఆయా పార్టీల అనుకూల ప్రచారానికి మాత్రమే వాటిని వినియోగించేవారు. కాలక్రమంలో ప్రత్యర్థి పార్టీలపై బురద చల్లడానికే ఉపయోగించడం మొదలైంది. జగన్మోహన్‌రెడ్డి వంటి వారు రంగప్రవేశం చేశాక ఇళ్లలోని ఆడవాళ్లను బజారుకు ఈడ్చడం మొదలైంది. ప్రజల మెదళ్లను కలుషితం చేస్తూ వచ్చారు. పార్టీల మీద అభిమానంతో వాటికి అనుకూలంగా ప్రచారం చేయడం వేరు. ఇప్పుడా పరిస్థితులు లేవు. అనుకూల ప్రచారాన్ని మరచిపోయి ప్రత్యర్థి పార్టీలపై విష ప్రచారం చేయించడం కోసం వందలు, వేల మందిని నియమించుకొని భారీ మొత్తాలలో జీతాలు చెల్లిస్తున్నారు. ఈ పోకడల వల్ల ఆయా పార్టీల తరఫున సోషల్ మీడియా వారియర్స్‌గా పిలిపించుకుంటున్న వారి బుర్రలు కలుషితం అవడమే కాకుండా మొత్తం సమాజాన్ని కలుషితం చేస్తున్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి కూడా పులి మీద స్వారీలా మారింది. అలా అని సోషల్ మీడియా వల్లనే ఆ పార్టీల జయాపజయాలు ఆధారపడి ఉంటాయా అంటే అదీ లేదు. మొదట్లో కొంత ఉపయోగపడినా ఇప్పుడా పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ప్రజలు నమ్మడం లేదు. అందుకే సోషల్ మీడియా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేకపోతున్నది. పదేళ్ల క్రితంతో పోల్చితే ఇప్పుడు సోషల్ మీడియా వికృత పోకడలు పోతోంది. యూట్యూబ్ చానళ్లు కూడా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రాజకీయ పార్టీలు వాటిని స్పాన్సర్ చేస్తున్నాయి. జర్నలిస్టులు కూడా ఏదో ఒక సంస్థలో నిలకడగా ఉద్యోగం చేసే విధానానికి స్వస్తి చెప్పి రాజకీయ పార్టీల ప్రాపకంతో యూట్యూబ్ చానళ్లు ప్రారంభిస్తున్నారు. అన్ని పార్టీలకూ ఇలాంటి చానళ్లు ఉన్నాయి. ఏ యూట్యూబ్ చానల్ ఏ పార్టీ కోసం పనిచేస్తున్నదో ప్రజలు ఇట్టే గ్రహిస్తున్నారు. ఫలితంగా వందల కోట్లు వెచ్చిస్తున్నప్పటికీ రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కర్ణుడి చావుకు ఎన్నో కారణాలు అన్నట్టుగా సోషల్ మీడియా విశ్వసనీయత ఇటీవలి కాలంలో దారుణంగా దెబ్బతినింది. దీంతో ప్రజలు వాస్తవాలకోసం మెయిన్ స్ట్రీమ్ మీడియాపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతానికి ప్రింట్ మీడియాకు మాత్రం విశ్వసనీయత మిగిలి ఉంది. తెలుగునాట ప్రింట్ మీడియా విశ్వసనీయతకు కూడా తూట్లు పొడిచే ప్రయత్నాలు జరిగాయి. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డి కూడా సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ కూడా సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అటు జగన్‌రెడ్డి, ఇటు కేసీఆర్ ముఖ్యమంత్రులు అయ్యారు. వారు ముఖ్యమంత్రులు కావడానికి సొంత మీడియా ఎంత ఉపయోగపడిందో తెలియదు కానీ గత ఎన్నికల్లో వారి ఓటమిని మాత్రం తప్పించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల విషయానికి వద్దాం!

> ఏ విషయంలోనైనా ఆచితూచి వ్యవహరించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం. 'ఇనుమును కూడా నానబెడతారు' అని ఆయనపై ఛలోక్తులు వినిపిస్తుంటాయి. అయితే చంద్రబాబు అందరూ అనుకున్నంత మెతక కాదు. అలా కనిపిస్తారంతే! సమయం కోసం వేచిచూస్తారు. ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తారు. దీంతో ఆయనది మెతక వైఖరి అని అందరూ భావిస్తారు. అన్ని సమయాలలో ఆయన మెతక వైఖరితో ఉండరు. సోషల్ మీడియా ఉన్మాదులు తన ఉచ్చులో చిక్కే వరకు ఆయన ఓపిక పట్టారు. తెలుగు తమ్ముళ్లు బుసకొడుతున్నా చంద్రబాబు రెచ్చిపోలేదు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కూటమిలో చిచ్చుగా అభివర్ణించే ప్రయత్నం చేసిన వైసీపీ అనుకూల విశ్లేషకుల దిమ్మ తిరిగేలా పావులు కదిపారు. వైసీపీ అనుకూల విశ్లేషకులు ఒక్కసారిగా రెచ్చిపోయి దాడి చేయడం, అదే సమయంలో పవన్ కల్యాణ్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకోవడాన్ని చంద్రబాబు తనకు అనుకూలంగా మలచుకున్నారు. అంతే, రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా ఉన్మాదుల కోసం వేట మొదలైంది.

అంచనా తప్పింది..

ముఖ్యమంత్రి చంద్రబాబును తక్కువ అంచనా వేసిన జగన్ రెడ్డి ఆయన ఉచ్చులో చిక్కుకున్నారు. కుటుంబంలో తలెత్తిన ఆస్తి వివాదాలు, స్వయంగా విజయలక్ష్మి రంగప్రవేశం చేసి ఆస్తుల పంపకంలో షర్మిలకు అన్యాయం జరిగిందని చెప్పడంతో జగన్ రెడ్డి అప్రతిష్ఠపాలయ్యారు. దీంతో సోషల్ మీడియాలో ఉన్మాద మూకను పర్యవసానాలు ఆలోచించకుండా ఆయన రెచ్చగొట్టారు. అదను కోసం ఎదురుచూసిన చంద్రబాబు ఇప్పుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్మాదులకోసం వేట మొదలవడంతో జగన్‌రెడ్డి నమ్ముకున్న సోషల్ మీడియా ఉన్మాద మూక కలుగుల్లో దాక్కొనే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను కిరాయి సైనికులుగా మార్చుకొని ప్రత్యర్థులను వెంటాడిన జగన్‌రెడ్డి ఇప్పుడు నీతి వ్యాఖ్యలు వల్లె వేస్తున్నారు. పోలీసులను బెదిరిస్తున్నారు. సప్త సముద్రాల ఆవల ఉన్నా పట్టుకుంటానని హెచ్చరిస్తున్నారు. తాను పెంచి పోషించిన ఉన్మాద మూక హద్దులు మీరుతోందని గుర్తించడానికి ఆయన నిరాకరిస్తున్నారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉండగా ఏ స్థాయిలో వేధింపులకు పాల్పడిందీ, ఇప్పుడు అధికారం పోయిన తర్వాత కూడా అచ్చోసిన ఆంబోతుల్లా విరుచుకుపడటాన్ని ప్రజలు గమనిస్తున్నారు. పోలీసులు అరెస్టు చేస్తున్న సోషల్ మీడియా ఉన్మాదుల్లో తొంభై శాతం మంది ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం విశేషం. రాష్ట్రంలో కులోన్మాదాన్ని కూడా జగన్ రెడ్డి ప్రజల్లోకి ఎక్కించారు. ఈ చర్య వల్ల తాము మిగతా సామాజిక వర్గాలకు దూరం అవుతున్నామని ఆ సామాజిక వర్గం ఎంత త్వరగా గుర్తిస్తే వారికి అంత మంచిది. రాజకీయాలతో మతాన్ని ముడిపెట్టకూడదు అన్నట్టుగానే కులాన్ని కూడా ముడిపెట్టకూడదు. అప్పుడే ఆంధ్రప్రదేశ్‌కు మోక్షం లభిస్తుంది.

నైతికతే మా బలం...

జగన్మోహన్ రెడ్డి విలేకరుల సమావేశం పేరిట తాజాగా విడుదల చేసిన వీడియోలో నాపైన కూడా బురద చల్లే ప్రయత్నం చేశారు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే వల్లెవేసే జగన్‌రెడ్డి మా విషయంలో కూడా అలవోకగా అబద్ధం చెప్పారు. పోలీసులు అన్వేషిస్తున్న వర్రా రవీంద్రారెడ్డిని తప్పించడానికి తన భార్య భారతి కడప ఎస్పీకి ఫోన్ చేసినట్టు 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురించారని, సదరు ఫేక్ వార్త ప్రచురించినందుకు నన్ను బొక్కలో వేయాలని పోలీసులను జగన్ డిమాండ్ చేశారు. తీరా చూస్తే 'ఆంధ్రజ్యోతి'లో అటువంటి వార్త ఏదీ ప్రచురితం కాలేదు. నిత్యం అసత్యాలు, అర్ధసత్యాలతో నిండి ఉండే తన రోత మీడియా బాటలోనే 'ఆంధ్రజ్యోతి' కూడా నడుస్తోందని అనుకోవడం జగన్ రెడ్డి వెర్రితనం. నిజంగానే మేము పొరపాటు చేస్తే క్షమాపణ చెప్పే సంస్కారం మాకు ఉంది. అటువంటి సంస్కృతి ఉంటే జగన్‌రెడ్డి దంపతులు ప్రతి రోజూ రోత మీడియాలో వండి వారుస్తున్న అసత్యాలు, అర్ధసత్యాలకు క్షమాపణలు చెబుతూనే ఉండాలి. మురికి కాల్వలో దొర్లే వరాహం రోడ్డు మీద వెళుతున్న వారిని చూసి 'అదేంటీ వారికి నాలాగా మురికంటుకోలేదూ! నాలాగా ఉండకుండా శుభ్రంగా ఉండటం ఏమిటి!' అని ఆశ్చర్యపోతుందట. జగన్‌రెడ్డి వ్యవహారం కూడా అలాగే ఉంది. తాను బొక్కలో ఉండి వచ్చారు కనుక మిగతా వాళ్లందరినీ ఆ బొక్కలోకి తోయాలన్నది ఆయన కోరికలా ఉంది. 'ఆంధ్రజ్యోతి'కి విశ్వసనీయత ఉందని గర్వంగా చెప్పుకోగలం. మీ రోతమీడియాకు ఉన్న విశ్వసనీయత ఏపాటిదో తెలియదా? అందుకే కదా తాజా ఎన్నికల్లో జగన్‌ను ఓటమి నుంచి రోత మీడియా కాపాడలేకపోయిందీ? తప్పు జరిగినప్పుడు అంగీకరించడానికి నైతిక బలం ఉండాలి. తప్పులు చేస్తూ, అబద్ధాలు చెబుతూ జీవించడానికి అలవాటుపడిన వారు తప్పు చేశామని ఎప్పటికీ గుర్తించలేరు. 'ఆంధ్రజ్యోతి'పై అసత్య ప్రచారం చేసి, నన్ను బొక్కలో వేయాలని కోరిన జగన్‌రెడ్డికి ఇప్పటికైనా వాస్తవం తెలిసి ఉండాలి. తప్పుడు ఆరోపణలు చేసినందుకు జగన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా? లేక బొక్కలోకి వెళతారా? అన్నది ఆయనే తేల్చుకోవాలి. దెయ్యాలు వేదాలు వల్లిస్తే వినడానికి రోతగా ఉంటుంది. ఇప్పుడు జగన్‌రెడ్డి నోటి వెంట ప్రజాస్వామ్యం, విలువలు, రాక్షసత్వం, అరాచకం, పోలీసుల దుర్మార్గం... వంటి మాటలు వినపడుతుంటే రోతగానే ఉంటుంది మరి. భరించక తప్పదు!

> 'ఆంధ్రజ్యోతి'పై అసత్య ప్రచారం చేసి, నన్ను బొక్కలో వేయాలని కోరిన జగన్‌రెడ్డికి ఇప్పటికైనా వాస్తవం తెలిసి ఉండాలి. తప్పుడు ఆరోపణలు చేసినందుకు జగన్ రెడ్డి క్షమాపణలు చెబుతారా? లేక బొక్కలోకి వెళతారా? అన్నది ఆయనే తేల్చుకోవాలి.

> వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక వాడే భాషను గమనిస్తే, ఏ సంబంధం లేని వారికి కూడా ఆ బూతుగాళ్లను తన్నాలనిపిస్తుంది. ఇక బాధితుల మనోభావాలు ఎంత దారుణంగా దెబ్బతిని ఉంటాయో ఊహించవచ్చు. తన కూతురు కన్నీళ్లు పెట్టుకోవడాన్ని చూసి తట్టుకోలేకపోయానని పవన్ కల్యాణ్ అన్నారు. రాజకీయాలతో సంబంధంలేని మా బోటి వాళ్ల కుటుంబాలనూ దూషించారు. బూతులను యథేచ్ఛగా వాడారు. ప్రత్యర్థులనుకున్న వారందరిపైనా ఫేక్ వార్తలతో విరుచుకుపడ్డారు. ఇదే అదను కోసం ఎదురుచూస్తున్న చంద్రబాబు తనలోని మరో షేడ్‌ను ప్రదర్శించడం మొదలుపెట్టారు. పవన్ కల్యాణ్ ధర్మాగ్రహాన్ని కూటమిలో చిచ్చుగా అభివర్ణించి మురిసిపోయిన వైసీపీ అనుకూల విశ్లేషకులు నోరు వెళ్లబెట్టే పరిస్థితి వచ్చింది. ఇక సోషల్ మీడియా ఉన్మాద మూకకు చెందిన కొందరు తమను క్షమించమంటూ వేడుకుంటున్నారు.

సనాతన ధర్మంలో మనుస్మృతి భాగమా?

> మనుస్మృతిలో ఉన్న కుల ఆధారిత నియమాలే మొత్తం సనాతనధర్మానికి కేంద్రమని విమర్శకులు చాలామంది తప్పుగా భావిస్తున్నారు. వాస్తవానికి, సనాతనధర్మం వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత వంటి వైవిధ్యపూరిత బోధనలను కలిగి ఉంది. ఇవి కుల వ్యవస్థ కంటే, నైతిక సూత్రాలు, వ్యక్తిగత విధులను (స్వధర్మం) గురించి ఎక్కువగా వివరించుతాయి.


సామాజిక మార్పులు, సమన్యాయం అనే కోణాల నుంచి సనాతనధర్మంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అవి చాలావరకు హిందూ ధర్మ గ్రంథమైన మనుస్మృతిపై కేంద్రీకృతమవుతున్నాయి. హిందూ జీవన విధానంలో మనుస్మృతికి విశేష చారిత్రక ప్రాముఖ్యత ఉన్నది. సమాజంలో అంతస్తులు, కులం, కుటుంబ జీవితంలో మగ—ఆడ పాత్రల గురించి మనుధర్మం చెప్పిన విషయాలు నిశితంగా ప్రశ్నింపబడుతున్నాయి. వర్తమాన కాలంలో వాటి నైతిక అవసరాన్ని విమర్శకులు ఒప్పుకోవడం లేదు. మనుస్మృతిపై ఈ విమర్శ తరచుగా సనాతనధర్మంపై పరోక్ష విమర్శే అవుతోంది. మనుస్మృతిని, సనాతన ధర్మాన్ని ఒకటిగా చేసి సనాతనధర్మాన్ని తప్పుగా అన్వయిస్తున్నారు. మనుస్మృతిలో ఉన్న అసమానతలు సనాతనధర్మంలో భాగమని పొరబడుతున్నారు. సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నారు. మనుస్మృతిని సనాతనధర్మంతో ఎలా ముడిపెట్టారో, మారుతున్న కాలంలో ఆ అనుసంధానాన్ని, ఈనాటి యోగ్యత, విలువ, నైతిక ప్రమాణాలను బట్టి ఎందుకు పునః పరిశీలించాలో, చాలామంది వాదనలోని పస ఏమిటో అర్థం చేసుకుందాం.

సనాతన ధర్మం హిందూ ఆధ్యాత్మికతకు పునాది. శాశ్వతమైన, అందరికీ వర్తించే సూత్రాలను అది ప్రవచిస్తుంది. అవి: సత్యం, ధర్మం, అహింస, ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నంపై కేంద్రీకృతమై ఉన్నాయి. వ్యక్తిగత విముక్తి (మోక్షం) మీద దృష్టిపెట్టిన సనాతనధర్మం, నీతిమంతమైన జీవనం, ప్రపంచ సామరస్యాన్ని నొక్కి చెబుతుంది. ఒక ప్రత్యేక చరిత్ర గ్రంథమైన మనుస్మృతితో పోలిస్తే, సనాతనధర్మం కాలానుగుణంగా మారే స్వభావం కలిగిన ఒక పెద్ద ఆధ్యాత్మిక వ్యవస్థ.

వేద కాలంలోనే సామాజిక విభజనలపై ప్రాథమిక సూచనలు ఉన్నాయి. వర్ణ అనే పదం ఋగ్వేద కాలంలోనే ముందుకు వచ్చింది. ఋగ్వేదంలోని పురుషసూక్తం మంత్రంలో ఈ విషయం ప్రస్తావించబడింది. ఇది ప్రధానంగా వృత్తి ఆధారంగా ఉండేది కాని వంశ పారంపర్యం కాదు. వృత్తినిబట్టి కుల గుర్తింపు ఎక్కువగా ఉండేది. ఉపనిషత్తుల కాలంలో తాత్విక చింతన, సత్యాన్వేషణ పెరిగాయి. అదే కాలంలో సామాజిక విభజనలూ స్థిరపడటం ప్రారంభమైంది. రామాయణ కాలంలో మన సమాజంలో నాలుగు ప్రధాన వర్ణాలు స్థిరపడ్డాయి : బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. బ్రాహ్మణులు విద్యాబోధన, వేదాధ్యయనం చేసేవారు. క్షత్రియులు రాజ్యపాలన, యుద్ధ విద్యలో నిష్ణాతులు. వైశ్యులు వాణిజ్యం, వ్యవసాయంతో జీవించేవారు. శూద్రులు ఇతర వర్ణాలకు సేవలు అందించేవారు. అయితే ఈ వ్యవస్థ సులభంగా మారే సౌలభ్యం ఉండేది. చోరుడు అయిన వాల్మీకి మహర్షిగా మారడం అందుకొక ఉదాహరణ. మహాభారత కాలంలో కూడా వర్ణ వ్యవస్థ కొనసాగినా, వ్యక్తి గుణగణాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కర్ణుడు సూత పుత్రుడిగా పుట్టినా, అతని యోధ గుణాలను గుర్తించి, మహావీరుడిగా గౌరవించారు. ఆ కాలంలో జన్మకంటే కర్మకే ప్రాధాన్యత ఇచ్చిన సమాజం ఉండేది.

బౌద్ధ యుగంలో బుద్ధుడు కుల వ్యవస్థను తీవ్రంగా విమర్శించాడు. ఆయన దృష్టిలో మనిషి విలువ అతని జన్మతో కాదు, కర్మతో నిర్ణయించబడాలి. బౌద్ధ సంఘంలో అన్ని కులాల వారికి ప్రవేశం కల్పించారు. ఇది సమాజంలో సమానత్వ భావనను పెంపొందించింది.

సుమారు క్రీపూ. 200 నుంచి క్రీ.శ. 200 మధ్య కాలంలో విరచితమైన మనుస్మృతి 'మనుధర్మశాస్త్రం'గా సుప్రసిద్ధమయింది. మనుస్మృతి నిర్దేశించిన కుల వ్యవస్థ కఠినమైంది. ప్రతి కులానికి నిర్దిష్ట వృత్తులు, ఆచారాల నిర్ణయాలు, జన్మాధారిత కుల నిర్ణయం, వివాహ నియమాలు, సామాజిక నియంత్రణలు, అంతర్ కుల వివాహాలపై ఆంక్షలు, సామాజిక హోదా పూర్తిగా జన్మ ఆధారితంగా మారింది. ఇది పురాతన హిందూ సమాజానికి వేర్వేరు సామాజిక వర్గాల విధులు, పాలన, మంచి నడవడిక గురించి క్రోడీకరించడానికి ప్రయత్నించింది. ఇది పురాతన హిందూ సమాజాన్ని చాలా ప్రభావితం చేసింది. ఆ కాలంలో సామాజిక క్రమాన్ని నిలబెట్టడానికి కుల వ్యవస్థ, లింగ భేదం ఎలా పనిచేసిందో చూపిస్తుంది. అయితే మనుధర్మ ఆదేశాలు ముఖ్యంగా అంతస్తులు, కులం, స్త్రీ—పురుష విషయాలలో ఈనాటి సమానత్వ విలువలతో పొసగవు. అందుకే సనాతనధర్మంలో మనుస్మృతి స్థానాన్ని పునర్—వ్యాఖ్యానించాలని లేదా పూర్తిగా తిరస్కరించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.



మనుస్మృతిపై విమర్శలు, ముఖ్యంగా కుల కోణం నుంచి వ్యక్తమవుతున్న ఆక్షేపణలు సనాతనధర్మం పట్ల అభిప్రాయాలను ఎందుకు ప్రభావితం చేస్తున్నాయి? కాల క్రమంలో కుల వ్యవస్థ మరింత సంక్లిష్టమైంది. ప్రాంతీయ వృత్తులు, జాతి ఆధారంగా ఉపకులాలు ఏర్పడ్డాయి. కుల ఆధారిత వృత్తులు తరతరాలుగా కొనసాగాయి. అస్పృశ్యత వంటి సామాజిక దురాచారాలు బలపడ్డాయి. ప్రాచీన హిందూ సామాజిక నిర్మాణంలో మనుస్మృతి పోషించిన పాత్రను సనాతనధర్మంతో ముడిపెట్టారు. చాలా హిందూ గ్రంథాలు ఆధ్యాత్మిక, నైతిక విలువలను నొక్కి చెప్పినప్పటికీ, మనుస్మృతి చూపించిన సామాజిక ప్రభావం వల్ల హిందుత్వాన్ని కులంతో ముడిపడి ఉన్నదిగా చూస్తున్నారు. ఇదే కుల వ్యవస్థ సనాతనధర్మంలో అంతర్భాగమని భావించేందుకు దారితీస్తోంది.


ఆదిశంకర, రామానుజ, బసవ, వివేకానంద, అంబేడ్కర్ వంటి సంస్కర్తలు మనుస్మృతిలోని వివక్షపూరిత అంశాలను బహిరంగంగా విమర్శించారు. అంబేడ్కర్ కుల వివక్షను నిరసిస్తూ మనుస్మృతి ప్రతులను బహిరంగంగా తగలబెట్టారు. సామాజిక న్యాయం, మానవ గౌరవంపై ఆధారపడిన ధర్మం కోసం వాదించారు. సనాతనధర్మం కాలానుగుణంగా అందరి మేలుకోసం, అందరినీ కలుపుకుపోయే సమ్మిళిత విలువలతో సరిపోతుందని, మనుస్మృతి నిర్దేశించిన సామాజిక కఠినత్వాలను అధిగమించుతుందని హిందూ మత సంస్కర్తలు వాదించారు. హిందుత్వంపై అవగాహన లోపంతో నవీన విమర్శకులు చాలామంది మనుస్మృతిలో ఉన్న కుల ఆధారిత నియమాలే మొత్తం సనాతనధర్మానికి కేంద్రమని తప్పుగా భావిస్తున్నారు. వాస్తవానికి, సనాతనధర్మం వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత వంటి వైవిధ్యపూరిత బోధనలను కలిగి ఉంది. ఇవి కుల వ్యవస్థ కంటే, నైతిక సూత్రాలు, వ్యక్తిగత విధులను (స్వధర్మం) గురించి ఎక్కువగా వివరించుతాయి.

హిందూ ధర్మ సంప్రదాయానికి ఒకే అధికారిక గ్రంథం లేదు. మనుస్మృతి చారిత్రకంగా సామాజిక నిర్మాణాలను ప్రభావితం చేసినప్పటికీ, భగవద్గీత, ఉపనిషత్తుల వంటి ఇతర గ్రంథాలు ఆధ్యాత్మిక సమానత్వం, వ్యక్తిగత ఎదుగుదల గురించి నొక్కి చెబుతాయి. ఈ గ్రంథాలు ఈనాటి విలువలతో సరిపోతాయి. సామాజికంగా కఠినమైన మనుస్మృతి నియమాల కంటే సనాతనధర్మ ప్రాథమిక విలువలను అవి నొక్కి చెబుతాయి.

మనుస్మృతి మొదట్లో హిందూ సమాజాన్ని రూపొందించినప్పటికీ, దాని సామాజిక సిద్ధాంతాలు, ముఖ్యంగా కులం, స్త్రీ—పురుష సంబంధిత విషయాలు ఆధునిక నైతిక విలువలతో సరిపోవని చాలా మంది నమ్ముతున్నారు. సనాతనధర్మంలోని ప్రధాన విలువలు— సత్యం, ధర్మం, అహింస, నీతిమంతమైన జీవన విధానం మనుస్మృతి నిర్దేశాలను అధిగమిస్తాయి. సామాజిక విలువలు మారుతున్న కొద్దీ హిందూ తత్త్వశాస్త్రం కూడా ప్రాశస్త్యం కలిగి ఉండేలా చేస్తుంది.

మనుస్మృతిని సనాతనధర్మం నుంచి వేరుచేయవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా అంతస్తులు, కుల, లింగ వివక్షలను సనాతనధర్మం ప్రబోధించలేదని, ప్రోత్సహించదని అర్థం చేసుకోవాలి. హిందూ ధర్మానికి ప్రాతిపదికలుగా వేదాలు, ఉపనిషత్తులను మాత్రమే గుర్తించి గౌరవించాలి.

■ నాగళ్ల శివప్రసాద్



కల్యాణం.. కమనీయం..

- కన్నుల పండుగగా అర్ధనారీశ్వరుడి కల్యాణం
- ఆత్మకూరులో ముగిసిన ఆలయ పునర్నిర్మాణ వేడుకలు

వివరాలు : 8లో..



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మెదడుకు పదును పెట్టేలా..

TECHNOZION

- ఆకట్టుకుంటున్న టెక్నోజియాన్ ఈవెంట్లు
- సాంకేతిక ప్రదర్శనలతో విద్యార్థుల సందడి
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- నిట్ క్యాంపస్‌లో 50కిపైగా ఈవెంట్ల నిర్వహణ
- కొత్త విషయాలు తెలుసుకుంటున్నామని స్టూడెంట్స్‌ఆనందం
- స్ఫూర్తినింపిన అతిథుల ప్రసంగాలు



నిట్ క్యాంపస్‌లోకి వస్తున్న విద్యార్థి



సాంకేతిక ప్రదర్శలు, ఆలోచింప చేసే ఈవెంట్లు.. ప్రముఖుల ప్రసంగాలతో వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల శనివారం హోరెత్తింది. టెక్నోజియాన్ - 24లో భాగంగా విద్యార్థులు మొదటిరోజు పలు ఈవెంట్లు ప్రదర్శించారు. వాటిని విపులంగా వివరించారు. చాలా ఈవెంట్లు మెదడుకు పదును పెట్టేవిగా ఉన్నాయి. కొన్ని విజ్ఞానాన్ని కలిగించేవి అయితే.. మరికొన్ని విజ్ఞానంతో పాటు వినోదాన్ని కూడా అందించాయి. దాదాపు అన్ని ఈవెంట్లు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందింపుచ్చుకునేవిలా ఉన్నాయి. దైనందిన జీవితంలో ఎదురయ్యే సవాళ్లను శాస్త్ర, సాంకేతిక ప్రక్రియల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో ఈ ఈవెంట్లు ప్రయోగాత్మకంగా చూపించాయి. ముఖ్యంగా ఫీల్ ద పెయిన్, లెట్ థెమ్ కుక్, బ్రిడ్జి ఫ్యాబ్రికో, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, ఫ్యూచర్ మేనేజర్, సికాడ, చిన్నారుల రోబోటిక్స్, ల్యాబ్రింత్ ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. అలాగే మ్యాథ్స్‌స్కేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్ర పురోహిత్, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూ జైన్‌ల స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఆలోచింపచేశాయి. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిట్‌లో ఏర్పాట్లు బాగున్నాయని కితాబిచ్చారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

8

దోపిడీ దొంగల ముఠా గుట్టు రట్టు

- ముగ్గురి అరెస్టు.. పరారీలో మరొకరు
- రూ.24వేల నగదు, ఆటో, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి

6

పేద, అణగారిన ప్రజల సంక్షేమమే ధ్యేయం

- న్యాయసేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్

6



మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్

నేడు వరంగల్‌కు కేటీఆర్



బాలసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరానికి ఆదివారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు రానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పర్యటనకు వస్తున్న కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సర్వేలో ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలి

- కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి
- ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా సమాచారం ఇవ్వాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి)

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కోరారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే శనివారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో సీఎస్ శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి జిల్లా కలెక్టర్‌లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. కలెక్టర్లు ఎన్యూమరేటర్లతో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సర్వేపై ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, ఈ సందేహాలను ఎన్యూమరేటర్లు ప్రజలకు నివృత్తి చేస్తూ ముందుకెళ్లాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్వేపై ప్రజలతో మమేకం అయితే సందేహాలు ఏమిటో తెలుస్తాయని, తక్షణమే నివృత్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యూమరేటర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వాములయ్యేలా ఆహ్వానించాలని అన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని, ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడతాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సర్వే ఆసాంతం పూర్తయ్యేంతవరకు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్నారని, భాగస్వామ్యమైన కలెక్టర్లను, ఎన్యూమరేటర్లను, ప్రణాళికాశాఖ అధికారులను ఈ సందర్భంగా భట్టి విక్రమార్క అభినందించారు. ఎన్యూమరేటర్లకు సర్వేపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, హౌస్‌లిస్ట్ కూడా విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. ఈ సర్వే మన దేశంలో జరిగే అతి పెద్ద కార్యక్రమమని, సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో విజయవంతం చేయాలన్నారు. మన దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తిచేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సర్వే సమాచారం గ్రామస్థాయిలోని చిట్ట చివరి ఇంటికి చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్‌లతో పాటు అన్నిస్థాయిలలోని అధికారులు సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని, అలాగే పట్టణాలపై దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరింత తొలగించిన భద్రకాళి మత్తడి



భద్రకాళి చెరువు నుంచి తరలిపోతున్న నీరు

- దిగువకు పోతున్న చెరువు నీరు
- ఇప్పటికే 350 క్యూసెక్కుల నీరు తరలింపు
- నీటి నుంచి చేపలు బయటకు పోకుండా వలలు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం చెరువు మత్తడిని మరింత తొలగించి నీటి ప్రవాహాన్ని సుగమం చేశారు. ఇరిగేషన్, మత్స్యశాఖ, కుడా, బల్దియా అధికారులు దగ్గరుండి మరీ పనులు చేయిస్తున్నారు. శనివారం జేసీబీ సహాయంతో మత్తడిని 4 మీటర్ల వెడల్పు తొలగించారు. అదే విధంగా 1 మీటర్ ఎత్తుతో ఉన్న మత్తడిని తొలగించడంతో నీటి ప్రవాహనం పెరిగినట్టు నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు. శుక్ర, శనివారం రెండు రోజుల్లో ఇప్పటి వరకు సుమారు 350 క్యూసెక్కుల నీరు చెరువు నుంచి దిగువ ఉన్న ప్రాంతమైన నాగారం పెద్ద చెరువుకు తరలించినట్టు డీఈ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా ఆదివారం మత్తడి ఎత్తును, వెడల్పును తగ్గిస్తామని అధికారులు తెలిపారు. చెరువులో మొత్తంగా నిలిచి ఉన్న 130 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని 20 నుంచి నెల రోజుల్లో తొలగించవచ్చని నీటిపారుదల శాఖ సీనియర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

చేపల కోసం మత్స్యకారుల వలలు

మత్తడిని తొలగించడానికంటే ముందే వరంగల్, హనుమకొండకు చెందిన వందలాది మంది మత్స్యకారులు వలలు తెచ్చి చేపలు చెరువు నుంచి నీటి ప్రవాహానికి వెళ్లిపోకుండా సామూహికంగా శ్రమించి జాలీలు నిర్మించారు. సుమారు 15 మీటర్ల చెరువు నీటిలో మత్స్యకారులు టెక్నాలజీని ఉపయోగించి వెల్డింగ్ సహాయంతో పైపులు పాతారు. ఇప్పటి వరకు చేపలు వెళ్లిపోకుండా కొందరు మత్స్యకారులు అక్కడే ఉండి కాపుకాస్తున్నట్టు సొసైటీ నాయకులు బయ్య శోభన్‌బాబు తెలిపారు.

రుణమాఫీ తప్పక అవుతుంది..

- సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చితీరుతాం
- ప్రభుత్వాన్ని విమర్శించే నైతికత ప్రతిపక్షాలకు లేదు..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



గర్మిళ్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో మేచర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఐనవోలు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం డిసెంబరు 24 వరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగితీరుతుందని, సన్న రకం ధాన్యానికి బోనస్‌ను ఇచ్చితీరుతామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధి ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి, వెంకటాపురం గ్రామాల్లో శనివారం టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి, కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నందనం సొసైటీ వైస్ చైర్మన్ టి.చందర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం మాట్లాడారు. రాష్ట్రంలో ఈ వానాకాలం 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ఒక అంచనా ఉందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 45వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతుల చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం బ్యాంక్ నుంచి రూ.25వేల కోట్ల రుణం తీసుకొని డబ్బులు ఖాతాల్లో రెండు మూడు రోజుల్లో జమచేస్తుందని తెలిపారు సన్నరకం ధాన్యం బోనస్‌పై అనుమానం వద్దని బోనస్ ఇచ్చేందుకు రూ. వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. ప్రతిపక్షాలు పనికట్టుకొని సృష్టిస్తున్న అపోహలను రైతులు గమనించాలని ఆయన కోరారు.

42లక్షల మంది రైతులకు రుణమాఫీ

ఇప్పటి వరకు 23 లక్షల

» మిగతా 6వ పేజీలో..

అడుగు దూరంలో..

- » విశ్వ విజేత కిరీటానికి చేరువైన ఓరుగల్లు చెస్ దిగ్గజం
- » ఐదు రౌండ్లు ముగిసే సరికి 2808.1 పాయింట్లతో దూసుపోతున్న అర్జున్
- » ఇప్పటికే చెస్ క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో రెండో స్థానం



వరంగల్ స్పోర్ట్స్ నవంబరు 9:(ఆంధ్రజ్యోతి): చదరంగంలో ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ ప్రపంచఖ్యాతిని అందిపుచ్చుకోవడానికి అడుగు దూరంలో ఉన్నాడు మన ఓరుగల్లు చెస్ క్రీడా దిగ్గజం ఇరిగేసి అర్జున్. ఈ నెల 5నుంచి 12వ వరకు చెన్నైలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో 4 రౌండ్లు ఆడి వరుసగా గెలుపొందడంతో క్లాసికల్ చెస్ ఫిడే ఎల్లో రేటింగ్‌లో అర్జున్ ఇప్పటికే రెండో స్థానానికి చేరుకొని చరిత్ర సృష్టించాడు. మొత్తం 9రౌండ్లకు గాను 4రౌండ్లను అధిగమించి 5వ రౌండ్‌లో ఇరాన్ దేశానికి చెందిన పరహంతో ఆడి డ్రా చేసుకోవడంతో 2808.1 ఎల్లో రేటింగ్‌తో ప్రపంచస్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. ఆదివారం తమిళనాడుకు చెందిన గ్రాండ్ మాస్టర్ అరవింద్ చిదరంబరంతో 6వ రౌండ్‌లో తలపడనున్నాడు. వరల్డ్ నెంబర్ 1గా ఉన్న మాగ్నస్ కార్ల్‌సన్ 2831 తర్వాతి స్థానంలో అర్జున్ తన విజయయాత్ర కొనసాగిస్తున్నాడు. కాగా, విశ్వవిజేతగా నిలిచేందుకునేందుకు అర్జున్ అడుగు దూరంలో ఉండటంతో అర్జున్ తల్లిదండ్రులు డాక్టర్ శ్రీనివాసరావు-జ్యోతి దంపతులు ఉమ్మడి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తన మేధోసంపత్తితో భారత్‌ను నంబర్‌వన్ చెస్ విజేతగా ఇప్పటి రికార్డు సొంతం చేసుకున్నాడు. అదే విధంగా 14ఏళ్ల వయస్సులోనే అబుదాబిలో నిర్వహించిన మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో 17వ స్థానంలో గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకొని తెలంగాణ రాష్ట్రంలోనే తొలి స్వర్ణ పతకం సాధించిన ఘనుడు అర్జున్.

పేద, అణగారిన ప్రజల సంక్షేమమే ధ్యేయం

● న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలి ● హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్


లబ్ధిదారులకు వస్తువులు అందజేస్తున్న ప్రధాన న్యాయమూర్తులు

వరంగల్ లీగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేద, అణగారిన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా న్యాయసేవాధికార సంస్థ పని చేస్తోందని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్‌పాల్ మాట్లాడుతూ.. సమాజంలోని పేదలు, అన్నార్థులు, మహిళలు, అంగవైకల్యం కలిగిన వ్యక్తులు తదితర నిస్సహాయతకు గురైన సమూహాల కోసం న్యాయసేవాధికార సంస్థ నిరంతరం పని చేస్తోందని ఆయన అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను పేదలు, కక్షిదారులు పీడిత ప్రజలు ఉచితంగా సద్వినియోగం చేసుకోవా లని న్యాయమూర్తి సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు అంతి మంగా పరిష్కరింపబడతాయ న్నారు. సివిల్ కోర్టుల్లో మాదిరిగా పెండింగ్‌లో ఉండవని ఆయన పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ అం దిస్తున్న సేవలు పారాలీగల్ వలం టీర్లు కక్షిదారులకు అవగాహన కలిగించాలని జస్టిస్ పాల్ సూచించా రు. అలాగే అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాలు గ్రామంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ న్యాయసేవా సంస్థ సేవలను గడప గడపకూ తీసుకువెళ్లాలని న్యాయమూర్తి సూచించారు. చట్టం ముందు అందరు సమానమనే రాజ్యంగ మౌలిక సూ త్రాన్ని అమలు పరిచే విధంగా న్యాయసేవాధికార సంస్థ చిత్తశుద్ధితో పని చేస్తోందని అన్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ మౌషమి భట్టాచార్య వర్చువల్‌గా మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలకు చెందిన కక్షిదారులకు కుల, మతాలకతీతంగా సమన్యా యం అందించడానికి న్యాయసేవ సంస్థ కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. న్యాయసేవాధికారి సంస్థ మెంబర్ సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయం అందించే ప్రక్రియను కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కక్షిదారులకు వివరించాలని, న్యాయసేవా సంస్థలు అందరినీ కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సత్వర న్యాయం, సమన్యా యం న్యాయసే వాధికార సంస్థల విశిష్టతలను గ్రామ స్థాయిలో విస్తృత పరచా లని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి వివి నిర్మాలా గీతాంబ, హనుమకొండ జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి సీహెచ్ రమేష్ బాబు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్ల సత్యశారద, పి.ప్రావీణ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసవాధికార సంస్థల కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, వివిధ ప్రభుత్వ ఉన్నతాధికారులు, వరంగల్, హనుమ కొండ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, ఎం.రమేష్ బాబు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సిరికొండ సంజీవ రావు, బైరపాక జయాకర్, ఉమ్మడి జిల్లాల న్యాయవా దులు, టీడబ్ల్యువో, డీఆర్‌డీఏ, మెప్మా, సఖి, భరోసా, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, డీఎంహెచ్‌వో, చైల్డ్ ప్రొటెక్షన్‌కు చెందినవారు పాల్గొన్నారు.

స్టాల్స్ ఏర్పాటు

ఉమ్మడి జిల్లాల న్యాయసేవాధికార సంస్థలు, ప్రభుత్వ సంస్థల సహకారంతో లబ్ధిపొందినవారు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఉత్పత్తి చేసిన వివిధ వస్తువులను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించారు. టీడబ్ల్యువో, డీఆర్‌డీఏ, మెప్మా, సఖి, భరోసా, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, డీఎంహెచ్‌వో, చైల్డ్‌ప్రొటెక్షన్ ద్వారా లబ్ధిపొందినవారు తామ ఉత్పత్తి చేసి ఉత్పత్తులను ఇందులో ప్రదర్శించారు.

వీల్‌చైర్లు, ట్రైసైకిళ్ల పంపిణీ

అంగవైకల్యం కలిగిన వారికి రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ చేతుల మీదుగా వీల్‌చైర్లు, ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు. టీడబ్ల్యువో, శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్ట్, కేఎస్ఎం ఫౌండేషన్ల ఆర్థిక సహకారంతో వారికి అందజేశారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాలకు చెక్కులను అందచేశారు. కేఎస్ఎం ఫౌండేషన్ ద్వారా రెండు ల్యాబ్ ట్యాబ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ సుజోయ్ పాల్

పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలి

తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ కుర్స పోచయ్య


ప్రెస్ క్లబ్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తుడుం దెబ్బ నేతలు

వడ్డెపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు సాగుచేసుకుంటున్న పోడు భూములకు శాశ్వతపట్టాలు ఇవ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ కుర్స పోచయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోచయ్యతో పాటు రాష్ట్ర కోకన్వీనర్లు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, పోదెం బాబు, ఆగబోయిన రవి, గుర్రాల రవీందర్‌లు మాట్లాడారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వలస వచ్చిన లంబాడీలు తెలంగాణలో ఎస్టీలుగా చెలామణి అవుతూ ఆదివాసీల ఉద్యోగాలను కాజేయడంతోపాటు హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో జిల్లా స్థాయి మహాసభలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సోయం రాజేందర్, పుష్పరాణి, తిరుపతి, రామ్మూర్తి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని డెలివరీ బాయ్ మృతి

● మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన ● పోలీసుల హామీతో ధర్నా విరమణ..

బాలసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఫుడ్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్ ప్రాంతానికి చెందిన బడుగు ఉమాదేవి - వీరస్వామి దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, రెండో కుమారుడైన చంద్రప్రసాద్ (25) ఓ కంపెనీలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. శనివారం హనుమకొండలోని బాలసముద్రం ఫైర్‌స్టేషన్ సమీపంలో చంద్రప్రసాద్ ఓ హోటల్ నుంచి ఆర్డర్ తీసుకుని బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి వేలేరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి చంద్రప్రసాద్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో చంద్రప్రసాద్ బస్సుటైరు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కాగా, ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే చంద్రప్రసాద్ మృతి చెందాడని మృతుడి బంధువులు, డెలివరీ బాయ్స్ బస్టాండ్ సమీపంలో ఆందోళన చేశారు. హనుమకొండ, సుబేదారి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనచేస్తున్న వారితో మాట్లాడారు.

ఈ క్రమంలో కొద్దిసేపు మృతుడి బంధువులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.


మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న చందు ప్రసాద్ బంధువులు

మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. మృతుడు చంద్రప్రసాద్‌కు భార్య, ఒక పాప ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. బస్సు డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


చంద్రప్రసాద్(ఫైల్)

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత పరుపాటి

● కండువా కప్పి ఆహ్వానించిన మాజీ సీఎం కేసీఆర్ ● పాలకుర్తి నియోజకవర్గంలో అధికార పార్టీకి షాక్

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో ఎర్రవెల్లిలో భారీగా చేరికలు

రాయపర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అధికార కాంగ్రెస్ పార్టీకి పాలకుర్తి నియోజకవర్గంలో భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ నేత, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ఎర్రవెల్లి ఫాం హౌజ్‌లో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలవగా.. ఆయనకు కేసీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గతంలో కేసీఆర్‌తో ఉద్యమంలో పాల్గొని మిలియన్ మార్చ్‌లో జైలుపాలైన శ్రీనివాసరెడ్డి.. మారిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్‌లో కొనసాగారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులు సుమారు 500మందితో కలిసి పార్టీలో చేరడం పట్ల కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కొంతకాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పేద వర్గాల ప్రజలకు ఆసరాగా నిలుస్తున్నాడు.


కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితరులు

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో అందరిలోనూ విసుగు : ఎర్రబెల్లి

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజలతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా విసుగు చెందుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరడంతో పాలకుర్తి నియోజకవర్గంలో కొత్త ఉత్తేజాన్ని నింపుతుందని ఆకాంక్షించారున. తాము మరింత ఉత్సాహంతో పనిచేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టంచేశారు. హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం పూటకో కొత్త విషయాన్ని తెరపైకి తెచ్చి పబ్బం గడుపుతోందని, కుల గణన పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే సరైన బుద్ధి చెపుతారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, బిల్లా సుధీర్‌రెడ్డి, కాశీనాథం, వెంకట్‌రెడ్డి, పూస మధు తదితరులు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి కేసీఆర్ చేయూత

రూ.3లక్షల ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సీఎం

పాలకుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తనకు న్యాయం జరగలేదని గత నెలలో పోలీస్‌స్టేషన్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన పాలకుర్తి మండలంలోని కొండాపురం శివారు మేకల తండాకు చెందిన శ్రీను కుటుంబానికి మాజీ సీఎం కేసీఆర్ చేయూతనిచ్చారు. శ్రీను తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి.. శనివారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. దాంతో స్పందించిన కేసీఆర్.. శ్రీను తల్లిదండ్రులు మంగ్రీ, యాకూబ్‌ను ఓదార్చి.. తన వ్యక్తగతంగా రూ.3లక్షల సాయంగా చెక్కును అందజేశారు. శ్రీను కుటుంబానికి న్యాయం జరుగకపోతే జనవరిలో తాను వారి ఇంటికి వస్తానని ఈ సందర్భంగా కేసీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో జరుపుల బాలూనాయక్, నవీన్, ఎల్లయ్య, బిల్లా సుధీర్‌రెడ్డి, రాంసింగ్, శ్రీనివాసరావు, నర్సింహనాయక్ తదితరులున్నారు.


శ్రీను తల్లిదండ్రులకు చెక్కు అందిస్తున్న కేసీఆర్

రుణమాఫీ తప్పక అవుతుంది..

(5వ పేజీ తరువాయి)

మంది రైతులకు రూ.18వేల కోట్ల రుణమాఫీ జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. వివిధ తప్పిదాలతో అర్హులైన ఇంకా 3లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వీరితో పాటు రూ.2లక్షలకు పైన రుణం ఉన్న 11 లక్షల మంది రైతులతో కలుపుకుంటే మొత్తం 42లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ డిసెంబరు 24 చివరి వరకు రుణమాఫీ జరుగుతుందని సీఎం స్పష్టత ఇచ్చారని తెలిపారు. ఒక ఆర్థిక సంవత్సరంలో 42 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ చేసిన చరిత్ర ఆయా రాష్ట్రాల్లో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదోడి ఇంటి కల సాకారం కానుందన్నారు. ప్రతీ గ్రామానికి 20 నుంచి 100 ఇళ్ల వరకు మొదటిదశలో ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆదాయాన్ని బట్టి కొంత ఆలస్యమైన గ్యారంటీలను అమలు చేసితీరుతామన్నారు. ప్రభుత్వానికి అందరూ సహకరించాలని ప్రధానంగా రైతులు ప్రభుత్వానికి మద్దతుగా నిలువాలని విజ్ఞప్తి చేశారు. కాగా, వెంకటాపురం గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తానని ఆయన హామీఇచ్చారు. టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తోందన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా సన్నాలకు బోనస్ అందించనున్నట్లు తెలిపారు. రుణ మాఫీతో రైతులకు ఆర్థిక భారం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఏవో సునిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు. వర్ధన్నపేట, జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్‌లు రాజేష్‌ఖన్న, కరుణాకర్‌రావు, డైరక్టర్లు మేటి చిరంజీవి, బిర్రు పద్మ, సంపత్‌రావు, ఎలేంద్ర, చింత బాబు, రాంచంద్రం, ఎసోబు, బుచ్చిరెడ్డి, సీఈవో సంపత్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవలకు అంతరాయం

వరంగల్ మెడికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నీటి కొరతతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం డయాలసిస్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు మౌలిక సదుపాయాలైన నీటి వసతి లేకపోవడంతో పలు సర్జరీలు, డయాలసిస్ సేవలు నిలిచిపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య కొద్ది రోజులుగా ఉన్నప్పటికీ అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టడంతో సమస్య యథావిధిగా పునరావృతం అవుతోంది. కోట్లాది రూపాయలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించిన అధికారులు నీటి సౌకర్యాన్ని కల్పించడంలో విఫలం అవుతున్నారు. ఈ ఆస్పత్రిలో తొమ్మిది విభాగాల రోగులు నీటి కొరత కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. శనివారం డయాలసిస్ రోగులు సేవలు నిలిచిపోవడం పట్ల కాస్త ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నీటి సౌకర్యాన్ని కల్పించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సర్జరీలు డయాలసిస్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాటు చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోపిడీ దొంగల ముఠా గుట్టు రట్టు

హసన్‌పర్తి, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జోడి డాట్ కామ్ పేరుతో వెబ్‌సైట్ క్రియేట్ చేసి ఓ వ్యక్తిని ట్రాప్‌లోకి దించి నిలువు దోపిడీకిపాల్పడిన దొంగల ముఠా గుట్టు రట్టు చేసి వారి ఆట కట్టించిన ఘటన కేయూ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. శనివారం కాకతీయ పోలీసుస్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన గోదారి శేఖర్ ఆటోనడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో నడిపితే వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు, జల్సాలకు సరిపోకపోవడంతో ఎలాగైనా సులువుగా డబ్బులు సంపాదిం చాలనుకున్నాడు. ఈ క్రమంలోనే హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద పరకాలకు చెందిన లక్ష్మి అనే మహిళ పరిచయమైంది. ఆమెకు రూ. వెయ్యి ఇచ్చి ఆమె పేరుతో ఐడీ ప్రూఫ్ ఇచ్చి ఒక ఎయిర్‌టెల్ సిమ్, ఒక జియో సిమ్ తీసుకున్నాడు. వీటితో జోడీ డాట్ కామ్‌లో లక్ష్మి అనే పేరుతో ఒక ప్రొఫైల్ క్రియేట్ చేసి అప్‌లోడ్ చేశాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన దేవులపల్లి శ్రీనివాస్ ఈ ప్రొఫైల్ చూసి అట్రాక్టు అయ్యాడు. ఈ క్రమంలోనే శ్రీనివాస్ తనకు భార్య లేదని, పెండ్లి చేసుకోవా లనుకుంటున్నానని, తనకు తోడుకావాలని వాట్సాప్‌లో చాటింగ్ చేశాడు. దీంతో శేఖర్ ఆడగొంతుతో మాట్లాడుతూ.. తన పేరు లక్ష్మి అని, తనది ములుగు గ్రామమని, తనకు పెండ్లి చేసుకోవడానికి సిద్ధమని నమ్మించాడు. ఇందుకు ఒకరికొకరు సరేననని ఒప్పుకున్నారు. దీంతో శేఖర్.. తన మిత్రుడైన రాజయ్య, లక్ష్మయ్యలు అక్టోబరు 25న పథకం ప్రకారం దేవులపల్లి శ్రీనివాస్‌ను హనుమకొండ బస్టాండుకు రప్పించారు. అనంతరం పథకం ప్రకారం శ్రీనివాస్‌ను కోమటిపల్లి రైల్వే ట్రాక్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అతడిపై దాడి చేసి చిల్లర డబ్బులు తీసుకున్నారు. అంతేకాకుండా ఫోన్‌పేలో ఉన్న రూ.24 వేలను రెండు పెట్రోల్ బంకుల వద్ద క్యాష్ చేసుకొని సెల్ లాక్కొని ముగ్గురు కలిసి శ్రీనివాస్‌ను ఆటోలో ఎక్కించుకొని దేవన్నపేట క్రాసురోడ్డు వద్ద దింపారు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తామని బెదిరించారు. అనంతరం వారి వద్ద ఉన్న రెండు సిమ్ కార్డులను సమీపంలోని కెనాల్‌లో పడేసి అక్కడి నుంచి ముగ్గురు కలిసి వెళ్లిపోయారు. అనంతరం బలవంతంగా లాక్కున్న రూ.24వేలలో రాజయ్య, రూ.5వేలు లక్ష్మయ్య తీసుకొని మిగతా డబ్బులు శేఖర్ తీసుకొని ఇంటికి వెళ్లారు. కాగా, తనకు జరిగిన అన్యాయాన్ని శ్రీనివాస్ అక్టోబర్ 26న కేయూ పోలీసులకు వివరించగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించారు. ఈ క్రమంలోనే శనివారం గోపాల్‌పూర్ జంక్షన్ వద్ద కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తన సిబ్బందితో ముగ్గురు నిందితులైన హనుమకొండకు చెందిన గోదెర శేఖర్, గోపాల్‌పూర్ లక్ష్మీకాలనీకి చెందిన దుర్గం రాజయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పీనపాక మండలం గడ్డంపల్లి గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మయ్యలను అరెస్టు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద రూ.24వేల నగదు, ఆటో, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని పరారీలో ఉన్న పరకాలకు చెందిన లక్ష్మి కోసం గాలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో కేయూ ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రవిందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

భద్రకాళి ఆలయంలో వేములవాడ ఎమ్మెల్యే పూజలు

వరంగల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): చారిత్రక శ్రీ భద్రకాళి అమ్మవారిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. శనివారం అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఆయన వల్లభ గణపతిని దర్శించుకొని అనంతరం శ్రీ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భద్రకాళి శేష అర్చనచేసి ఆశీర్వదించారు. ఈవో శేషభారతి అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్ ఉత్సవాలను జయప్రదం చేయాలి

కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగే కాంగ్రెస్ సేవాదళ్ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సేవాదళ్ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సేవాదళ్ పాత్ర ఎంతో ఉందన్నారు. 20న జరిగే ఉత్సవాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నకిరేకంటి మోహన్‌గౌడ్, చర్లకొండ సదానందంతో పాటు ఆదినారాయణ, కరుణ, అరుణ, పల్లపు యాదగిరి, సురేందర్‌గౌడ్, దొమ్మటి రాజేశ్‌గౌడ్, సయ్యద్, సోమయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో పూర్తి వివరాలను సేకరించాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా సర్వే అధికారి వినయ్‌కృష్ణారెడ్డి



కాశిబుగ్గలో సిబ్బందితో మాట్లాడుతున్న వినయ్‌కృష్ణారెడ్డి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో సిబ్బంది ప్రజల నుంచి పూర్తి వివరాలను సేకరించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర సర్వే పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా శనివారం వరంగల్ కాశిబుగ్గ, శివాలయం, హనుమకొండ ప్రాంతాల్లో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పర్యవేక్షించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్యుమరేటర్లు సర్వేలో వివరాలు సేకరించే సమయంలో తప్పులు జరుగకుండా జాగ్రత్త పడాలని అన్నారు. 75 ప్రశ్నల ప్రశ్నావళిపై పూర్తి అవగాహన కలిగిన ఉండాలని సూచించారు. దేశంలో ప్రథమంగా నిర్వహిస్తున్న ఈ సర్వే ద్వారా ప్రజలను చైతన్యపరిచేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి అక్కడి కుటుంబసభ్యుల వివరాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీసీ కృష్ణారెడ్డి, ఆర్‌వో శ్రీనివాస్, ఆర్ఐ సోహెల్‌తో పాటు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



మధ్యకోటలో లైట్ అండ్ సౌండ్ షోను తిలకిస్తున్న జడ్జి సుజయ్‌పాల్



కాకతీయుల కాలంనాటి శిల్పాలను తిలకిస్తూ..

కోటను సందర్శించిన హైకోర్టు జడ్జి

● దంపతులను సన్మానించిన కార్పొరేటర్

ఖిలావరంగల్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి సుజయ్‌పాల్ దంపతులు శనివారం సాయంత్రం వరంగల్ కోటను సందర్శించారు. మధ్యకోటలో కాకతీయుల కళాఖండాలను తిలకించారు. కీర్తితోరణాలు, ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, సింగారపు బావిని సందర్శించి వాటి చరిత్ర గురించి పర్యాటక శాఖ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, ఖిలావరంగల్ గైడ్ దేనబోయిన రవి యాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లైట్స్ అండ్ సౌండ్ షోను తిలకించారు. అనంతరం శిల్పాల ఆవరణలో నీటిలో తేలియాడే ఇటుకను ఆసక్తిగా గమ నించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు జడ్జి సుజయ్‌పాల్ దంపతులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మల గీతాంబ, కార్యదర్శి సాయికుమార్, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు, కార్యదర్శి క్షేమదేశ్‌పాండే, న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర కార్యదర్శి పంచాక్షరి, వరంగల్ జిల్లా బార్ కౌన్సిల్ అధ్యక్షుడు తీగల జీవన్, 37, 38డివిజన్‌ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, కేంద్రపురావస్తుశాఖ ఖిలావరంగల్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, లైట్స్ అండ్ సౌండ్ షో ఖిలా వరంగల్ ఇన్‌చార్జి గటికొప్పుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో పూజలు..

వరంగల్ కల్చరల్: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్‌పాల్ శనివారం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వల్లభ గణపతిని, శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో శేషభారతి, అర్చకులు భద్రకాళి శేష అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డగోలు హామీలతో ప్రజలను బోల్తా కొట్టించిన కాంగ్రెస్

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి

హనుమకొండ టౌన్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): అమలుకు సాధ్యంకాని హామీలను ప్రకటించి కాంగ్రెస్ పార్టీ ప్రజలను బోల్తా కొట్టించిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి విమర్శించారు. బీజేపీ సంస్థాగత ఎన్నికలు-2024పై శనివారం హంటర్‌రోడ్డులో జిల్లాస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రావు పద్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దోపిడీ విధానాన్ని నిలువరించేందుకు ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న హామీలను నిలబెట్టుకోలేకపోతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో 7 లక్షల కోట్లు అప్పుచేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఏ భూములు తాకట్టు పెట్టి అప్పు తీసుకోవాలో అని ప్రయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు చుక్కలు చూపిస్తోందని ధ్వజమెత్తారు. ప్రపంచంలోనే అత్యధికంగా సభ్యులుండి, మూడేళ్లకోకసారి గ్రామస్థాయి నుంచి సంస్థాగత ఎన్నికలను నిర్వహించుకునే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కాలం చెల్లిందని, ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. సంస్థాగతంగా ముందుకు వెళ్తూనే ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ పోరాటాలు ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తల కృషి వలనే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్రంలో జిల్లా రెండోస్థానంలో నిలిచిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి గంగారెడ్డి, రాష్ట్ర క్రియాశీలక సభ్యత్వ నమోదు కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రాష్ట్ర నాయకులు చాడ శ్రీనువాస్‌రెడ్డి, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, సిరంగి సంతోష్, పులి సరోత్తంరెడ్డి, మంద ఐలయ్య, కొలను సంతోషరెడ్డి, జయంత్‌లాల్, జితేందర్‌రెడ్డి, శ్రీనువాస్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

హాస్టళ్లకు శాశ్వత భవనాలను నిర్మించాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కూరెళ్ల మహేష్‌కుమార్

వడ్డెపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్(టీఎస్ఎస్ఏ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో ఉంటున్న విద్యార్థుల మెస్ చార్జీలు రూ.1500ల నుంచి రూ.4000కు పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ఎస్ఏ రాష్ట్ర, జిల్లా నాయకులు డి.సత్యం, మేడి రాజు, దామర్ల సత్యనారాయణ, గోవిందరాజు, నవీన్, ప్రకాశ్, ఎల్లేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

రేపు కేయూలో జాతీయ విద్యా దినోత్సవం

కేయూ క్యాంపస్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): భారతదేశ మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని పురస్కరించుకుని నవంబరు 11న ఉదయం 10 గంటలకు వర్సిటీ ఆడిటోరియంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కేయూ మౌలానా ఆజాద్ సెంటర్ ఫర్ మైనార్టీస్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కనీజ్ ఫాతిమా శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరై మాట్లాడుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనలని కోరారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు అంజలీదేవి

కేయూ క్యాంపస్, నవంబరు 9,(ఆంధ్ర జ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని టి.అంజలిదేవి మహారాష్ట్రలో జరిగే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బిక్షాలు శనివారం తెలిపారు. నవంబరు 12 నుంచి 20 వరకు మహారాష్ట్రలోని జలగం కేడీసీ నార్త్ మహారాష్ట్రలో జరిగే జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు అంజలిదేవి ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అంజలిదేవిని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూర్పాటి వెంకటేశ్, స్వప్న, కళాశాల సూపరిం టెండెంట్ వీరూ నాయక్, సిబ్బంది తదితరులు అభినందించారు.

విద్యార్థుల సమస్యలపై ఏబీఎస్ఎఫ్ పోరాటం

కేయూ క్యాంపస్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ విద్యార్థులకు నిరంతరం అండగా ఏబీఎస్ఎఫ్ జెండా నిలుస్తుందని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ అన్నారు. శనివారం కేయూలో ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. ఏబీఎస్ఎఫ్ విద్యార్థి, సామాజిక, రాజకీయ, కార్మిక, నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడుతుందని చెప్పారు. తమ పోరాటంతో విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. నవంబరు 30న వర్సిటీలో ఏబీఎస్ఎఫ్ నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్, కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్, ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీరాజ్, రవి, రమేశ్, సాయి చరణ్, గౌతమ్, నంద, మధు, చైతన్య, కిరణ్, పల్లవి, నవ్య, శ్రావణి, లాస్య తదితరులు పాల్గొన్నారు.

కళాశ్రీకి సన్మానం



జ్ఞాపికను అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

హనుమకొండ సిటీ, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న కళాశ్రీ సౌరం ప్రవీణ్‌కుమార్‌ను భారత్ కల్చరల్ అకాడమి ఘనంగా సన్మానించింది. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతీలో ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవితల పోటీలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో ప్రవీణ్‌కుమార్ తన కవితాగానంతో అందులో ఒకరిగా ఎంపికయ్యాడు. ఈ క్రమంలో ఆయనను ప్రముఖ సినీ గేయ రచయితలు మౌనశ్రీ మల్లిక్, డాక్టర్ వెనిగల్ల రాంబాబు, తెలుగు టెలివిజన్ రైటర్స్ అసోసియేషన్ కార్యదర్శి కర్ర నరేందర్‌రెడ్డి తదితరులు సన్మానించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందచేశారు.

రుద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో రుద్రేశ్వరుడు

హనుమకొండ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వేయిస్తంభాల గుడిలో శనివారం రుద్రేశ్వర స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఉదయం ఉత్తిష్ఠ గణపతికి పుట్టతేనేతో అభిషేకం జరిపారు. అనంతరం ప్రభాకర్ - స్వరూప దంపతులు హైదరాద్ నుంచి తెప్పించిన బంతి, చామంతి, గులాబి, లిల్లీ, మందారం, పారిజాతం తదితర లక్ష పుష్పాలతో అర్చన నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. దీపాలు వెలిగిం చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు మణికంఠ శర్మ, ప్రణవ్, శ్రవణ్ కుమార్ భక్తులకు సేవలు అందించారు. 13వ తేదీన దాత్రి నారాయణ స్వామి కళ్యాణోత్సవం, 14న సామూహిక సత్యనారాయణ వ్రతాలు 15న కార్తీక పౌర్ణమి రోజు సామూహిక రుద్రాభిషేకలు నిర్వహించనున్నట్లు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ఉమ్మడి పది జిల్లాల నుంచి 10 పురుష, 9 మహిళా జట్లు హాజరు



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న వద్దిరాజు వెంకటేశ్వర్లు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ కమిటీ హనుమకొండ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. శనివారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని బ్యాడ్మింటన్ కోర్టులో ఏర్పాటు చేసిన 70వ తెలంగాణ రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి చేరుకొని పలు పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకరావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కమిటీ నిర్వాహకులు ఎస్వీ భద్రయ్య మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 10మెన్, 9ఉమెన్ జట్లు పాల్గొన్నాయన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తెలంగాణ రాష్ట్ర ఉమెన్ జట్టు డిసెంబర్ 26నుంచి 30వరకు మహారాష్ట్రలో నిర్వహించనున్న 70వ జాతీయస్థాయి ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామన్నారు. అదే విధంగా మెన్ విభాగంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్టు డిసెంబర్ 6నుంచి 9వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించనున్న 8వ ఫెడరేషన్ కప్ 2024కు మెన్ జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, హనుమకొండ సీఐ సతీష్, టోర్నమెంట్ కమిటీ చైర్మన్ రవీంద్రకుమార్, వైస్‌చైర్మన్ సాదుల ప్రకాష్, కన్వీనర్ కొత్తపల్లి ప్రసాద్, కోకన్వీనర్ గాదేపాక అయోధ్య, కమిటీ బాధ్యులు కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్. ఈశ్వర్‌కుమార్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

13న సమష్టి సత్యనారాయణస్వామి వ్రతాలు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శివానందగురు కల్చరల్ ట్రస్టు సభ్యులు

పోచమ్మమైదాన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 13న (బుధవారం) 251 దంపతులతో సమష్టి సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపెల్లిలోని గురుధామ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుధామ్‌లో ఉచితంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. 12 ఏళ్ల నుంచి సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నామని, 251 జంటలు పూజలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పూజ సామగ్రి సైతం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

వ్రతంలో కూర్చోదలచిన దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని సూచించారు. తొలుత రుద్ర హోమం జరుగుతుందని, అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పూజల అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయి నారాయణ, మాదారపు సదాశివుడు, రేపాల రాంచందర్, గందె ఉమాశంకర్, పబ్బతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై విమర్శలు సరికాదు

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

బాలసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సాకారం చేసిన మాజీ సీఎం కేసీఆర్‌ను కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శనివారం హనుమకొండలోని కాళోజీ జంక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు ఇవ్వలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్లు విమర్శించారు. తెలంగాణకు బ్రాండ్ ఇమేజ్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాడ్ ఇమేజ్‌ను తీసుకువస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుంటే ప్రజల నుంచి బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నట్లు వినయ్‌భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 75 ఏండ్లలో సుమారు 50 ఏండ్లు పాలించిందని, మూసినది కలుషితం కావడానికి కారణం కాంగ్రెస్ పార్టీనే కారణమని అన్నారు. మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, పేదల ఇండ్ల కూల్చివేతలకు మాత్రమే వ్యతిరేకం అన్నారు. అనంతరం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులపై దాస్యం వినయ్‌భాస్కర్ ఫిర్యాదు చేశారు.



కాళోజీ జంక్షన్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఓటు నమోదు చేసుకోండి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. (స్వీప్) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9, 10తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 2025 నాటికి 18సంవత్సరాలు నిండే యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, అదేవిధంగా పాత జాబితాలో మార్పులు, సవరణకు, అభ్యంతరాలు తెలిపేందుకు బూత్‌లెవల్ ఆఫీసర్లు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని అన్నారు.

కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి

కలెక్టర్లు ఎన్యూమరేటర్లతో నిరంతర పర్యవేక్షణ చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. శనివారం నుంచి ప్రారంభమైన కుటుంబ సర్వే నేపథ్యంలో సీఎస్ శాంతకుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి జిల్లా కలెక్టర్‌లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సర్వేపై ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, వాటిని ఎన్యూమరేటర్లు నివృత్తి చేస్తూ ముందుకెళ్లాలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలతో మమేకం అయితే సందేహాలు ఏమిటో తెలుస్తాయని, వాటిని జిల్లా కలెక్టర్లు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. సర్వే గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ కలెక్టర్ సత్యశారద, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య



వరంగల్ మెడికల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. శనివారం హసన్‌పర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వార్డులు, ఫార్మసీ, లాబొరేటరీ, లేబర్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డెలివరీల సంఖ్యను పెంచడం కోసం పలు సూచనలు చేశారు. టీజీ ఎంఐడీసీ వారికి ఆస్పత్రి నుంచి పంపించిన ప్రతిపాదనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మహేందర్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్స్ పరీక్షల షెడ్యూల్ వెల్లడి

కేయూ క్యాంపస్, నవంబరు 9,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఎంఎస్సీ బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల 5, 7, 9వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శనివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణా ధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు విడుదల చేశారు.

- ఎంఎస్సీ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బయో టెక్నాలజీ 5వ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 18, 20, 22, 25, తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయి.
- ఎంఎస్సీ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బయో టెక్నాలజీ 7వ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 18, 20, 22, 25, తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.
- ఎంఎస్సీ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బయో టెక్నాలజీ 9వ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 19, 21, 23, 26, తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయి.
- ఎంఎస్సీ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బయో కెమిస్ట్రీ 7వ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 25, 27, 29, డిసెంబరు 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరు గుతాయి.
- ఎంఎస్సీ 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బయో కెమిస్ట్రీ 9వ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 26, 28, 30, డిసెంబరు 3వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతాయి.

కల్యాణం.. కమనీయం

- కన్నుల పండుగగా అర్ధనారీశ్వరుడి పరిణయం
- ఆత్మకూరులో ముగిసిన ఆలయ పునర్నిర్మాణ వేడుకలు



ఆలయ కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో రూ.3.5 కోట్లతో పునర్నిర్మాణం చేసుకున్న శ్రీ మహాదేవస్వామి పంచలింగాల శివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి అర్ధనారీశ్వరుడి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కల్యాణానికి హాజరయ్యారు. అనంతరం దేవాలయాన్ని పరిశీలించి కమిటీ బృందాన్ని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ చరిత్రలో పూర్తి రాతి కట్టడంతో పునర్నిర్మాణం చేసుకున్న ఏకైక దేవాయంగా పంచలింగాల శివాయం నిలుస్తుందని అన్నారు. ఐదేళ్లు శ్రమించి దేవాయాన్ని పునర్నిర్మాణం చేశారని కొనియాడారు. ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత పర్వతగిరి రాజు, పరకాల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాదాసి శ్రీధర్, జిల్లా నాయకులు రేవూరి రణధీర్‌రెడ్డి, గుండెబోయిన శ్యామ్, మత్స్యశాఖ చైర్మన్ బయ్య తిరుపతి, బరుపట్ల కిరీటి, ఆలయ కమిటీ బృందం పాల్గొన్నారు.

పూజలు

పంచలింగాలకు శనివారం ఉదయం వేదపండితుల చేత విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం నాగబెల్లి తంతుతో పాటు మేళతాళాలు, నన్నాయి వాయిద్యాలు, మహిళల కోలాటాలు, నృత్యాలతో హరహర మహాదేవ శంభో శంకర.. ఓం నమశ్శివాయ అంటూ శివనామస్మరణతో పల్లకీసేవసేవను నిర్వహించారు.

ఈ ఉత్సవాలలో వేద పండితులు రవీంద్ర శర్మ, వరత్ వర్మ, శ్రావణ్, వర్మతోపాటు అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి, ఆలయ బృందం తోట రఘు, వేపూరి దేవేందర్ రెడ్డి, సిరిపురం సంపత్, బూర కిషోర్ గౌడ్, పొగాకుల ప్రభాకర్ గౌడ్, రేవూరి జయపాల్ రెడ్డి, వంగాల భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాల 'జాతర'

- పచ్చని కొండల మధ్య కొలువైన వేంకటేశుడు
- ఏటా కార్తీక మాసంలో బుగులోని సంబురం
- 14వ తేదీ నుంచి 18 వరకు జాతరకు సర్వం సిద్ధం



రేగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా ఎత్తైన రాతి కొండలు.. రకరకాల ఔషధ మొక్కలు.. పక్షుల కిలకిలారావాల మధ్య గోవింద నామ స్మరణలు ప్రతిధ్వనిస్తుంటాయి. అలా ప్రకృతి అందాలు మేళవించిన బుగులోని గుట్టల్లో కొలువైన వేంకటేశ్వరుడు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విలసిల్లుతున్నాడు. మరో విశేషమేంటంటే ఏటా కార్తీక పౌర్ణమి రోజు నుంచి నాలుగు రోజుల పాటు జాతర జరుగుతుంది. ఈ క్రమంలోనే ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు జాతరను వైభవంగా నిర్వహించేందుకు బుగులోని క్షేత్రం ముస్తాబవుతోంది. ఈ జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. కుటుంబాలంతా పచ్చని చెట్ల నీడన వంటలు చేసుకుని ఆనందంగా గడిపి నిద్ర చేస్తారు.

ముక్కుడి గడ్డ నుంచి కొండల మధ్యకు..

బుగులోని వేంకటేశ్వర స్వామి ఆలయం తొలుత తిరుమలగిరి గ్రామ సమీపంలోని ముక్కుడి గుడి గడ్డ అనే ప్రాంతంలో ఉన్నట్లు గ్రామస్థులు చెబుతారు. అక్కడ ఇప్పటికీ గుడికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తాయి. గ్రామంలోని రోకళ్ల శబ్దాలకు వేంకటేశ్వర స్వామి, పద్మావతి, అలివేలు అమ్మవార్లు బుగులుతో కొండ పైన ఉన్న గుహలోకి వెళ్లినట్టు చెబుతుంటారు. దీంతో స్వామి వారికి బుగులోని వేంకటేశ్వరస్వామి అనే పేరు వచ్చినట్టు గ్రామస్థుల కథనం. కాగా ముక్కుడి గుడి గడ్డ వద్ద ఉన్న ఆలయం ధ్వంసమైపోగా విగ్రహాలు, స్తంభాలు కొన్ని ఇప్పటికీ ఉన్నాయి. ఇక బుగులోని పరిసరాలలో కొండను ఆనుకొని శివలింగం కూడా ఉంటుంది. ఏటా కార్తీకమాసం, శివరాత్రి సమయంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. కొండ పైన ఉన్న గండం దీపంలో నూనె పోసి దీపం వెలిగిస్తే గండాలు పోతాయని భక్తుల విశ్వాసం. అలాగే ఇక్కడ సమ్మక్క, సారలమ్మ జాతర కూడా జరుగుతుంది. జాతరకు సమీపంలోనే సమ్మక్క, సారలమ్మల గద్దెలు నిర్మించబడి ఉంటాయి. దీంతో ఒకే దగ్గర మూడు రకాల ఆలయాలు ఉండడం భక్తుల రాకపోకలతో ఈప్రాంతంఆధ్యాత్మిక నిలయంగా విలసిల్లుతోంది.

ప్రభబండ్లు ప్రత్యేక ఆకర్షణ

బుగులోని జాతరలో ప్రభబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులు తమ మొక్కులు చెల్లించడానికి ఏనుగు, మేక, గుర్రం వాహనాలను తయారు చేసి డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వస్తారు. మేకపోతులతో బండ్లను కట్టుకొని స్వామివారి ప్రతిమలను ఊరేగింపుగా జాతరకు తీసుకువస్తారు.

భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం

రొంటాల వెంకటస్వామి, జాతర చైర్మన్



బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. రవాణా సౌకర్యంతో పాటు జాతర పరిసరాలలో మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. పలు గ్రామాలకు చెందిన పారిశుధ్య సిబ్బందితో జాతర పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లేలా ఓ ప్రణాళిక రూపొందించాం.

• ఆధ్యాత్మికం



రమణీయంగా కనిపిస్తున్న బుగులోని కొండలు



14 నుంచి 18 వరకు జాతర

బుగులోని జాతరలో భాగంగా 14వ తేదీన ఉదయం స్వామివారిని ఊరేగింపుగా కొండ పైకి తీసుకువస్తారు. అదే రోజు సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. 15వ తేదీన ఉదయం అభిషేకం, దర్శన కార్యక్రమాలు జరుగుతాయి. 16వ తేదీన స్వామి వారికి నిత్య పూజలు. దర్శనాలు ఉంటాయి. అనంతరం ఏనుగ, గుర్రం వాహనాలు తిరుగుతాయి. 17వ తేదీన నిత్య పూజలు మొక్కుబడులు చెల్లిస్తారు. 18వ తేదీన ఉదయం నిత్య పూజలు మొక్కులు చెల్లించిన తర్వాత మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలను గ్రామానికి తరలిస్తారు.

నాటి కేసరి సముద్రమే.. నేటి కేసముద్రం



కేసముద్రం బోర్డు

కేసముద్రం.. మహబూబాబాద్ జిల్లాలోని ఈ ఊరిపేరు విన్నవారిలో కొందరు అమాయకంగా.. మరికొందరు వ్యంగంగా.. 'మీ ఊళ్లో సముద్రంలో ఉందా?' అని అడుగుతుంటారు. కానీ ఈ ఊరిపేరుకు ఓ చరిత్రే ఉంది. ఇప్పటి విలేజి కేసముద్రం కాకతీయుల నాటిదంటే నమ్ముతారా? నిజమే కాకతీయ వంశంలోని మొదటి ప్రోలరాజు(క్రీ.శ.1055-1075)కు అరికేసరి, అరిగజకేసరి బిరుదులుండేవి. ఆయన పాలనలో ఈ ఊరిలో ఊరచెరువు తవ్వించిన ప్రోలరాజు తన బిరుదు 'కేసరి' పదం కలిసొచ్చేలా ఆ చెరువుకు

• ఆ పేరెలా వచ్చిందంటే!

'కేసరి సముద్రం'గా నామకరణం చేసినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. కాకతీయుల 'ట్యాంకు టెంపుల్ టౌన్' ఫార్ములాతో ఈ చెరువుకు అనుబంధంగా శివాలయం నిర్మించారు. అయితే నాటి 'కేసరి సముద్రం' కాలక్రమంలో 'కేసముద్రం'గా మారినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. ఇక 1980 వరకు కలిసి ఉన్న చారిత్రక గ్రామం ఆ తర్వాత 'కేసముద్రం విలేజి'గాను, రైల్వేస్టేషన్ ఉండడంతో 'కేసముద్రం స్టేషన్'గా విడిపోయి రెండు గ్రామపంచాయతీలుగా మారింది. అయితే ఇప్పటికీ ఈ రెండు గ్రామపంచాయతీలు రెవెన్యూ శాఖలో మాత్రం ఒకే గ్రామం 'కేసముద్రం'గానే పేర్కొంటుండటం గమనార్హం.

- కేసముద్రం

సందడిగా టెక్నోజియాన్

- ఆవిష్కృతమవుతున్న సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలు

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-24లో భాగంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సాంకేతిక అంశాల్లో పలు ఈవెంట్లు జోరుగా సాగాయి. వీటిల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచేందుకు తీవ్రస్థాయిలో పోటీ పడ్డారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. ప్రతీ ఈవెంట్ ఒక కొత్త సాంకేతికతను ఆవిష్కరించాయి. కొన్ని మానవీయ స్పర్శకు ప్రతీతకగా నిలిచాయి. మరికొన్ని విద్యార్థుల్లో అంతర్గతంగా దాడి ఉన్న సృజనాత్మకతను తట్టి లేపాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

ఫీల్ ద పెయిన్

ఇది ఒక అద్భుతమైన ఈవెంట్. టెక్నోజియాన్‌లో మొదటి సారి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీ ప్రదర్శించింది. సాధారణంగా స్త్రీలు బహిష్టు సమయంలో ఆ మూడు రోజులు విపరీతమైన నొప్పితో బాధపడతారు. అదే బాధను పురుషులకు కూడా అనుభవంలోకి తీసుకువస్తే స్త్రీలు పడే బాధేమిటో వారికి అర్థమవుతుందన్న భావనతో ఈ ఈవెంట్‌ను ప్రదర్శించారు. ఒక కంట్రోల్ ప్యానెల్ ద్వారా వైర్లు తగిలించిన గ్యాడ్జెట్‌ను పురుషుల పొత్తకడుపు వద్ద బిగిస్తారు. తర్వాత కంట్రోల్ ప్యానెల్ ద్వారా విద్యుత్ ఫ్రీక్వెన్సీని క్రమంగా పెంచుతున్నప్పుడు ఈ గ్యాడ్జెట్ కలిగించే ఒత్తిడి స్త్రీలు బహిష్టు సమయంలో పొందే బాధను పురుషులకు అనుభవంలోకి తీసుకు వస్తుంది. టీం లీడర్ రాకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫీల్ ద పెయిన్ ఈవెంట్‌లో విద్యార్థులు అసక్తిగా పాల్గొని ఆ బాధను అనుభవించడం కనిపించింది.

సికాడ

ఇదొక వినూత్నమైన ఈవెంట్. రకరకాల పజిల్స్‌ను విద్యార్థుల ముందు ఉంచుతారు. వారు ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా వాటిని చాకచక్యంగా పరిష్కరించాలి ఉంటుంది. ఎవరైతే సమర్థవంతంగా వాటిని పరిష్కరిస్తా రో వారికి బహుమతులు ఉంటాయి.

లెట్ థెమ్ కుక్

ఇది విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టే ఈవెంట్. కుక్ అనగానే ఏదో వంట అనుకునేరు. కొన్ని చీటీలపై వివిధ రసాయనిక పదార్థాల పేర్లు రాసుంటాయి. ఈవెంట్‌లో పాల్గొనేవారు అందులో ఒక చీటి తీసి ఆ రసాయినిక పదార్థం ఇంకెన్ని రూపాల్లో ఉంటుందో ఒక పేపర్‌పై రాయాలి. ఎవరు ఎక్కువ రాస్తారో వారే విజేత. వారికి ప్రైజ్‌మనీ కూడా ఉంటుంది. కెమిస్ట్రీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈవెంట్ కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది.

బ్రిడ్జి ఫ్యాబ్రికో

సివిల్ ఇంజనీరిగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహింస్తున్న ఈ ఈవెంట్ విద్యార్థుల సృజనాత్మకతకు అద్దంపటేలా ఉంది. ఈ ఈవెంట్‌లో పాల్గొనే వారికి కొన్ని వెదురుపుల్లలు, స్ట్రాలు, అడెసివ్స్ ఇస్తారు. వీటి సాయంతో నిర్ణీత సమయంలో మూడు అడుగుల వెడల్పు, పది సెంటీమీటర్ల ఎత్తుతో తమకు తోచిన డిజైన్లతో స్ట్రక్చర్స్ (కట్టడాలను) రూపొందించాలి. ఎవరో వినూత్నమైన డిజైన్‌తో సృజనాత్మకత ఉట్టిపడేలా స్ట్రక్చర్స్ రూపొందిస్తారో వారే విజేత. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడం కనిపించింది.

ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్

విద్యార్థుల మేధాశక్తి, నిశిత పరిశీలనను అద్దంపట్టే ఈవెంట్ ఇది. అందు బాటులో ఉన్న ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటినే తమ మేధాశక్తితో ఒక హత్యా సంఘటనలోని నిందితులను గుర్తించడం ఈవెంట్ ప్రత్యేకత. ముగ్గురు హంతకులు ఒక హత్యకు పాల్పడతారు. హత్యకు సంబంధించిన క్లూస్ అందుబాటులో ఉంటాయి. ఈవెంట్‌లో పాల్గొనే విద్యార్థులు ఆ క్లూస్ ఆధారంగా పరిశోధన చేయాలి. ఇన్వెస్టిగేషన్‌లో ఎదురయ్యే అడ్డంకులను ఒక్కొక్కటిగా ఛేదిస్తూ హంతకులను పట్టుకు న్నవారు విజేతలుగా నిలుస్తారు. బయోటెక్నాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఈవెంట్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్యూచర్ మేనేజర్

ప్రస్తుతం అంతా కార్పొరేట్ సంస్థల రాజ్యం. ఈ సంస్థల్లో కొలువు సంపాదించడమే కాదు.. అందులో రాణించాలన్నా ప్రతిభతో పాటు అన్నిటినీ ఆకళింపు చేసుకొని దూసుకుపోయే తెలివి, తెగువ కూడా ఉండాలి. ఒక సంస్థలో మేనేజర్‌గా రాణించాలంటే వేటి విషయంలో నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలో నేర్చుకునే అవకాశం ఈవెంట్ కల్పిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొని విజేతలుగా నిలిచివారికి బహుమతులుంటాయి.



మెటలర్జికల్ ఈవెంట్‌లో పాలొన్న విద్యార్థులు

చిన్నారుల రోబోటిక్స్

టెక్నోజియాన్‌లో పాఠశాల విద్యార్థులకు కూడా అవకాశం కల్పించారు. భావి ఇంజనీర్లు అయిన ఈ చిన్నారులు తాము స్వయంగా రూపొందించిన రోబోటిక్స్ ఎగ్జిబిట్లను ఇందులో ప్రదర్శించారు. వీటిని టెక్నోజియాన్‌కు హాజరైన విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులు రోబోలతోపాటు ఇతర సైన్స్ ఎగ్జిబిట్లను కూడా ప్రదర్శించారు. అంబేద్కర్ లర్నింగ్ హాల్ వద్ద ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇదే చోట మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తాము రూపొందించిన వివిధ రకాల మోటారు వాహనాలు కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ డిజైన్లలో, శ్రేణుల్లో ఉన్న ఈ వాహనాలు వేటికవే ప్రత్యేకతను కలిగి ఉన్నాయి.

ఆకట్టుకున్న ల్యాబ్రింత్ ఈవెంట్

ల్యాబ్రింత్ ఒక లేజర్ బీం ఈవెంట్. ఒక గదిలో లేజర్ బీమ్‌లను ప్రసరింపచేస్తారు. విద్యార్థులు ఈలేజర్ కిరణాలకు తగలకుండా వాటిని దాటుకుంటూ నిర్దేశిత లక్ష్యాన్ని దాటాలి. వారినే విజేతలుగా ప్రకటిస్తారు. ఈవెంట్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవి ఇవీ..

మరికొన్ని ఈవెంట్లు కూడా విద్యార్థుల ప్రతిభకు పదునుపెట్టేలా ఉన్నాయి. సరికొత్త విషయాలను నేర్చుకునేందుకు వేదికలుగా నిలుస్తున్నాయి. మ్యాథమెటికల్ సొసైటీ ఏర్పాటు చేసిన డేటా సైన్స్ క్వెస్ట్ విద్యార్థుల్లోని గణిత జ్ఞానాన్ని పరీక్షించేందుకు ఒక కొలమానంగా ఉంది. ఫొటోగ్రఫీ రిక్రియేటింగ్ క్లబ్ ది మూమెంట్ అనే ఈవెంట్, క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో సికాడా, కేబీసీ ఈవెంట్లు సైతం టోక్నోజియాన్‌లో హైలైట్స్‌గా నిలుస్తున్నాయి. అంబేద్కర్ లెర్నింగ్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో మెకానికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాహన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇన్నోవేషన్ గ్యారెజ్ నిర్వహిస్తున్న ఐడియాథాన్ అత్యంత ఆదరణ పొందిన ఈవెంట్లలో ఒకటిగా నిలుస్తున్నది. సివిల్ ఇంజనీరింగ్ సొసైటీ క్రైమవేరాపై వర్క్‌షాపు నిర్వహిస్తోంది.

విశ్వవిజ్ఞాన వేదిక టెక్నోజియాన్

- సృజనాత్మకతను పెంచుకునేందుకు అవకాశం

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్-24 విశ్వవిజ్ఞాన వేదికకు ప్రతీకగా నిలుస్తున్నదని ఇందులో పాల్గొంటున్న విద్యార్థులు అభిప్రాయపడ్డారు. టెక్నోజియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్లు కొత్త ఆలోచనలను కలిగిస్తున్నాయని, సరికొత్త విషయాలను తెలుసుకునేందుకు అవకాశం కలిగిస్తున్నాయన్నారు. టెక్నోజియాన్‌లో పాల్గొన్న కొందరు విద్యార్థుల మనోగతం ఇలా..

కొత్త విషయాలను తెలుసుకుంటున్నాం..

అనూష, కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి



టెక్నోజియాన్ ద్వారా సాంకేతికతపరంగా సరికొత్త విషయాలను తెలుసుకుంటున్నాం. ఇతర కళాశాల నుంచి విద్యార్థులు వారు రూపొందించిన ఎగ్జిబిట్ల ద్వారా స్ఫూర్తి పొందుతున్నాం. ఇక్కడ ప్రదర్శిస్తున్న నూతన ఆవిష్కరణలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇలాంటి వేడుకల్లో టెకీలు తప్పకుండా పాల్గొనాల్సిన అవసరం ఉంది.

ఈవెంట్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి..

కావ్యాంజలి, మెటలర్జికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్



టెక్నోజియాన్-24లో ప్రదర్శిస్తున్న ఈవెంట్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వివిధ విభాగాల ద్వారా ప్రదర్శిస్తున్న ఈవెంట్లు వేటికవే ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అద్దం పడుతున్నాయి. టెక్నోజియాన్ ఒక విశ్వవిజ్ఞాన వేదిక. ఇందులో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా..

ఎక్కువ ఈవెంట్లు ప్లాన్ చేయడం బాగుంది

త్రిష, సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్



గతంలో కన్నా ఈసారి ఎక్కువ ఈవెంట్లను ప్లాన్ చేయడం బాగుంది. ఈ సారి 50కిపైగా ఈవెంట్లను నిర్వహిస్తున్నారు. వీటిలో చాలా వరకు కొత్తవి ఉండడం విశేషం. గతంలో కన్నా ఈసారి ఈవెంట్ల నిర్వహణకు బడ్జెట్ కూడా చాలినంత కేటాయించారు. ఇందువల్ల ఎక్కువమంది విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఏర్పడింది.

ఆలోచనలకు పదును పెట్టేలా ఈవెంట్లు

శ్రావ్య, బయోటెక్నాలజీ ఫైనల్ ఇయర్



టెక్నోజియాన్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్లలో ఎక్కువ భాగం ఆధునాతన సాంకేతికతను ప్రతిబింబించేలా ఉన్నాయి. చాలా ఈవెంట్లు ఇటీవల కాలంలో చోటు చేసుకున్న సరికొత్త సాంకేతికతలను జోడించి రూపకల్పన చేసినవే. వీటిలో పాల్గొన్న విద్యార్థుల్లో పోటీతత్వం పెరగనున్నది. టెక్నోజియాన్‌లో పాల్గొనడం ద్వారా ఒక కొత్త లోకాన్ని చూస్తున్నట్టు అనిపిస్తోంది.

సరికొత్త భారతం ఆవిష్కృతం

వంశీక్రిష్ణ, బయోటెక్నాలజీ ఫైనల్ ఇయర్



టెక్నోజియాన్‌కు వివిధ రాష్ట్రాల నుంచి విభిన్న సంస్కృతులకు చెందిన విద్యార్థులు హాజరుకావడంతో వరంగల్ నిట్‌లో సరికొత్త భారతం ఆవిష్కృతం అయినట్లు అనిపిస్తోంది. ఈవెంట్లో పాల్గొంటున్న విద్యార్థులు ఒకరికొకరు మమేకం అవుతున్నారు. వివిధ అంశాలపై చర్చించుకుంటున్నారు. తెలియని విషయాలు తెలుసుకంటున్నారు.

ప్రసంగాలు ఆకట్టుకునేలా ఉన్నాయి

మనోజ్‌కుమార్ రెడ్డి, బయోటెక్నాలజీ ఫైనల్ ఇయర్



బయోటెక్నాలజీలో భాగంగా ఈవెంట్లతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ఏర్పాటుచేసిన ప్రసంగాలు ఆకట్టుకునేలా, ఆలోచింప చేసేవిలో ఉన్నాయి. ప్రముఖులు తమరంగాల్లో రాణించిన తీరు స్ఫూర్తిదాయకంగా ఉంది. వర్క్‌షాపులు, చర్చాగోష్ఠులు, క్విజ్‌లు కూడా తెలియని ఎన్నో విషయాలను తెలుసుకునేందుకు దోహదం చేస్తున్నాయి. ఈ టెక్నోజియాన్‌లో పాల్గొనడం మరుపురాని అనుభూతి

ఆకట్టుకున్న డ్రోన్ వెలాసిటీ ఈవెంట్



నిట్ క్యాంపస్‌లో రాత్రి వేళ నిర్వహించిన డ్రోన్ వెలాసిటీ ఈవెంట్

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్-24లో భాగంగా శనివారం రాత్రి లైట్ల వెలుగుల్లో నిర్వహించిన డ్రోన్ వెలాసిటీ ఈవెంట్ హైలెట్‌గా నిలిచింది. ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిట్ క్యాంపస్‌లోని రోబోటిక్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఈవెంట్‌ను నిర్వహించారు. రాత్రి వేళ విద్యుత్ దీపాలతో రన్‌వేను ఏర్పాటు చేశారు. విద్యార్థులు రిమోట్ కంట్రోల్ ద్వారా రోబోటిక్ డ్రోన్‌ను ఈ రన్‌వే దాటి వెళ్లకుండా నిర్ణీత సమయంలో గమ్యస్థానానికి చేర్చాలి. తక్కువ సమయంలో వేగంగా నిర్ణీత గమన్యానికి చేరినవారిని విజేతలుగా నిర్ణయించారు. విద్యార్థులు ఈ ఈవెంట్‌లో పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా, ఆదివారంతో టోక్నోజియన్ ముగుస్తుంది. శనివారం నిర్వహించిన ఈవెంట్లే ఆదివారం కూడా కొనసాగుతాయి. సాయంత్రం 4 గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఆదివారం నాడు నిర్వహించే ముఖ్యమైన ఈవెంట్లలో ఎస్కేప్ రూం, ప్రాడక్ట్ లాంచ్, ఇన్నోకేమ్ ఉన్నాయి.

నిర్దేశిత లక్ష్యం దిశగా భవిష్యత్‌ను నడపండి..

- పక్కా ప్రణాళికతోనే విజయం
- మ్యాథ్స్‌స్కేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్ర పురోహిత్
- గెలుపు నమస్తత్వం ఉండాలి.. అప్పుడే ఆశించిన ఫలితం
- మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూ జైన్


హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ నిర్దేశిత లక్ష్యం దిశగా భవిష్యత్‌ను నడిపించాలని మ్యాథ్స్‌స్కేర్, మోటివేషన్ స్పీకర్ గజేంద్ర పురోహిత్ పిలుపునిచ్చారు. టెక్నోజియాన్-24లో భాగంగా శనివారం రెండు అతిథి ప్రసంగాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గజేంద్ర పురోహిత్ 'మీ భవిష్యత్తు మీ ఉద్దేశ్యంతోనే నడిపించడీ' అనే ఇతివృత్తంతో చేసిన ప్రసంగం విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది. విద్యార్థులు పక్కా ప్రణాళికతోనే ఆశించిన విజయాన్ని పొందగలుతారన్నారు. తమ భవిష్యత్తు ఎలా ఉండాలనేది నిర్ణయించుకోవలసింది విద్యార్థులే అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం తపన, నిర్దిష్టమైన ప్రణాలిక, నిరంతర కృషి అవసరం అన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులు తమ నాలుగేళ్లను ఎలా ఉపయోగించుకోవాలో గజేంద్ర పురోహిత్ వివరించారు. మొదటి సంవత్సరంలో విద్యార్థులు తమ అవసరాలు, లక్ష్యాన్ని ప్లాన్ చేసుకోవాలి, రెండో సంవత్సరంలో విద్యార్థులు సర్టిఫికేషన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లకు సిద్ధం కావాలి, తమ ప్రొఫైల్‌ను, రెస్యూమ్‌ను నిర్మించుకోవాలి, వివిధ పోటీల్లో పాల్గొనాలి, మూడో సంవత్సరంలో పూర్తిగా చదువుపైనే దృష్టి పెట్టాలి, చివరి సంవత్సరంలో భవిష్యత్తు కోసం సిద్ధం కావాలి అని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత ఎదుగుదల కోసం రూపొందించుకోవలసిన కొన్ని కార్యకలాపాలపై ఆయన సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు పురోహిత్ సమాధానాలు ఇచ్చారు.



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న డాక్టర్ గజేంద్ర పురోహిత్

వారు వెలిబుచ్చిన సందేహాలను తీర్చారు. పురోహిత్ భావోద్వేగ ప్రసంగం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది.

రెండో అతిథి స్పీకర్ అయిన మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూ జైన్ చేసిన ప్రసంగం కూడా విద్యార్థులను ఉర్రూతలూగించింది. నమస్తే వరంగల్ పేరుతో ఆమె చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. విద్యార్థులు గెలుపు మనస్తత్వాన్ని పెంపొందించుకోవలసిన అవసరాన్ని డాక్టర్ తనూ జైన్ నొక్కి చెప్పారు. విద్యార్థులు తాము తీసుకునే ప్రతీ చర్య ఒక చేతన నిర్ణయంగా ఉండాలన్నారు. ప్రారంభ స్టార్టర్స్ మాత్రమే గెలుస్తారని, ప్రారంభ విజేతలే సాధకులవుతారని ఆమె అన్నారు. అందివచ్చిన అవకాశాలను వదులు కోవద్దని, పని చేయడం విజయంగా భావించాలని కూడా ఆమె అన్నారు. అలాగే విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సందేహాలను నివృత్తి చేశారు.



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
రిటర్న్ ఆఫ్ ది కింగ్	డాక్యుమెంటరీ మూవీ	నవంబర్ 13
హాట్ ఫ్రాస్ట్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
ఎమిలియా పెరెజ్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
కోబ్రా కై	వెబ్‌సిరీస్	నవంబర్ 15
మైక్ టైసన్ వర్సెస్ పాల్ జాక్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 15
అమెజాన్ ప్రైమ్		
ఇన్ కోల్డ్ వాటర్	వెబ్‌సిరీస్	నవంబర్ 12
క్రాస్	వెబ్‌సిరీస్	నవంబర్ 14
జియో సినిమా		
సెయింట్ డెనిస్ మెడికల్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
ది డే ఆఫ్ ది జాకాల్	వెబ్‌సిరీస్	నవంబర్ 15
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 12
ఆన్ ఆల్మోస్ట్ క్రిస్మస్ స్టోరీ	యానిమేషన్ మూవీ	నవంబర్ 15
ఆపిల్ టీవీ ప్లస్		
బ్యాడ్ సిస్టర్స్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
సిలో	వెబ్‌సిరీస్	నవంబర్ 15
సోనీ లివ్		
ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్	హిందీ సిరీస్ (తెలుగు డబ్బింగ్)	నవంబర్ 15
లయన్స్ గేట్ ప్లే ఆపరేషన్ బ్లడ్‌హంట్	హాలీవుడ్ మూవీ (తెలుగు డబ్బింగ్)	నవంబర్ 15

అర్ధరాత్రి స్వాతంత్ర్యం



లారీ కాలిన్స్, డొమినిక్ లాపియర్ రాసిన 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ పుస్తకం' ఆధారంగా అదే పేరుతో హిందీలో ఓ వెబ్‌సిరీస్ తెరకెక్కింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన వేళ దేశ విభజన నాటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సాగుతుంది. విభజనను ఆపేందుకు గాంధీ చేసిన ప్రయత్నాలు, జిన్నాను ఒప్పించేందుకు ఆయన చేసిన ప్రతిపాదనలు విఫలమయిన తీరును ఇందులో ఆవిష్కరించనున్నారు. నిఖిల్ అద్వానీ దర్శకత్వం వహించారు.

ఐరన్ కావాలా..! ఇవి తినండి

మహిళల్లో ఐరన్ లోపం అనేది సర్వసాధారణంగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం పోషకాహారం లోపమే. ఐరన్ లోపంవల్ల రక్తహీనత, నీరసం, రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలు వస్తాయి. వీటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలుసుకుందాం!

పప్పు ధాన్యాలు

కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, వేరుశనగ వంటి పప్పుల్లో ఐరన్ మినరల్ ఎక్కువగా ఉంటుంది. వీటిని ఉడికించి సూప్‌లు, సలాడ్స్ రూపంలో తీసుకోవచ్చు. రోజుకొక పప్పు రకాన్ని సైడ్ డిష్‌గా ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. ఇవి శరీరానికి కావాల్సిన ఐరన్‌ను అందించడమే కాకుండా జీర్ణక్రియ సజావుగా ఉండేలా చేస్తాయి.



పాలకూర

వంద గ్రాముల ఉడికించిన పాలకూరలో 2.7 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. పాలకూరను సలాడ్స్‌లో, స్మూతీల్లో, ఇతర వంటకాల్లో బాగంగా చేర్చుకుని తరచూ తింటే శరీరానికి అవసరమైన న్యూట్రియెంట్స్, ఆగ్జలేట్లు పూర్తిగా అందుతాయి. వీటితోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా లభిస్తాయి.

రెడ్ మీట్

ఇందులో శరీరం త్వరగా గ్రహించే హేమే ఐరన్ ఉంటుంది. రెడ్‌మీట్‌ను మితంగా రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి ప్రొటీన్లు, బి విటమిన్ కూడా అందుతాయి.

గుమ్మడి గింజలు

వంద గ్రాముల గుమ్మడి గింజల్లో 3.3 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. వీటిలో న్యూట్రియెంట్స్ యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అవసరమైన హెల్దీ ఫ్యాట్స్‌ను అందిస్తాయి. గుమ్మడి గింజలను పచ్చిగా, వేయించుకొని తినవచ్చు. సలాడ్స్‌లో కలుపుకోవచ్చు.

క్వినోవా

ఇందులో ఐరన్‌తోపాటు మెగ్నీషియం, మాంగనీస్, ఫైబర్, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇది గ్లూటెన్ లేని ధాన్యం. దీనిని మెయిన్ డిష్ కింద వారానికి రెండు సార్లు తీసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.



సండే సెలబ్రిటీ

'సార్, లక్కీ భాస్కర్' సినిమాలతో రెండు వరస విజయాలను సాధించిన దర్శకుడు వెంకీ అట్లూరి. సినిమా నిర్మాణంతో పాటు తన చిన్నతనం గురించి కూడా ఎన్నో విశేషాలను ఆయన 'నవ్య'తో పంచుకున్నారు.

మనకు మనమే కంచె వేసుకోవాలి

చిన్నతనం...

నేను పుట్టింది.. పెరిగింది హైదరాబాద్‌లో. నాన్నగారు అట్లూరి సుబ్బారావు సుమారు 45 సంవత్సరాల క్రితమే హైదరాబాద్ వచ్చేశారు. నాకు చిన్నప్పటి నుంచి చదవటం కన్నా.. ఎవరైనా చెబుతుంటే కథలు వినటం ఇష్టం. సినిమా లంటే చాలా ఆసక్తి ఉండేది కానీ ఇంట్లో ఎక్కువగా చూడనిచ్చేవారు కారు. వేసవి సెలవుల్లోనే సినిమాలు చూసేవాడిని. నేను సినీ రంగంలోకి వస్తానని.. దర్శకుడిని అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. అన్నీ ఒక దాని వెనక ఒకటి యాధృచ్ఛికంగా జరిగిపోయాయి. నా చదువు పూర్తయిన తర్వాత ఉప్పలపాటి నారాయణ రావు గారి సినిమాలో హీరోగా అవకాశం వచ్చింది. కానీ ఆ సినిమా ఆడలేదు. ఏం చేయాలో తెలియని సందిగ్ధత. రెండేళ్ల తర్వాత 'స్నేహగీతం'లో మాటలు రాయటానికి అవకాశం వచ్చింది. ఆ సినిమా బాగానే ఆడింది. దానితో రచయితగా స్థిరపడాలనుకున్నా. కథలు రాసేవాడిని. ఒక సారి ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ కోసం ఒక కథ తయారు చేశా. వెళ్లి చెప్పా. అప్పుడు వాళ్లు "కథ బావుంది. నువ్వు హీరో కావాలనుకుంటున్నావా? డైరక్షన్ చేస్తావా?' అని అడిగారు. అప్పటి దాకా నాకు దర్శకత్వం చేయాలనే ఆలోచనే లేదు. ఆ రోజు వాళ్ల మాటలు నా జీవితాన్ని మలుపు తిప్పాయి.

మంచి నటుడిని కాదు...

నేను మంచి నటుడిని కాదు. మంచి రచయితను. దర్శకుడిని. ఆ విషయం తెలుసుకున్న తర్వాత నటించకూడదని నిర్ణయించుకున్నా. నటన, దర్శకత్వం- ఈ రెండింటిలోను శారీరకంగా నటన చాలా కష్టం. నటులకు శారీరక శ్రమ చాలా ఎక్కువ ఉంటుంది. దర్శకులకు మానసిక ఒత్తిడి చాలా ఉంటుంది. ఇక దర్శకత్వం విషయానికి వస్తే- మనకంటూ ఒక మంచి టీం ఉండాలి. ప్రణాళికాబద్ధంగా షూటింగ్ జరిగేలా చూసుకోవాలి. ఇవి రెండూ లేకపోతే చాలా నష్టం జరుగుతుంది. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల విషయంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. షూటింగ్ ఒక పది రోజులు లేటు అయినా పర్వాలేదు. కానీ షూటింగ్ జరుగుతున్న సమయంలో పది నిమిషాలు లేటు కాకూడదు. ఒక రోజు సెట్‌లో మూడు గంటలు ఆలస్యమైతే మూడు లక్షలు పోతాయి. అందువల్ల షూటింగ్ సమయంలో ప్రతి నిమిషం విలువైనదే!



- నాకు బిగ్ 4... చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్‌లంటే చాలా ఇష్టం. వాళ్ల సినిమాలు చిన్నప్పుడు చాలా ఉత్సాహంగా చూసేవాడిని. వాళ్లను చిన్నస్థాయి దేవుళ్లలా కొలిచేవాడిని. ఇక కాలేజీకి వచ్చిన తర్వాత అజిత్‌గారంటే ఇష్టం ఏర్పడింది.
- భవిష్యత్తు సినిమాల గురించి ఇంకా ఏం అనుకోలేదు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌కు మరో సినిమా చేయాల్సి ఉంది. దానికి కూడా కథ రాయాలి.

నిజంగానే కథనాయికలు...

నా సినిమాల్లో కథనాయికలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వాళ్లు ఆత్మవిశ్వాసంతో ఉంటారు. ఇప్పటి వరకు నేను రాసిన కథలన్నీ ఆలా కలిసి వచ్చాయి. సాధారణంగా ఒక సినిమా పూర్తయిన పది రోజుల దాకా ఒక శూన్యత ఆవరిస్తుంది. ఆ శూన్యతలోనే రకరకాల ఆలోచనలు వస్తూ ఉంటాయి. వాటిలో కొన్ని మనను ఉత్తేజపరుస్తాయి. కొన్ని మనతో పాటే ప్రయాణం చేస్తూ ఉంటాయి. ఇలా ఎక్కువ కాలం ప్రయాణం చేసిన ఆలోచన ఎప్పుడూ ఒక మంచి కథను పునాది వేస్తుంది. నేను నా కథలన్నింటినీ అలాగే ఎంపిక చేసుకుంటా! ఉదాహరణకు 'లక్కీ భాస్కర్' కథనే తీసుకుందాం. ఆర్థిక నేరాలకు సంబంధించిన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చాలా తక్కువ వచ్చాయి. ఆర్థిక నేరాలకు సంబంధించి.. ముఖ్యంగా 90ల నేపథ్యంలో జరిగిన నేరాలకు సంబంధించి సినిమా చేయాలనే ఆలోచన వచ్చినప్పుడు- అందుబాటులో ఉన్న సినిమాలు, వెబ్ సిరీస్‌లన్నీ చూశాను. వీటిలో చాలా పదాలు.. వాటి వెనకున్న అర్థాలు సామాన్య ప్రజలకు అర్థం కావు. ఉదాహరణకు సెక్యూరిటీస్ అనే పదం ఉందనుకుందాం. అది చాలా మందికి అర్థం కాదు. అందువల్ల నేను తీసే సినిమాలో భాష అందరికీ అర్థం కావాలనుకున్నా. చాలా సంక్లిష్టమైన కథను సులభంగా అందరికీ అందించాలనుకున్నా. లక్కీ భాస్కర్ కథను నాలుగు సార్లు రాసుకున్నా. కొన్ని సీన్లు అయితే పది సార్లు రాసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

కథ రాసేదిలా...

నేను కథ రాసేటప్పుడు ప్రేక్షకులకు ఏం కావాలి అనే విషయం గురించి ఆలోచించను. రెండో సారి చదివితే నాకు అర్థం అవుతోందా? లేదా? అనే విషయం పైనే దృష్టి పెడతాను. అందరి మాదిరిగానే నాకు కూడా- "నా స్క్రిప్ట్ అందరి నచ్చాలి" అనుకుంటాను. కానీ అందరికీ నచ్చేలా రాయాలనుకుంటే - మొత్తానికే మోసం వస్తుంది. ఎక్కడో ఒక చోట మనకు మనం కంచె వేసుకోవాలి. పక్కవాళ్లకు నచ్చుతుందా లేదా అనే భయంతో రాస్తే సృజనాత్మకత దెబ్బతింటుంది. ఇక నా ఉద్దేశంలో హాస్యరస పూరిత సినిమా చేయటం కష్టం. సినిమాల్లో రాసే హాస్యం వరకు పర్వాలేదు. మొత్తం సినిమా అంతా హాస్యం పడించాలంటే కష్టం. నా దృష్టిలో నేను డ్రామా బాగా పండిస్తాను.

- సివిఎల్ఎన్ ప్రసాద్

హద్దులు లేని సినిమా

ఒకప్పుడు భారతీయ సినిమా అంటే బాలీవుడ్ చిత్రాలే. కాని ఇవాళ తెలుగు సినిమాలన్నీ పాన్ ఇండియా చిత్రాలే. మన హీరోలంతా పాన్ ఇండియా కథానాయకులు అవుతున్నారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్', 'పుష్ప' వంటి సినిమాలు జాతీయ స్థాయిలో సత్తా చాటాయి. ఈ చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు కొండంత విశ్వాసాన్ని ఇచ్చాయి. ఆ స్ఫూర్తితోనే తెలుగు సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయి. ద్వితీయ శ్రేణి హీరోలు సైతం పాన్ ఇండియా సినిమాలకే సై అంటున్నారు.

ప్రాంతీయ భాషల్లో ఆకట్టుకున్న మూవీస్ కూడా పాన్ ఇండియా సినిమాలుగా రూపాంతరం చెందుతున్నాయి. కాన్సెప్ట్ బాగుంది, ఫ్యాన్స్ ఆదరిస్తారన్న నమ్మకం కుదిరితే చాలు...మన సినిమాలను ఇతర భాషల్లోకి డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. సరైన కంటెంట్, చక్కటి విజువలైజేషన్, ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్, గ్రాఫిక్ ఎఫెక్ట్స్.. ఇవి ఉంటే చాలు... సినిమాకు భాష, ప్రాంతీయ సరిహద్దులు అడ్డురావని మన తెలుగు సినిమాలు నిరూపిస్తున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్ నుంచి రాబోయే సినిమాల కోసం దేశం అంతా ఎదురుచూస్తోంది.

ఇప్పుడు దేశంలో ఏ భాష మాట్లాడే వారైనా తెలుగు సినిమాలు అంటే తెగ ఆసక్తి కనబరుస్తున్నారు. పాన్ ఇండియా మూవీస్‌తో నార్త్, సౌత్ అనే తేడా లేకుండా పోయింది. దాంతో ఏ భాషలో లేని విధంగా తెలుగు చిత్రపరిశ్రమలో పాన్ ఇండియా సినిమాల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే తెలుగు నుంచి ప్రభాస్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ పాన్ ఇండియా స్టార్లుగా గుర్తింపు సాధించారు. వీరు నటిస్తున్న ప్రతీ సినిమా పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటోంది. వీరితోపాటు పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు, రాజమౌళి సినిమాతో మహేశ్ బాబు పాన్ ఇండియా కేటగిరీలోకి తొలిసారిగా అడుగుపెడుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ 'వార్-2' సినిమా ద్వారా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నారు.



సౌత్ నార్త్ అనే తేడా లేదు

సాధారణంగా మన పెద్ద హీరోలు నటించిన చిత్రాలు కర్ణాటకలో, తమిళనాట విడుదలవుతుంటాయి. కానీ, రాజమౌళి 'బహుబలి' సిరీస్ సినిమాలతో సౌత్ నార్త్ అనే హద్దులు చెరిగిపోయాయి. ఇప్పుడు సౌత్‌తోపాటు నార్త్ ఇండియాలోనూ మన సినిమాల పట్ల తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. బిహార్‌తోపాటు బెంగాల్‌లోనూ విడుదలవుతున్నాయి. కోవిడ్ అనంతరం ఈ ట్రెండ్ తారా స్థాయికి చేరుకుంది. 2022లో తెలుగు నుంచి అరడజనుకు పైగా పాన్ ఇండియా సినిమాలు విడుదల కాగా... ఒకటి, రెండు మినహా మిగతావన్నీ ఘన విజయం సాధించాయి. వీటిలో ఆర్ఆర్ఆర్, మేజర్, కార్తికేయ2, సీతారామం చిత్రాలు బ్లాక్ బస్టర్ అయ్యాయి. 2023లో కూడా నార్త్ ఇండియాలో బాలీవుడ్ కంటే సౌత్ ఇండియన్ సినిమాలే ఎక్కువగా విజయవంతమయ్యాయి. అందులోనూ టాలీవుడ్ చిత్రాల సంఖ్యే ఎక్కువగా ఉంది. 2024లోనూ ఇండియన్ బాక్సాఫీస్‌ని తెలుగు సినిమా శాసించిందనే చెప్పాలి.



- ప్రభాస్ నటించిన కల్కి '2898 ఎడి' రూ.1200 కోట్ల కలెక్షన్స్ సాధించింది. బాలీవుడ్‌లో రూ.250 కోట్లకు పైగా రాబట్టి, అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇక్కడ అతిపెద్ద ఓపెనింగ్స్ రాబట్టిన మూవీగా నిలిచింది.
- ఆర్ఆర్ఆర్ తర్వాత ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర'. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత కొరటాల శివ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో జాన్వీకపూర్ హీరోయిన్. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. ఈ సినిమా సెప్టెంబరులో విడుదలైంది. కర్ణాటకలో రూ.16 కోట్లు, తమిళనాడులో రూ.3 కోట్లు, కేరళలో కోటి రూపాయలు వసూలు చేస్తే...ఒక్క హిందీ వర్షన్‌కే రూ.24 కోట్ల రూపాయల వసూళ్లు వచ్చినట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది.
- అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప-2 కోసం యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ మూవీ డిసెంబరు 5న విడుదల అవుతోంది. సౌత్ ఇండియా విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అయితే నార్త్ ఇండియాతోపాటు పశ్చిమ బెంగాల్‌లో కూడా సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ రెండు ప్రాంతాల్లో ఇప్పటికే రూ.450 కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ అయింది.
- కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన పీరియాడిక్ థ్రిల్లర్ మూవీ 'క'. దీపావళి సందర్భంగా భారీ కాంపిటీషన్‌లో విడులైన ఈ మూవీకి పాజిటివ్ టాక్ వచ్చింది. దాంతో పాన్ ఇండియా రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్.

రాబోతున్న పాన్ ఇండియా చిత్రాలు

- శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున కలసి నటించిన మల్టీస్టారర్ 'కుబేర' విడుదలకు సిద్ధమవుతోంది. డిసెంబరులో ఈ చిత్రం విడుదల కానున్నట్లు సమాచారం.
- నాగ చైతన్య హీరోగా గీతా ఆర్ట్స్ బేనర్‌పై నిర్మించిన 'తండేల్' ఫిబ్రవరి 7న విడుదలవుతోంది.
- శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సంక్రాంతికి రానుంది.

ఇతర భాషల వారికీ అవకాశం

పాన్ ఇండియా ట్రెండ్ కారణంగా ఇప్పుడు బాలీవుడ్ హీరోయిన్లు దీపికా పదుకొణే, జాన్వీకపూర్, కియరా అద్వానీ తదితరులు ఇప్పటికే తెలుగు సినిమాల్లో నటించారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి తెరకెక్కుతున్న సినిమాల్లో బాలీవుడ్‌తో పాటు వివిధ సినీ ఇండస్ట్రీలకు చెందిన నటీ నటులకు అవకాశాలు దక్కుతున్నాయి. కొంతమంది బాలీవుడ్‌లో కంటే తెలుగు మూవీస్‌లో బాగా రాణిస్తున్నారు. వరుసగా అవకాశాలు వస్తుండటంతో ఇక్కడే బిజీ అయిపోతున్నారు. త్వరలో రాబోతున్న పుష్ప-2, గేమ్ ఛేంజర్, హరిహర వీరమల్లు వంటి భారీ బడ్జెట్ చిత్రాల్లో బాలీవుడ్‌తో పాటు తమిళ, మలయాళీ, కన్నడ ఆర్టిస్టులు పనిచేస్తున్నారు.



బరువు తగ్గండిలా...

ఆరోగ్యంగా ఉంటూనే బరువు తగ్గడమనేది పెద్ద సవాల్. చాలామంది బరువు తగ్గాలని రకరకాల వ్యాయామాలు, వాకింగ్ చేస్తుంటారు. అయినా ప్రయోజనం ఉండదు. మరికొంతమంది తినడం మానేస్తుంటారు. దీనివల్ల ఆరోగ్యం పాడయ్యే ప్రమాదముంది. రోజువారీ తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేర్పులు చేసుకుంటూ కొన్ని జాగ్రత్తలు పాటిస్తే సులభంగా బరువు తగ్గవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!

బ్రేక్‌ఫాస్ట్

మనం ఉదయం తీసుకునే అల్పాహారం రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. అయితే కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే ఇడ్లీ, వడ వంటివి కాకుండా ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. డ్రై ఫ్రూట్స్, నట్స్, పాలకూర, టోఫుతో కూడిన సలాడ్స్, మొలకెత్తిన గింజలు, పండ్ల రసాలు, పప్పు ధాన్యాలు, పన్నీరు, గ్రుడ్లు, యోగర్ట్ తీసుకోవడం మంచిది. ప్రోటీన్లు ఆకలిని నియంత్రించి వేగంగా బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి.

ఫైబర్

ప్రేగులలో సమస్యలను నివారించి జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఫైబర్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. శరీరంలో జీవక్రియలను పెంచి క్రొవ్వు పేరుకోకుండా చేస్తుంది. ఫైబర్ అధికంగా లభించే ఆకు కూరలు, పండ్లు, తృణధాన్యాలు, చిక్కుళ్లను తరచూ తినడం వల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

కార్బోహైడ్రేట్స్

ఇవి శరీరానికి శక్తిని అందించే ప్రాథమిక పోషకాలు. అయినప్పటికీ వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో క్రొవ్వు పెరుగుతుంది. బరువు తగ్గడంలో భాగంగా మనం ఎంచుకొని తీసుకునే ఆహారం నుంచి లభించే కార్బోహైడ్రేట్స్ శరీరానికి సరిపోతాయి. అదనంగా అవసరం లేదు. కాబట్టి కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే బియ్యం, గోధుమలతో తయారు చేసిన ఆహారాన్ని తినడం తగ్గించాలి.



నీరు

ప్రతి రోజూ శరీరానికి అవసరమైన నీరు త్రాగినపుడే అవయవాలన్నీ సరిగా పనిచేసి వ్యర్థాలను బయటికి పంపుతాయి. రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు త్రాగితే ప్రేగు కదలికలు సక్రమంగా ఉండి శరీరంలో టాక్సిన్స్ పేరుకోవు. ఉదయాన్నే ఓ గ్లాసు గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల కూడా బరువు నియంత్రణలో ఉంటుంది.

వ్యాయామం

బరువు పెరగకుండా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అరగంట వ్యాయాయం చేయాలి. వెయిట్ లిఫ్టింగ్, స్క్వాట్స్ స్ట్రెచర్స్ చేయడం వల్ల శరీరం లోని అనవసర క్రొవ్వులు కరగిపోతాయి. రక్తప్రసరణ వ్యవస్థ మెరుగవుతుంది. కండరాలు దృఢంగా మారతాయి. ఉదయం వేళల్లో వాకింగ్, రన్నింగ్ కూడా మంచి ఫలితాన్నిస్తాయి.

నిద్ర

సరిగా నిద్రపోకపోవడం వల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తయి ఒత్తిడిని కలిగిస్తుంది. దీనివల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ కనీసం ఏడు నుంచి తొమ్మిది గంటలు నిద్రించడం వల్ల అంతర్గత అవయవాలు విశ్రాంతి పొంది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

సమయపాలన

బరువు తగ్గాలనుకునేవారు ఎక్కువసేపు ఆకలితో ఉండకూడదు. భోజనానికి గంట ముందు ఏదైనా ప్రోటీన్ ఫుడ్ తినడం మంచిది. ప్రతిరోజూ ఒకే సమయానికి భోజనం పూర్తిచేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గకుండా శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడకుండా ఉంటాయి.

మేని మెరుపులకు...

తెల్లని చర్మం కోసం తయారవుతున్న లోషన్లు, క్రీముల్లో రసాయనాలుంటాయనే విషయం అందరికీ తెలిసిందే! వాటితో దుష్ప్రభావాలకు గురవకుండా ఉండటానికి సహజసిద్ధ చిట్కాలున్నాయి. అవే ఇవి..



- ఎండలోకి వెళ్లేటప్పుడు చర్మాన్ని కప్పి ఉంచాలి. ఇందుకోసం స్కార్ఫ్ వాడుకోవాలి. ద్విచక్ర వాహనాలను నడిపేవాళ్లు తప్పనిసరిగా స్కార్ఫ్, హెల్మెట్ వాడుకోవాలి.
- రోజుకి 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగాలి.
- 7 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి.
- తాజా పళ్ల రసాలు, ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి.
- వాతావరణ కాలుష్యానికి దూరంగా ఉండాలి.
- చక్కెర వాడకం తగ్గించాలి.
- 16 ఏళ్ల లోపు యువతులు ఎలాంటి సౌందర్య సాధనాలూ వాడకూడదు.
- ఇంట్లో తయారు చేసుకుని వేసుకునే ప్యాక్స్ వల్ల తాత్కాలిక ఫలితం మాత్రమే ఉంటుంది.
- చర్మానికి సంబంధించిన ఎలాంటి సమస్య వచ్చినా సొంత వైద్యం మాని చర్మ వైద్యులను సంప్రదించాలి.



ఏడు నగరాల్లో ఈవెంట్స్

అల్లు అర్జున్, రశ్మిక కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప ద రూల్' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. వచ్చే నెల5న ప్రపంచ వ్యాప్తంగా 12 వేల స్క్రీన్లలో భారీ ఎత్తున విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ ఈవెంట్స్‌ను ఇండియాలోని ఏడు మేజర్ సిటీస్.. పాట్నా, కొలకతా, చెన్నై, కొచ్చి, బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు నిర్మాతలు చెప్పారు.

గద్దలకొండ గణేశ్‌లా గుర్తుండిపోతుంది

వరుణ్‌తేజ్



"గద్దల కొండ గణేశ్' చిత్రం విడుదలయ్యాక జనాలు నన్ను 'వరుణ్' అని కాకుండా 'గణేశ్' అనే పిలిచారు. నటుడిగా నాకది పెద్ద ప్రశంస. పాత్ర పేరుతో మనల్ని పిలిస్తే నటుడిగా వచ్చే సంతృప్తే వేరు. ఒక నటుడికి అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. ఇప్పుడు 'మట్కా' చిత్రంలో నేను పోషించిన వాసు పాత్ర కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది' అని వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా కరుణకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'మట్కా'. ఈ నెల 14న 'మట్కా' చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మీడియాతో ముచ్చటించారు.

- బర్మా నుంచి వైజాగ్‌కు శరణార్థిగా వచ్చిన వాసు అనే అబ్బాయి కథే మట్కా. 1958 నుంచి 1982 వరకూ మట్కా సామ్రాజ్యంలో అతను అంచెలంచెలుగా ఎదిగిన తీరును సినిమాలో ఆసక్తికరంగా చూపించబోతున్నాం.
- కరుణకుమార్ మంచి విజన్ ఉన్న దర్శకుడు. ఈ సినిమాతో ఆయనకు ఇంకా మంచి పేరు వస్తుంది. ముంబైకి చెందిన రతన్ ఖత్రీ జీవితం ఆధారంగా కరుణకుమార్ ఈ కథ రాసుకున్నారు. మన నేటివిటీకి తగ్గట్లు కథలో, హీరో పాత్రలో మార్పులు చేశాడు. ఆయనతో నా పాత్ర గురించి తరచూ చర్చించేవాణ్ణి. చాలా సార్లు స్క్రిప్ట్ చదివాను. వాసు ఎలా కూర్చుంటాడు, ఎలా నడుస్తాడు, ఎలా సిగరెట్ కాలుస్తాడు అనేదానిపై ఒక అంచనాకు వచ్చా.
- వాసు లాంటి పాత్ర పోషించడం నటుడిగా నాకు సవాల్ విసిరింది. ఇందులో నాలుగు గెటప్స్‌లో కనిపిస్తాను. ఓల్డ్ క్యారెక్టర్ కోసం ఏఐ రిఫరెన్స్ తీసుకున్నాం.

ధూం ధాంగా అలరిస్తోంది

చేతన్ కృష్ణ



చేతన్ కృష్ణ, హెబ్బాపటేల్ జంటగా నటించిన 'ధూం ధాం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం చిత్ర బృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. చేతన్ కృష్ణ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమా చాలా బావుంది అని మెచ్చుకుంటున్నారు. థియేటర్స్ హౌస్‌ఫుల్ అవ్వడం సంతోషాన్నిస్తోంది. మా సినిమా ధూం ధాంగా ప్రేక్షకులను అలరిస్తోంది' అని చెప్పారు. దర్శకుడు సాయికిశోర్ మచ్చా మాట్లాడుతూ "ధూం ధాం' సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అంటున్నారు. ప్రతి సెంటర్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. వెన్నెల కిశోర్, బెనర్జీ పాత్రలు ప్రేక్షకులకు బాగా నచ్చాయి' అన్నారు. నిర్మాత ఎం.ఎస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 'పెద్ద సినిమాల మధ్య 'ధూం ధాం'లాంటి చిన్న సినిమా నిలదొక్కుకోవడమే గొప్ప విషయం. అలాంటిది మా సినిమా మంచి వసూళ్లను రాబడుతోంది. కుటుంబ ప్రేక్షకులు మా సినిమాను బాగా ఆస్వాదిస్తున్నారు' అని తెలిపారు.



శంకర్‌తో పనిచేయడం అదృష్టం

రామ్ చరణ్

హీరో రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'గేమ్ ఛేంజర్'. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం లక్నోలో మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ మాట్లాడుతూ 'ఈ రోజు డైరెక్టర్ శంకర్‌ని విస్ అవుతున్నాం. ఆయన మూవీ ఫైనల్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఆయనతో కలిసి పనిచేయడం నా అదృష్టం. ఇండియాలో లక్నో చాలా పెద్ద నగరం. ఇక్కడ మనుషుల మనసులు కూడా చాలా పెద్దవి. మా గత చిత్రాన్ని పెద్ద మనసుతో ఆదరించారు. ఈ రోజు ఇక్కడ టీజర్ లాంచ్ జరగడం ఆనందంగా ఉంది' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ' శంకర్‌తో పని చేయాలని ఎప్పటి నుంచో అనుకున్నాను. పైగా అది రామ్ చరణ్‌తో అవ్వడం మరింత ఆనందంగా ఉంది' అని అన్నారు. ఎస్‌జె సూర్య, అంజలి, కియారా అద్వానీ మాట్లాడుతూ సంక్రాతికి వస్తున్న ఈ సినిమాను ఆదరించారించాలని ప్రేక్షకులను కోరారు.

తెలంగాణలో 243 కులాలు

(మొదటిపేజీ తరువాయి)

సమాచారంతోపాటు ఆయా కుటుంబాల భూముల వివరాలు, వారికి ఎదురవుతున్న భూ సమస్యలపైనా ఆరా తీస్తోంది. వ్యాపారవేత్తలైతే.. వారి వార్షిక టర్నోవర్ వివరాలు అడుగుతోంది. ఇక ప్రార్థనాలయాలకు వెళ్లే విషయంలో కులపరమైన వివక్ష ఎదురవుతోందా? అని కూడా తెలుసుకుంటోంది. రాష్ట్రంలో శనివారం ప్రారంభమైన కులగణన ప్రశ్నావళిలో ఎన్యుమరేటర్లు ఈ వివరాలన్నింటినీ సేకరిస్తున్నారు. కులాల జాబితాకు సంబంధించి.. ఎస్సీల్లో ఆది ఆంధ్ర నుంచి వల్లూవాన్ వరకు మొత్తం 59 కులాలు ఉన్నట్లు, ఎస్టీల్లో అంధ్ నుంచి నక్కల కుర్వికరణ్ వరకు కలిపి 32 కులాలు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది బీసీ జాబితాలో అన్ని కేటగిరీల్లో కలిపి 134 కులాలు ఉన్నట్లు తెలిపింది. వీటిలో.. బీసీ-ఏ కేటగిరీలో 57 కులాలు, బీసీ-బీలో 27 కులాలు, బీసీ-సీలో 01, బీసీ-డీలో 35, బీసీ-ఈలో 14 కులాల చొప్పున ఉన్నాయి. వీరితోపాటు అనాథలు, పదేళ్ల వయసు రాకముందే తల్లిదండ్రులను కోల్పోయి నిరాశ్రయులైన పిల్లలను బీసీ-ఏ కేటగిరీ కింద నమోదు చేయాలని పేర్కొంది. వీరి కోసం ప్రధాన కాలమ్‌లో కులం కోడ్ కింద 044ను కేటాయించింది. కాగా, క్రిస్టియన్ మతంలోకి మారిన షెడ్యూల్ కులాల (ఎస్సీలు) వారితోపాటు వారి సంతానాన్ని బీసీ-సీలో నమోదు చేస్తున్నారు.

ఓసీల్లో 18 కులాలు..

ఓపెన్ కేటగిరీ (ఓసీ)లో మొత్తం 18 కులాలున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. బీసీ-సీలో లేని క్రిస్టియన్లు, బీసీ-ఈలో లేని ముస్లింలను కూడా ఓసీ జాబితా కింద ఉంచారు. వీరికి ప్రత్యేక కోడ్‌లను కేటాయించారు. వీరీ కాకుండా.. జైనులు, బౌద్ధులు, లింగాయత్, మార్వాడీ, పట్నాయక్, సిక్కులు, వర్మలు కూడా ఓసీ జాబితాలోనే ఉన్నారు. ఇంకా ఎవరైనా ఇతరులుంటే వారి కోసం '000'ను కోడ్‌గా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు ప్రభుత్వం సూచించింది. వివరాల సేకరణకు వెళ్లిన ఎన్యురేటర్లు.. ఆయా కుటుంబసభ్యులు చెప్పిన కులాన్ని బట్టి సంబంధిత కోడ్‌ను నమోదు చేస్తున్నారు. తెలంగాణలో ఉంటున్న స్థానికేతరులైతే.. వారు ఏ రాష్ట్రానికి చెందిన వారనే వివరాలను నమోదు చేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కోడ్‌లను కేటాయించారు. ఇక రాష్ట్రంలోని కుటుంబాలు, ఆయా కుటుంబాల్లోని వ్యక్తులు ఏ భాష మాట్లాడుతారనే వివరాల కోసం తెలుగు సహా మొత్తం 18 భాషలకు కోడ్‌లను ప్రశ్నావళిలో కేటాయించారు. అంతేకాకుండా.. కులపరమైన వివక్ష, బెదిరింపులు, ఆయా మతాల ప్రార్థనాలయాలకు వెళ్లే అంశాలను కూడా కులగణనలో తెలుసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ప్రశ్నావళిలో ప్రత్యేక ప్రశ్నలను పొందుపరిచారు. ప్రశ్నావళి షెడ్యూల్ కాలమ్ సంఖ్యలో 56వ ప్రశ్నలో 'ఎలాంటి బెదిరింపులు, వివక్ష లేకుండా మీ కుటుంబంలోని సభ్యులు స్థానిక దేవాలయాలకు, మసీదులకు, చర్చిలు, ప్రార్థనా మందిరాలకు స్వేచ్ఛగా వెళ్లగలుగుతున్నారా?'అని ప్రశ్నిస్తున్నారు.

భూ సమస్యలపైనా వివరాల సేకరణ..

కుటుంబ సభ్యుల భూముల వివరాలను నమోదు చేసే క్రమంలో భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకుంటున్నారు. ఆయా సమస్యలను నమోదు చేసేందుకూ కోడ్‌లను కేటాయించారు. వీటిలో "వారసత్వం లేదా మ్యుటేషన్ సమస్యలు, పట్టా ఉంది కానీ దానిలో వివరాలు తప్పుగా వచ్చాయి, ధరణి వల్ల వచ్చిన పట్టా సమస్య, పట్టా ఉన్నా భూమి ఇతరుల అక్రమ ఆధీనంలో ఉంది, అసైన్డ్ భూమి ఇచ్చారు కానీ పట్టా ఇవ్వలేదు, ఇదే భూమిపై సర్వే జరిగినా అటవీ హక్కు పత్రం(పట్టా) ఇవ్వలేదు, ప్రభుత్వ భూమి సాగు చేస్తున్నాం, అసైన్డ్ పట్టా కోరుతున్నాం, ఇతరములు" లాంటి ప్రశ్నలకు వివరాలను కోడ్‌ల వారీగా నమోదు చేస్తున్నారు. వ్యాపారం, రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నవారు, పారిశ్రామికవేత్తల నుంచి వారి వార్షిక టర్నోవర్ వివరాలను తెలుసుకొని నమోదు చేస్తున్నారు. ఇక కాంట్రాక్టర్, బిల్డర్, సినిమా నిర్మాత, దర్శకులు, నటీనటులు, క్రీడాకారులు సహా వివిధ పనులు చేసే వారి వివరాలను ప్రశ్నావళిలోని స్వయం ఉపాధి అనే కాలమ్‌లో ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. సంగీత, వాయిద్య, నాటక, గానం, నృత్యం, చిత్రకారులను కళాకారుల కింద, వాస్తు, జ్యోతిష్యం, మతపరమైన సేవలు, పురోహితులు, మౌలానా, చర్చి పాస్టర్.. ఇలా అన్ని వివరాలకూ ప్రత్యేక కోడ్‌లను కేటాయించారు.

అప్పులు చెబుతున్నారు కానీ..!

రాష్ట్రంలో శనివారం ప్రారంభమైన కులగణనలో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రశ్నావళిలో ఉన్న అన్ని ప్రశ్నలకు ఆయా కుటుంబ పెద్ద, సభ్యులు సమాధానం చెబుతున్నప్పటికీ.. ధరణి పాస్‌బుక్, ఆధార్ నంబర్లు చెప్పేందుకు కొంత వెనకాడుతున్నారు. అయితే తమ కుటుంబానికి ఎంత అప్పు ఉందనే ప్రశ్నకు మాత్రం వెంటనే సమాధానం చెబుతున్నట్టు తెలిసింది. ధరణి, ఆధార్ నంబర్లు చెబితే తమ ఆస్తుల వివరాలన్నీ ప్రభుత్వానికి తెలిసిపోతాయని, ప్రభుత్వ పథకాలేవీ తమకు దక్కవనే అపోహలో కొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని తొలగించేందుకు ప్రభుత్వం చేపట్టిన కులగణన ఎందుకు, దాని ఉపయోగాలు ఏంటనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర ఇంటింటి సర్వే షురూ

కుటుంబ వివరాలిచ్చిన గవర్నర్.. మంత్రులు దామోదర, పొన్నం కూడా

- పలు చోట్ల సర్వే బహిష్కరణ.. అధికారుల అడ్డగింత
- కలెక్టర్లు ఎన్యుమరేటర్ల సందేహాలు నివృత్తి చేయాలి
- సర్వేలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనేలా చూడండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి
- సర్వేపై నమ్మకంగా ఉండండి: మంత్రులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


కులగణనలో భాగంగా పొన్నం నివాసంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

రాష్ట్రవ్యాప్తంగా శనివారం సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభమైంది. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తమ కుటుంబ సభ్యుల వివరాలను అందజేశారు. సమగ్ర ఇంటింటి సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని మంత్రులు సూచించారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. మరికొన్ని చోట్ల ప్రజలు సర్వేను బహిష్కరించారు. తమ సమస్యలను పరిష్కరిస్తేనే సర్వేకు సహకరిస్తామని ఎన్యుమరేటర్లకు స్పష్టం చేశారు. సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభమైనందున కలెక్టర్లు తమ జిల్లాల్లోని ఎన్యుమరేటర్లతో మాట్లాడుతూ సందేహాలను నివృత్తి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కుటుంబ సర్వేపై శనివారం ఆయన జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటింటి సర్వేపై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తుంటారని.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ఎన్యుమరేటర్లతో మాట్లాడితే, ఆ సందేహాలను నివృత్తి చేయవచ్చని భట్టి చెప్పారు. అవసరమైతే ఉన్నతాధికారుల నుంచి కలెక్టర్లు స్పష్టత తీసుకోవాలన్నారు. ఏ చిన్న విషయాన్ని నిర్లక్ష్యం చేయరాదని, ఎలాంటి సందేహాలనైనా నివృత్తి చేయడానికి ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఇతర ఉన్నతాధికారులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సాధ్యమైనంత ఎక్కువ సార్లు సర్వేలో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు.

గవర్నర్ కుటుంబ వివరాల సేకరణ

రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కుటుంబ వివరాలను అధికారులు సేకరించారు. గవర్నర్ స్వయంగా తెలిపిన వివరాల్ని ఫాంలో నమోదు చేసుకున్నారు. ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకూడదని, నమ్మకంతో వివరాలను ఇవ్వాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. సంగారెడ్డిలోని విద్యానగర్‌లో తన ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లకు కుటుంబ వివరాలు అందజేశారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బంజారాహిల్స్, మినిస్టర్స్ కాలనీలోని మంత్రి నివాసంలో ఆయన కుటుంబ వివరాలను సేకరించిన తర్వాత ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు అతికించారు.

కరీంనగర్ జిల్లాలో పూర్తికాని స్టిక్కరింగ్

కరీంనగర్ నగర పాలక సంస్థతో పాటు సమీపంలోని కొన్ని గ్రామాల్లో శనివారం సాయంత్రం వరకూ స్టిక్కరింగే పూర్తి కాలేదు. దీంతో జిల్లాలో కుటుంబాల సంఖ్య తేలలేదు. అధికారులు ఈ విషయమై ఎలాంటి ప్రకటనా చేయలేదు. స్టిక్కరింగ్ చేసిన ప్రాంతాల్లో సర్వే సమాచారాన్ని సేకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అంతటా సర్వే ఆలస్యంగా ప్రారంభమైంది. సకాలంలో సర్వే పత్రాలు అందకపోవడంతో కొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 12 గంటలకు, మరికొన్ని గ్రామాల్లో 3 గంటలకు సర్వే ప్రారంభించారు. జగిత్యాల జిల్లాలో తొలి రోజు 2.58శాతం సర్వే పూర్తి చేశారు. పెద్దపల్లి జిల్లాలో 1,849మంది ఎన్యుమరేటర్లు 13,649కుటుంబాల సర్వే పూర్తి చేశారు. గ్రామ సరిహద్దులు మార్చే వరకు సర్వేను బహిష్కరిస్తున్నట్లు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లె గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి వచ్చిన అధికారులకు వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తాము సర్వేకు సహకరించబోమని తెలిపారు.

దండం పెట్టి.. ఇంటికి రప్పించి..

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అన్నవరంలో సర్వేను పరిశీలించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్పెషల్ ఆఫీసర్ (ఐఏఎస్) సురేంద్రమోహన్ వెళ్లారు. గ్రామానికి చెందిన వృద్ధుడు బత్తుల లక్ష్మయ్య ఆయనకు దండం పెట్టి తనకు ఇల్లు కావాలని వేడుకున్నాడు. ఆయన్ను తన గుడిసె వద్దకు తీసుకెళ్లాడు. తినడానికి తిండి లేదని, ఇబ్బందులు పడుతూ జీవిస్తున్నాని, ఇల్లు మంజూరు చేయాలని కోరాడు. స్పందించిన అధికారి.. వృద్ధుడి ఆధార్‌ను సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీసుకున్నారు. సర్వేలో సమాచారం ఇస్తే నిబంధనల ప్రకారం ఇల్లు వస్తుందని భరోసా ఇచ్చారు.

ఇథనాల్ పరిశ్రమను తరలిస్తేనే..

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో ప్రజలు సర్వేను బహిష్కరించారు. ఇథనాల్ పరిశ్రమను తరలిస్తేనే సర్వేకు సహకరిస్తామని తేల్చిచెప్పారు. స్పందించిన నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, డీపీవో శ్రీనివాస్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఇతర అధికారులు గుండంపల్లి గ్రామానికి వచ్చారు. గ్రామస్థులు వారిని పొలిమేరల్లోనే అడ్డుకొని, నిరసన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా రాని అధికారులు ఇప్పుడెందుకు వచ్చారంటూ నిలదీశారు. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించాకే తమ గ్రామంలోకి రావాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే సర్వేకు సహకరిస్తామని తేల్చిచెప్పారు. దీంతో అధికారులు చేసేదేమీ లేకవెనుదిరిగి వెళ్లిపోయారు.

రంగంలోకి ప్రత్యేక కమిషన్

రేపు, ఎల్లుండి అభిప్రాయ సేకరణ... త్వరలో జిల్లాల్లో

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ రంగంలోకి దిగనుంది. ఈ మేరకు రేపు, ఎల్లుండి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభిప్రాయ సేకరణ(పబ్లిక్ హియరింగ్) కార్యక్రమాన్ని నిర్వహించనుంది. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య తెలుగు సంక్షేమ భవన్‌లోని 4వ అంతస్తులో ఏర్పాటైన కమిషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయితే, సోమవారం ఎవరైనా వచ్చి తమ అభిప్రాయాలను కమిషన్‌కు వెల్లడించేందుకు అవకాశం కల్పించగా.. మంగళవారం మాత్రం వివిధ ఎన్‌జీవోలు, పలు సంస్థలు, కుల సంఘాలకే అవకాశం కల్పిస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి బి.సైదులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, త్వరలోనే ఈ పబ్లిక్ హియరింగ్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా నిర్వహించనున్నట్లు తెలిసింది. మరోవైపు రాష్ట్రంలో కులగణన సర్వే ప్రారంభమైన విషయం తెలిసిందే. వివరాల సేకరణ అనంతరం ప్రత్యేక కమిషన్ బీసీల రిజర్వేషన్లను ఖరారు చేస్తుంది.

కులగణనపై బీజేపీ వైఖరేంటి?: పొన్నం

- కేటీఆర్ కాపలా కుక్కలా అమోయ్‌కుమార్: మల్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులగణనపై బీజేపీ వైఖరేంటో స్పష్టం చేయాలని.. అనుకూలమా లేక వ్యతిరేకమా అన్నది ఆ పార్టీ నేతలు తేల్చి చెప్పాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీసీ సామాజిక వర్గం నుంచి వచ్చిన బీజేపీ ఎంపీ లక్ష్మణ్.. బీసీ వర్గాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడుతూ.. బిహార్‌లో కులగణన చేసిన నితీశ్ ప్రభుత్వాన్ని, కులగణనపై మహారాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన ఉద్ధవ్ ఠాక్రే సర్కారును కూలగొట్టింది.. ఝార్ఖండ్‌లో బీసీ రిజర్వేషన్‌ను 27 శాతానికి పెంచితే గవర్నర్ సంతకం కాకుండా ఆపింది బీజేపీ కాదా ప్రశ్నించారు. కులగణనకు కేంద్రంపై ఒత్తిడి తెస్తారా.. లేక బలహీన వర్గాల ద్రోహిగా మిగులుతారా అన్నది రాష్ట్ర బీజేపీ నేతలు తేల్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వేలాగా దీన్ని గోప్యంగా ఉంచబోమని తెలిపారు. కేటీఆర్‌కు కాపలా కుక్కలా పని చేసిన ఐఏఎస్ అమోయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా ప్రజలను నిండా ముంచాడని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మూసీ నీళ్లు తాగిస్తే కానీ కేటీఆర్, హరీశ్‌రావుకు బుద్ధి రాదన్నారు. 'సన్నాసుల్లారా.. మహాత్మాగాంధీతో కేసీఆర్‌ను పోలుస్తారా? కేసీఆర్ గాంధీ కాదు గాడ్సే.. మీలాగా సీఎం రేవంత్ చిల్లర మాటలు మాట్లాడలేదు' అంటూ వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు అబద్ధాలతో పబ్బం గడిపిన బీఆర్ఎస్ నేతలు.. మళ్లీ ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారని మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ఫైర్ అయ్యారు. ఇంటికో ఉద్యోగం, రూ.లక్ష రుణమాఫీ అమలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, జిల్లాకొక మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తామన్న హామీలు ఏమేరకు అమలు చేశారని నిలదీశారు.

30 ఏళ్లు పని చేసిన సిబ్బంది హక్కులను కాదనలేరు: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దాదాపు 30 ఏళ్ల పాటు సేవలు అందించిన నాలుగో తరగతి ఉద్యోగుల హక్కులను ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు కాలరాయలేవని హైకోర్టు వ్యాఖ్యానించింది. తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్‌లో 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసును పూర్తిచేసుకున్నప్పటికీ రెగ్యులరైజ్ చేయకపోవడం వారి హక్కులను నిరాకరించడం కిందకే వస్తుందని పేర్కొంది. ఇప్పటికీ సర్వీసులో ఉన్న 47మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఆదేశించింది. రిటైర్ అయిన, చనిపోయిన ఉద్యోగులకు సర్వీసు అనంతర పెన్షనరీ బెనిఫిట్స్ అందజేయాలని స్పష్టం చేసింది.

ఏడేళ్లయినా స్వీపర్ జీతం ఇవ్వరా?

సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేసిన ఉద్యోగికి వేతనం చెల్లించాలని 2017లో ఇచ్చిన ఉత్తర్వులు అమలుకాకపోవడంపై జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. 27వ తేదీ నాటికి సమస్య పరిష్కారం కాకపోతే హోంశాఖ ముఖ్యకార్యదర్శి తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరుకావాలని స్పష్టంచేసింది.

అప్పుల బాధతో చేనేత దంపతుల బలవన్మరణం

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన


బైరి అమర్, స్రవంతి(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక చేనేత దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. సిరిసిల్ల పట్టణం వెంకంపేటలోని మైసమ్మ వీధిలో నేత కుటుంబానికి చెందిన బైరి అమర్ (45), స్రవంతి (40) దంపతులు నివాసం ఉంటున్నారు. బైరి అమర్‌కు నాలుగు జోడీల సాంచెలు ఉండగా వాటి ద్వారా బెడ్ షీట్లు నేసి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా వస్త్ర పరిశ్రమలో సంక్షోభం కారణంగా అమర్‌కు పనిలేకుండా పోయింది. అంతకుముందే ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు రుణం తీసుకోవడంతో 25 లక్షల వరకు అప్పులయ్యాయి. వస్త్ర పరిశ్రమ నిలిచిపోవడంతో అమర్ తన సాంచలు అమ్మేశాడు. అయినా అప్పు తీరలేదు. దీంతో మనస్తాపం చెందిన దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు.

దిగుబడి తగ్గిందని ఇద్దరు రైతుల ఆత్మహత్య

- వరంగల్, సిరిసిల్ల జిల్లాల్లో ఘటనలు


బానోతు మైబూ, బలరాంనాయక్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఎల్లారెడ్డిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తెచ్చి సాగు చేసిన వరి పంట సరైన దిగుబడి రాదన్న భయంతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలు వరంగల్, సిరిసిల్ల జిల్లాల్లో జరిగాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని చంద్రు తండా శివారు జగ్నా తండాలో జరిగింది. రైతు బానోతు మైబూ (35) ఈఎంఐలో కొనుగోలు చేసిన ట్రాక్టర్ కిస్తీలు కట్టలేక మథనపడేవాడు. దీనికి పంట దిగుబడి తగ్గడంతో అప్పులు తీర్చలేనన్న భయంతో ఈ నెల 7న పొలంలో పురుగు మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 8న రాత్రి మృతి చెందాడు. అలాగే, సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట మండలం చింతకుంట తండాకు చెందిన బలరాంనాయక్ ఉపాధి నిమిత్తం రూ.8లక్షలు అప్పు చేసి గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అక్కడ పనులు లేక ఏడాది క్రితం తిరిగొచ్చాడు. రూ.1 లక్ష అప్పు చేసి వరిసాగు చేయగా, పంటకు తెగుళ్లు సోకాయి. వారం క్రితం పంటను కోసి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాడు. అయితే, దిగుబడి తగ్గిందన్న ఆవేదనతో శనివారం ఉరేసుకున్నాడు.

వ్రతానికి బయలుదేరి తిరిగిరాని లోకాలకు.. రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి

- అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టిన కారు

బెజ్జంకి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేదారీశ్వర వ్రతం చేసుకునేందుకు కుమార్తెతో కలిసి పుట్టింటికి బయలుదేరిన ఓ మహిళ గమ్యం చేరుకోలేకపోయింది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టగా ఆ తల్లీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ బడంగ్‌పేటకు చెందిన వేముల వరలక్ష్మి (42), ఆమె కుమార్తె అధిత్రి (13) చనిపోయారు. వరలక్ష్మి సోదరుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. వరలక్ష్మి, కుమార్తె అధిత్రి, సోదరుడు ఉదయ్‌రామ్ కలిసి శనివారం హైదరాబాద్ నుంచి కరీంనగర్‌లోని పుట్టింట్లో కేదారీశ్వర వ్రతానికి కారులో బయలుదేరింది. బెజ్జంకి క్రాసింగ్ శివారుకు రాగానే కారు అదుపు తప్పి కల్వర్టును బలంగా ఢీకొట్టింది. దీంతో వరలక్ష్మి, అధిత్రి ప్రాణాలు కోల్పోగా, తీవ్ర గాయాలపాలైన ఉదయ్ రామ్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

దొంగలతో జట్టుకట్టి ప్రాణాలు కోల్పోయిన మాజీ పోలీసు

డబ్బు వివాదం.. కారుతో ఢీకొట్టి హత్యాయత్నం

9 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈజీ మనీ కోసం దొంగలతో జట్టుకట్టి ఉద్యోగం కోల్పోయిన ఆ పోలీసు, డబ్బు పంపకాల్లో తేడా వచ్చి వారి చేతిలోనే దారుణహత్యకు గురయ్యాడు. సరూర్‌నగర్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ సైదిరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన ఈశ్వర్ (38) ఉమ్మడి రాష్ట్రంలో 2010లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. బేగంపేట, ఎస్సార్‌నగర్, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్ విభాగంలో విధులు నిర్వర్తించాడు. అంతటా క్రైమ్ విభాగంలో పనిచేయడంతో నేర వ్యవస్థపై పట్టు సాధించాడు. సెల్‌ఫోన్ దొంగలతో దోస్తీ పెంచుకుని, దొంగ సెల్‌ఫోన్లు ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారో తెలుసుకున్నాడు. వారిచ్చిన సమాచారంతో దొంగ సెల్‌ఫోన్ కొనుగోలుదారులను బెదిరించి డబ్బులు వసూలు చేయడానికి అలవాటుపడ్డాడు. సెల్‌ఫోన్ దొంగతనాల ఫిర్యాదులు సేకరించి, వాటిల్లోని ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సెల్‌ఫోన్‌లను గుర్తించేవాడు. ఆ సెల్‌ఫోన్లు వాడుతున్న వారికి ఫోన్ చేసి బెదిరించి వాటిని రికవరీ చేసి, విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. మరింత సొమ్మును కూడబెట్టేందుకు జేబుదొంగలు, స్నాచర్లతో ఈశ్వర్ జట్టుకట్టాడు. ఉమ్మడి రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన దొంగలు, స్నాచర్లతో ముఠా ఏర్పాటు చేసి ప్రధాన ప్రాంతాల్లో దొంగతనాలు, స్నాచింగ్‌లు చేయించసాగాడు. కాగా ఓ దొంగతనం కేసులో రెండేళ్ల క్రితం నల్లగొండ పోలీసులు ఈశ్వర్‌ను అరెస్ట్ చేశారు. ఈశ్వర్ ముఠా లీలలు వెలుగులోకి రావడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు అతడిని సర్వీసు నుంచి తొలగించారు. ఇటీవల ఈశ్వర్‌కు దొంగల ముఠాలతో విభేదాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. నగరంలో తనకు తెలియకుండా, తనకు కమీషన్ ఇవ్వకుండా ఇతరులెవరూ దొంగతనాలు చేయకుండా ఈశ్వర్ అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొంత మంది దొంగల ముఠాల నాయకులు ఈశ్వర్‌పై కక్ష పెంచుకున్నారు. గత కొన్ని రోజులుగా కొండాపూర్ హఫీజ్‌పేటకు చెందిన శంకర్‌తో, ఈశ్వర్‌కు వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై చర్చించుకునేందుకు ఈశ్వర్ బంధువైన బోడుప్పల్‌కు చెందిన విజయ్, సరూర్‌నగర్‌కు చెందిన రంజిత్, రామస్వామిలు గత నెల 31న కర్మన్‌ఘాట్‌లో ఈశ్వర్, శంకర్‌లకు మీటింగ్ ఏర్పాటు చేశారు. వీరంతా ఆ రోజు మధ్యాహ్నం 1.30కు ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చారు. అక్కడ కూర్చుని వివాదంపై చర్చిస్తూ మద్యం సేవించారు. చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఈశ్వర్, శంకర్‌తో పాటు విజయ్, రంజిత్, రామస్వామి, మరొక వ్యక్తి కలిసి బార్ నుంచి బయటకొచ్చారు. అక్కడ శంకర్ ఈశ్వర్‌లకు మరొకసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో శంకర్ బెలెనో కారుతో ఈశ్వర్‌ను ఢీకొట్టాడు. కిందపడిపోయిన ఈశ్వర్ నుంచి మరొకసారి కారు తీసుకవెళ్లి, అక్కడి నుంచి పారిపోయారు. రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న ఈశ్వర్‌ను స్థానికులు వెంటనే ఎదురుగా ఉన్నటువంటి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 9 రోజుల తర్వాత మృతి చెందాడు. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తుల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు.

మా ప్లాట్లపై కన్నేశాడు!

మంత్రి బంధువునంటూ రౌడీలతో బెదిరింపులు.. సుప్రీంకోర్టులోనూ గెలిచాం

- అయినా రెండుసార్లు గదులు, ప్రహరీ కూల్చివేయించాడు
- రక్షణ కల్పించాలన్న సోమలింగేశ్వర నగర్ బాధితులు


తమ వద్ద ఉన్న పత్రాలు, ఫొటోలు ప్రదర్శిస్తున్న బాధితులు

పంజాగుట్ట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పైసా పైసా కూడబెట్టి కొనుక్కున్న తమ ప్లాట్లను నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ మంత్రి బంధువునని చెబుతున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేయాలని చూస్తున్నాడని హయత్ నగర్‌లోని సోమలింగేశ్వర నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. సుమారు రూ.150 కోట్ల విలువ చేసే 101 ప్లాట్లపై ఆ కబ్జాదారు కన్నుపడిందని, రెండుసార్లు గదులు, ప్రహరీ గోడ కూల్చివేయించాడని, రౌడీలతో భయపెడుతున్నాడని పేర్కొంది. హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తమకు, తమ ప్లాట్లకు రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు టీ చంచల్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంవీ రావు, కోశాధికారి వైకృష్ణమూర్తి, బాధితులు సుధారాణి, మూర్తిరాజు తదితరులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాగ్ హయత్ నగర్‌లోని సర్వే నం.180, 187లలో ఉన్న సుమారు 9.20 ఎకరాల్లో పట్టాదార్లు జల్లా భిక్షపయ్య, ఆయన కుమారులు, జల్లా అచ్చిలింగం,రిజిస్టర్డ్ జీపీఏ హోల్డర్ జల్లా అయిలు 101 ప్లాట్లు ఏర్పాటుచేసి రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా 1983 నుంచి 1986 మధ్య విక్రయించగా కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి తమ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. కొంతమంది ప్లాట్ల చుట్టూ గోడలు కట్టుకోగా, మరి కొంతమంది గదులు నిర్మించుకున్నారని తెలిపారు. తమ ప్లాట్లపై స్థానికంగా ఉండే వేమిరెడ్డి సురేందర్ రెడ్డి కన్నుపడిందని, అప్పటి నుంచి తమకు ఇబ్బందులు, బెదిరింపులు మొదలయ్యాయన్నారు. తమకు విక్రయించిన పట్టాదార్లు, వారి రెండో తరం వారు కుమ్మక్కై పార్టీషన్ దావా దాఖలు చేసుకున్నారన్నారు. తర్వాత లోక్ అదాలత్‌లో రాజీ పడి తప్పుడు పత్రాలు సృష్టించారన్నారు. తమ ప్లాట్లను వ్యవసాయ భూమిగా చూపించి, 2024లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సురేందర్ రెడ్డి, జీ వెంకటొరెడ్డిలకు విక్రయించారన్నారు. అప్పటి నుంచి కింది కోర్టు మొదలుకుని సుప్రీంకోర్టు వరకు న్యాయం కోసం పోరాడగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. తహసీల్దార్ విచారణ జరిపి ఆన్‌లైన్ రికార్డులప్రకారం సర్వే నం. 180, 187లలో ఉన్నది వ్యవసాయ భూమి కాదని, ఇంటి స్థలాలుగా నిర్ధారించారన్నారు. అయినా సురేందర్ రెడ్డి తమను వేధిస్తున్నాడని, రెండుసార్లు ప్రహరీ గోడలు, గదులు కూల్చివేయించాడన్నారు. అతనిపై పలు సివిల్, క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. తాను నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ మంత్రి బంధువునని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. రౌడీలతో దాడులు చేయిస్తున్నాడన్నారు. తప్పుడు పత్రాలతో ప్రతి భూమిలో వివాదాలు సృష్టించడం, లోక్ అదాలత్‌లలో రాజీ చేసుకుని భూములు, డబ్బు వసూలు చేయడం ఆయన నైజమని ఆరోపించారు. తమ భూములపై అయనకు ఎలాంటి హక్కులు లేవని, వాటిని ఎవరూ కొన్ని మోసపోవద్దన్నారు. ఈ సమావేశంలో బాధితులు టీ సూర్యనారాయణ, శ్రీనివాస్, ఏ కృష్ణమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పేరిట వాట్సా్ప్‌లో ఫేక్ లింక్‌లు

- వివరాలు నమోదు చేసుకోమంటూ ఎర
- సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

హైదరాబాద్ సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జనాన్ని దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు ఉన్న ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో భాగంగా చేస్తోన్న ఇంటింటి సర్వేను కూడా సైబర్ మాయగాళ్లు వాడేస్తున్నారు. ఇంటింటి సర్వే పేరిట నకిలీ లింకులను వాట్సా్ప్‌లో పంపిస్తున్నారు. ఈ లింక్‌ను ఓపెన్ చేసి ప్రభుత్వ సర్వేలో పాల్గొని మీ వివరాలు నమోదు చేసుకోండి అంటూ ఎర వేస్తున్నారు. ఈ ప్రమాదకర లింక్‌లను ఎవరైనా ఓపెన్ చేస్తే.. వారి ఫోన్లు హ్యాక్ అవ్వడమే కాక వ్యక్తిగత సమాచారం చోరీ జరిగే అవకాశముంది. ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో ప్రభుత్వ సిబ్బంది స్వయంగా ఇళ్లకు వచ్చి సమాచారాన్ని సేకరిస్తారని, ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దని అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర్ సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత ప్రజలకు సూచించారు.

'పీఎం కిసాన్' లింక్‌తో 2 లక్షలు ఫట్

భారత ప్రభుత్వం రైతుల కోసం ప్రారంభించిన పథకం.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట వాట్సా్ప్‌లో లింకులు పంపి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షలు కొట్టేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి(50)కి రెండ్రోజుల క్రితం పీఎం కిసాన్-2 అనే పేరుతో వాట్సా్ప్‌లో ఓ ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ) ఫైల్ వచ్చింది. పీఎం కిసాన్ అని ఉండడంతో వ్యాపారి లింక్‌ను టచ్ చేయగానే.. పలు అప్లికేషన్లు ఫోన్‌లో డౌన్‌లౌడ్ అయిపోయాయి. అదే క్రమం లో అతని బ్యాంకు ఖాతాలోని రూ.2 లక్షలను సైబర్ కేటుగాళ్లు కొట్టేశారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

కులగణనతోనే సామాజిక అంతరాలు పోవు

- "కుల గణన ఎందుకు?" పై ప్రొ. నాగేశ్వర్



హైదరాబాద్ సిటీ, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కులగణనతో సామాజిక అంతరాలు తొలగిపోతాయనే వాదన సరికాదని ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చెప్పారు. పబ్లిక్ లెక్చర్స్ సిరీస్‌లో భాగంగా 'కుల గణన ఎందుకు?' అనే అంశంపై శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ సివిల్స్ కోచింగ్ సెంటర్‌లో ఆయన కీలకోపన్యాసం చేశారు. కులగణన వల్ల రిజర్వేషన్ల డిమాండ్ పెరుగుతుందనడంలోనూ సహేతుకత లేదని ఆయన కొట్టిపడేశారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి విధానాల రూపకల్పన కోసం సర్వేలు చేసుకొనే అధికారం రాష్ట్రాలకు ఉందన్న ఆయన కులగణన చేయడమంటే కులానికి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మధ్య సంబంధాన్ని తెలుసుకోవడమన్నారు. వెనుకబడిన తరగతుల్లో కొన్ని వర్గాలు అభివృద్ధి చెందుతుంటే, మరికొన్ని వర్గాలు మరింత అణచివేతకు గురవుతున్నాయని నాగేశ్వర్ చెప్పారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు సశాస్త్రీయంగా అమలు చేయడానికైనా కులాల వారీ లెక్కలు తెలియాలన్నారు.

బిజినెస్


అరబిందో ఫార్మా లాభం రూ.817 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.7,796 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.817 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 8 శాతం (రూ.7,219 కోట్లు), లాభం 8.6 శాతం (రూ.752 కోట్లు) వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో అమెరికా వ్యాపారం 4.3 శాతం వృద్ధితో రూ.3,530 కోట్లకు చేరుకుంది. కంపెనీ మొత్తం వ్యాపారంలో అమెరికా వాటా 45.3 శాతంగా ఉంది. యూరప్ ఫార్ములేషన్స్ వ్యాపారం కూడా 19 శాతం వృద్ధితో రూ.2,105 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో ఆర్ అండ్ డీపై కంపెనీ రూ.410 కోట్లు వెచ్చించింది.

పరమేశు బయోటెక్ రూ.600 కోట్ల ఐపీఓ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి కేంద్రంగా పనిచేసే పరమేశు బయోటెక్ రూ.600 కోట్ల నిధుల సమీకరణ కోసం త్వరలో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా రూ.520 కోట్ల మొత్తానికి కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా మిగతా రూ.80 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులతో మధ్యప్రదేశ్‌లో రూ.330 కోట్లతో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే మరో రూ.85 కోట్లను రుణాల చెల్లింపు సహా సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.

బ్యాండ్, బాజా, బరాత్..!



- డిసెంబరులోగా రూ.4.25 లక్షల కోట్ల వ్యాపారం
- వచ్చే యాభై రోజుల్లో 35 లక్షల పెళ్లిళ్లు
- సీఏఐటీ, ప్రభుదాస్ లీలాధర్ నివేదిక వెల్లడి

దేశవ్యాప్తంగా పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. దేశంలోని వ్యాపారాలకూ ఈ సీజన్ మరింత జోష్ ఇస్తోంది. ఈ నవంబరు-డిసెంబరు మధ్య కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 35 లక్షల పెళ్లిళ్లు జరగబోతున్నట్టు అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది మూడు లక్షలు ఎక్కువ. ఈ బ్యాండ్ బాజాల కోసం వధూవరుల తల్లిదండ్రులు ఎంత లేదన్నా ఈ రెండు నెలల్లో రూ.4.25 లక్షల కోట్లు ఖర్చు చేస్తారని ప్రభుదాస్ లీలాదర్ అనే బ్రోకరేజీ సంస్థ వెల్లడించింది. ఇందుకు సంబంధించి 'బ్యాండ్, బాజా, బరాత్ అండ్ మార్కెట్స్' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది.

డెస్టినేషన్ వెడ్డింగ్‌కు గిరాకీ

గతంలో పెళ్లిళ్లు అన్నీ వధూవరుల ఇంట్లో లేదా దగ్గరలోని కల్యాణ మండపాల్లో జరిగేవి. ఇప్పుడు ఈ ట్రెండ్ మారిపోతోంది. ఆర్థిక స్తోమతను బట్టి రాజస్థాన్ లేదా గోవా ఇందుకు వేదికలవుతున్నాయి. సెలబ్రిటీలైతే విదేశాల్లో తమ పిల్లల పెళ్లిళ్లు ధూమ్‌ధామ్‌గా చేస్తున్నారు. దీంతో కనీసం పిల్లల పెళ్లిళ్లు అయినా మన దేశంలో చేయండని ప్రధాని మోదీ ఇటీవల సెలబ్రిటీలకు విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. మరోవైపు ఈ మధ్య కాలంలో వెడ్డింగ్ ప్లానర్లకూ గిరాకీ పెరిగింది. బంధుమిత్రులకు టిక్కెట్ల బుకింగ్, విడిది సదుపాయల నుంచి కల్యాణ మండపాల అలంకరణ, వధూవరుల మేకప్ వరకు అన్నీ వీరే చూసుకుంటారు.

ఏటా రూ.10.96 లక్షల కోట్ల ఖర్చు

మన దేశంలో ఏటా దాదాపు కోటి జంటలు వివాహ బంధంతో ఒకటవుతుంటాయి. ఈ సంఖ్య ఏటా 7 నుంచి 8 శాతం చొప్పున పెరుగుతోంది. దేశంలో పెళ్లిళ్ల ఖర్చులు ఏటా ఎంత లేదన్నా 13,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.10.96 లక్షల కోట్లు) వరకు ఉంటాయని అంచనా. టర్నోవర్‌పరంగా చెప్పాలంటే వెడ్డింగ్ పరిశ్రమ మన దేశంలో నాలుగో పెద్ద పరిశ్రమ. ఈ ఏడాది జనవరి 15 నుంచి జూలై 15 వరకు దేశవ్యాప్తంగా దాదాపు 42 లక్షల పెళ్లిళ్లు నమోదయ్యాయి. ఇందుకోసం వధూవరుల తల్లిదండ్రులు రూ.5.5 లక్షల కోట్ల వరకు ఖర్చు చేసి ఉంటారని సీఏఐటీ అంచనా. మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో పసిడిపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో ఖర్చులు మరింత పెరిగాయి.

స్టాక్ మార్కెట్‌పై ప్రభావం

దసరా, దీపావళి వంటి పండగల సీజన్‌తో పాటు పెళ్లిళ్ల సీజన్‌లో మన దేశంలో వినియోగం తారాస్థాయికి చేరుకుంటుంది. ఈ సమయంలో రిటైల్, ఆతిథ్య రంగం, ఆటోమొబైల్ కంపెనీలు మరింత బిజినెస్ చేస్తుంటాయి. ఈ ప్రభావం స్టాక్ మార్కెట్‌నూ ప్రభావితం చేస్తుంది. మెట్రో సిటీల్లో వినియోగం తగ్గడంతో అనేక ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు ప్రస్తుతం నేలచూపులు చూస్తున్నాయి. కనీసం ఈ పెళ్లిళ్ల సీజన్ అయినా కలిసొస్తుందని ఈ కంపెనీలు గంపెడాశలు పెట్టుకున్నాయి.

ఫ్రెషర్స్ నైపుణ్యాలపై జీసీసీల దృష్టి

గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) నియామకాల జోరు పెంచాయి.ముఖ్యంగా కృత్రిమ మేధ(ఏఐ),మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్‌పై పట్టున్న ఫ్రెషర్ల కోసం ఈ కంపెనీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఈ రంగాలపై పట్టున్న ఫ్రెషర్లు దొరికితే ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల కంటే అధిక జీతాలు ఇచ్చి మరీ ఆఫర్ లెటర్లు ఇస్తున్నాయి. ఈ ప్యాకేజీ ఎంత లేదన్నా ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలతో పోలిస్తే 30% వరకు ఎక్కువగా ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి నైపుణ్యాల్లో విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూల్స్, జనరల్ డిగ్రీలు ఆఫర్ చేసే కాలేజీలకు జీసీసీలు క్యూ కడుతున్నాయి.

కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయం రూ.782 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్).. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.782 కోట్ల రెవెన్యూపై రూ.121 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రెవెన్యూ 655 కోట్లు ఉండగా లాభం రూ.101 కోట్లుగా ఉంది. సెప్టెంబరు త్రైమాసికంలో మహారాష్ట్రలోని నాసిక్ హాస్పిటల్ అందుబాటులోకి రాగా కేరళలోని కన్నూర్‌లో తొలి హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. అందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావటంపై ప్రధానంగా దృష్టి సారించామని, అందుకు తగ్గట్టుగానే తాము ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు.

గుంటూరులోనూ కిమ్స్: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులోకి కిమ్స్ హాస్పిటల్స్ అడుగుపెడుతోంది. గుంటూరుకి చెందిన ఇన్‌సిగ్నియా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా హాస్పిటల్ కార్యకలాపాలు, మేనేజ్‌మెంట్ బాధ్యతలను కిమ్స్ చేపట్టనుంది. కిమ్స్ శిఖర పేరుతో ఈ హాస్పిటల్‌ను నిర్వహించనుంది. ఇన్‌సిగ్నియా 150 పడకలతో ఈ హాస్పిటల్‌ను నిర్వహిస్తోంది. ఈ హాస్పిటల్‌ను 200 పడకలకు విస్తరించే అవకాశం ఉందని తెలిపింది.

దివీస్ లాభంలో 46% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దివీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.510 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.348 కోట్లు)తో పోల్చితే లాభం 46.5 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.1,995 కోట్ల నుంచి రూ.2,444 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో ఫారెక్స్ లాభాలు రూ.11 కోట్ల నుంచి రూ.29 కోట్లకు పెరిగాయని పేర్కొంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.2,407 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.518 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్థానికి గాను కంపెనీ రూ.4,640 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.940 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,360 ▼	72,750 ▼	1,03,000 ▲
ముంబై	77,382 ▲	70,882 ▲	91,130 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	100
విశాఖపట్నం	111	అనంతపురం	100
గోదావరి	115		

జీఎస్‌టీలో ఫారమ్ డీఆర్‌సీ-03ఏ అంటే..?



ఇదీ GST

రాంబాబు గొండాల

మహిమ ఇండస్ట్రీస్ తయారీ రంగంలో ఉన్న కంపెనీ. కొన్ని ఉల్లంఘనలకు సంబంధించి సదరు కంపెనీకి డిపార్ట్‌మెంట్ ఒక నోటీస్ ఇవ్వటం జరిగింది. దీని ఆధారంగా రూ.లక్షకు గాను ఆర్డర్ జారీ చేశారు. దీంతోపాటుగా వడ్డీ, పెనాల్టీ కట్టాల్సిందిగా అదే ఆర్డర్‌లో ఇవ్వటం జరిగింది. ఇప్పుడు మహిమ ఇండస్ట్రీస్ ముందు రెండు దారులు ఉన్నాయి. ఒకటి ఆర్డర్‌లో ఉన్న మొత్తం ప్రభుత్వానికి చెల్లించటం కాగా, రెండోది ఆ ఆర్డర్‌ను సవాల్ చేస్తూ అప్పీల్ దాఖలు చేయటం. అయితే, కంపెనీ ఆడిటర్ సలహా మేరకు అప్పీల్ చేయకుండా ఆర్డర్‌లో మొత్తాన్ని డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించింది. కొంతకాలం తర్వాత జీఎస్‌టీ పోర్టల్ (కామన్ పోర్టల్)లో చూస్తే ఇంకా రూ.లక్ష.. వడ్డీ, జరిమానాతో సహా బాకీ ఉన్నట్లుగా తన లయబిలిటీ లెడ్జర్‌లో కనబడింది. తాము చెల్లించాల్సిన మొత్తం చెల్లించిన తర్వాత కూడా ఇంకా బకాయి ఉండటం ఏమిటి?

ఇది అర్థం చేసుకోవటానికి ముందుగా అసలు డీఆర్‌సీ-03 అంటే ఏమిటి? దీన్ని ఎప్పుడు ఉపయోగించాలి? వివరాలు మీకోసం. ఒక పన్ను చెల్లింపుదారుడు, తాను చెల్లించాల్సిన పన్నును ఎప్పటికప్పుడు రిటర్న్ దాఖలు చేయటం ద్వారా చేయాలి. ఇది అందరికీ తెలిసిందే. అలాకాకుండా, తాను అప్పటి వరకు కట్టాల్సిన దాని కంటే తక్కువ కట్టినట్టు భావిస్తే ఆ తేడా మొత్తాన్ని డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి 18 శాతం పన్ను కట్టాల్సి ఉండగా అవగాహనా లోపంతో లేదా ఏదేనీ కారణంతో తక్కువ పన్ను అంటే 12 శాతమో, 5 శాతమో కట్టారనుకుందాం. ఈ తేడాను కొంతకాలం తర్వాత తమంతటతామో లేదా డిపార్ట్‌మెంట్ ఆడిట్ లేదా స్క్రూటినీ ద్వారా తెలిసినప్పుడు ఆ మొత్తాన్ని డీఆర్‌సీ-03 చెల్లించాలి. అంటే రిటర్న్‌లో చూపిన మొత్తాన్ని కాకుండా ప్రభుత్వానికి అదనంగా చెల్లించాల్సింది ఏమైనా ఉంటే ఆ మొత్తాన్ని డీఆర్‌సీ-03 ద్వారా కట్టాల్సి ఉంటుంది.

అయితే, నోటీస్ ఇచ్చి ఆర్డర్ ద్వారా డిమాండ్ చేసిన మొత్తం ఏమైనా ఉంటే డీఆర్‌సీ-03 ద్వారా కాకుండా కామన్ పోర్టల్‌లో సంబంధిత డిమాండ్ దగ్గర క్లిక్ చేసి అందులోని సూచనల మేరకు చెల్లించాలి. అప్పుడు మాత్రమే ఆ బకాయి మొత్తం చెల్లించినట్లుగా పరిగణించి సిస్టమ్ పెండింగ్ బకాయిని సున్నాగా చూపిస్తుంది. ఇక్కడ మహిమ ఇండస్ట్రీస్ చేసిన పొరపాటు ఏమిటంటే.. కామన్ పోర్టల్‌లో బకాయి సెక్షన్‌లోకి వెళ్లి చెల్లించే బదులుగా డీఆర్‌సీ-03 ద్వారా పన్ను చెల్లించారు. దీనివల్ల సిస్టమ్‌లో ఆ మేరకు సర్దుబాటు జరగలేదు. దీన్ని సరిదిద్దటానికి అధికారుల దగ్గర కూడా ఎలాంటి అవకాశం లేదు. ఈ ఇబ్బంది ఒక్క మహిమ ఇండస్ట్రీస్‌కు మాత్రమే కాదు. చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల డీఆర్‌సీ-03ఏ ఫారమ్ ప్రవేశపెట్టింది.

ఈ డీఆర్‌సీ-03ఏ అనేది ఇప్పటి వరకు తాము డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించిన మొత్తాన్ని పెండింగ్ బకాయితో సర్దుబాటు చేసుకోవటానికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా సర్దుబాటు చేయటానికి తొలుత కామన్ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యి వరుసగా 'సర్వీసెస్', 'యూజర్ సర్వీసెస్', 'మై అప్లికేషన్స్', ఫారమ్ జీఎస్‌టీ డీఆర్‌సీ-03ఏ క్లిక్ చేసి తాము ఏ డీఆర్‌సీ-03 ద్వారా పన్ను చెల్లించారో దాని వివరాలు.. సర్దుబాటు చేయాల్సిన వివరాలు, సర్దుబాటు చేయాల్సిన మొత్తం తదితర వివరాలు దాఖలు చేయటం ద్వారా ఇంతకుముందు డీఆర్‌సీ-03తో చెల్లించిన మొత్తాన్ని సర్దుబాటు చేయవచ్చు. అయితే ఇక్కడ కింది విషయాలు గుర్తు పెట్టుకోవాలి.

ఒక్క డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించిన మొత్తాన్ని ఒకటి కంటే ఎక్కువ ఆర్డర్స్‌కు లేదా ఒకటి కంటే ఎక్కువ డీఆర్‌సీ-03 లను ఒక్క ఆర్డర్‌కు వాడవచ్చు. అయితే ప్రతి డీఆర్‌సీ-03కి ఒక్కొక్క డీఆర్‌సీ-03ఏ వాడాలి. ఆర్డర్‌లోని బకాయి కోసం కాకుండా వేరే నిమిత్తం చెల్లించిన డీఆర్‌సీ-03లోని మొత్తాన్ని ఆర్డర్‌లోని బకాయి కోసం ఉపయోగించకూడదు. అంటే, ఉదాహరణకు ఆడిట్ జరిగే సమయంలో ఒక వ్యక్తి రూ.2 లక్షలు పన్ను తక్కువ కట్టినట్లుగా గుర్తించారనుకుందాం. ఆడిట్ జరిగే సమయంలోనే సదరు వ్యక్తి రూ.లక్ష డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించాడు. ఆ మొత్తాన్ని ఆర్డర్‌లో సర్దుబాటు చేసి మిగతా రూ.లక్షకు ఆర్డర్ ఇచ్చారనుకుందాం. ఇప్పుడు మొదట చెల్లించిన రూ.లక్షను బకాయి ఉన్న రూ.లక్షకు సర్దుబాటు చేయకూడదు. ఎందుకంటే రూ.లక్ష.. అధికారులే సర్దుబాటు చేసి ఆర్డర్ ఇచ్చారు కాబట్టి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

పంకజ్ @ 28

భారత స్టార్‌దే ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్



న్యూఢిల్లీ: ప్రపంచ టైటిళ్లను అలవోకగా నెగ్గడం అలవాటుగా మార్చుకున్న భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ ఖాతాలో మరో ట్రోఫీ. ఇప్పటికే అత్యధిక టైటిళ్లతో అందనంత ఎత్తులో నిలిచిన పంకజ్.. మరోసారి ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం దోహా వేదికగా జరిగిన ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్ ఫైనల్లో పంకజ్ 4-2తో ఇంగ్లండ్ ఆటగాడు రాబర్ట్ హాల్‌ను చిత్తుచేశాడు. బెంగళూరుకు చెందిన 39 ఏళ్ల పంకజ్‌కు ఇది రికార్డుస్థాయిలో 28వ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. కాగా, అతనికిది వరుసగా ఇది ఏడో టైటిల్. ఓవరాల్‌గా బిలియర్డ్స్‌లో 19వ సారి ప్రపంచ విజేతగా నిలిచిన పంకజ్.. మరో తొమ్మిది టైటిళ్లను ప్రపంచ స్నూకర్ విభాగంలో సాధించాడు.

హర్మన్, శ్రీజేష్‌కు ఎఫ్ఐహెచ్ స్టార్ అవార్డులు





లసాన్నె (స్విట్జర్లాండ్): భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) స్టార్ అవార్డులను గెలుచుకున్నారు. ఈ ఏడాదికిగాను ఉత్తమ ఆటగాడిగా హర్మన్‌ప్రీత్, ఉత్తమ గోల్‌కీపర్‌గా శ్రీజేష్ నిలిచారు. హర్మన్‌ప్రీత్, శ్రీజేష్.. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్య పతకం నెగ్గడంలో కీలకపాత్ర పోషించారు. ఆ విశ్వక్రీడల్లో హర్మన్ ఏకంగా పది గోల్స్ సాధించాడు. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన జట్టులోనూ సభ్యుడైన శ్రీజేష్.. పారిస్ క్రీడల తర్వాత హాకీకి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

దిగ్గజంతో జతకట్టిన నీరజ్



కొత్త కోచ్‌గా యాన్ జెలెస్నీ

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కొత్త కోచ్‌తో జత కట్టాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రికార్డు గ్రహీత అయిన 58 ఏళ్ల యాన్ జెలెస్నీ నీరజ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఇన్నాళ్లు నీరజ్‌తో పనిచేసిన క్లాస్ బర్తోనీజ్ (జర్మనీ) కుటుంబ కారణాల రీత్యా కోచ్ పదవి నుంచి ఇటీవలే వైదొలగిన సంగతి తెలిసిందే. క్లాస్ హయాంలోనే నీరజ్ ఒలింపిక్స్‌లో స్వర్ణం, రజతం, ప్రపంచ చాంపియన్‌షిప్‌తో పాటు అనేక టైటిళ్లు నెగ్గాడు. 1992, 1996, 2000 ఒలింపిక్స్‌లో స్వర్ణాలు గెలిచిన జెలెస్నీ.. 1993, 1995, 2001లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. అంతేకాదు.. ఈటెను 98.48 మీటర్ల దూరం విసిరి అప్పట్లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.

పాక్‌కు వెళ్లేది లేదు!

చాంపియన్స్ ట్రోఫీపై బీసీసీఐ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత జట్టు పాకిస్థాన్‌కు వెళ్లడం కుదరదని బీసీసీఐ తేల్చిచెప్పింది. ఈమేరకు తమ నిర్ణయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి తెలిపినట్టు ఈఎస్‌పీఎన్ వెబ్‌సైట్ వెల్లడించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు ఈ మెగా టోర్నీ పాక్‌లోని మూడు వేదికల్లో జరుగుతుంది. పాక్‌లో పర్యటించేందుకు భారత ప్రభుత్వం నుంచి తమకు అనుమతి లభించలేదని బోర్డు పేర్కొంది. దీంతో ఐసీసీ, పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిందే. దీని ప్రకారం హైబ్రీడ్ పద్ధతిన టీమిండియా ఆడే మ్యాచ్‌లను యూఏఈకి తరలించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు హైబ్రీడ్ పద్ధతికి తాము వ్యతిరేకమని శుక్రవారమే పీసీబీ చైర్మన్ మొహిసిన్ నక్వీ పేర్కొనడం గమనార్హం.

టాప్ లేపాల్సిందే..

టాపార్డర్ ఫామ్‌పై ఆందోళన

ఓపెనర్ శాంసన్‌పై అధిక భారం

మరో విజయంపై భారత్ దృష్టి

నేడు దక్షిణాఫ్రికాతో రెండో టీ20



రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో

గెబెహా: నాలుగు టీ20ల సిరీస్‌ను ఘనంగా ఆరంభించిన టీమిండియా మరో విజయపై దృష్టి సారించింది. శాంసన్ మెరుపు శతకానికి తోడు స్పిన్నర్ల మాయతో జట్టు తొలి టీ20లో 61 పరుగుల తేడాతో భారీ విజయాన్నందుకుంది. తాజాగా ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగే రెండో మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించాలనుకుంటోంది. అయితే గతేడాది ఇక్కడ జరిగిన ఏకైక టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో ఓడింది. ఇక జట్టు బ్యాటింగ్ ఆశించిన మేర ఆకట్టుకోలేకపోతోంది. శాంసన్ మినహా మరే బ్యాటర్ కూడా డర్బన్‌లో ప్రభావం చూపలేదు. తను మాత్రమే అలవోకగా భారీ సిక్సర్లతో పరుగుల వరద పారించాడు. ముఖ్యంగా టాపార్డర్‌లో నిలకడలేమిపై టీమ్ మేనేజ్‌మెంట్ ఆందోళనగా ఉంది. ఓపెనర్ అభిషేక్ శర్మ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక వరుసగా స్వల్ప స్కోర్లకే వెనుదిరుగుతున్నాడు. జింబాబ్వేపై శతకం తర్వాత వరుసగా ఏడు మ్యాచ్‌ల్లోనూ 20లోపే అవుటయ్యాడు. ఈనేపథ్యంలో నేటి మ్యాచ్ అతడికి అత్యంత కీలకం కానుంది. తిలక్ వేగంగానే ఆడుతున్నా భారీ స్కోర్లుగా మలచాల్సిన అవసరం ఉంది. కెప్టెన్ సూర్యకుమార్, హార్దిక్ కూడా త్వరగానే పెవిలియన్‌కు చేరారు. కాగితంపై బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగానే కనిపిస్తున్నా 36 పరుగుల వ్యవధిలోనే చివరి ఆరు వికెట్లను కోల్పోవడం.. మిడిల్, లోయరార్డర్ ఆటతీరును చాటిచెప్పినట్టయ్యింది. అందుకే నేటి మ్యాచ్‌లో ఈ బలహీనతను అధిగమించాలనుకుంటోంది.

రాణిస్తున్న బౌలర్లు: బ్యాటర్ల ఫామ్ ఎలా ఉన్నా ఇక్కడి పిచ్‌లపై పెద్దగా అనుభవం లేని బౌలర్లు మాత్రం అదరగొట్టారు. కేవలం 141 పరుగులకే ప్రత్యర్థిని కట్టడి చేయగలిగారు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బంగ్లాదేశ్‌పై చూపిన ఫామ్‌ను ఇక్కడా కొనసాగించాడు. బిష్ణోయ్ కూడా మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. పేసర్లు అర్ష్‌దీప్, అవేశ్ ఆరంభ, ముగింపులో ఇబ్బందిపెడుతున్నారు. అందుకే పటిష్ట బౌలింగ్ లైనప్‌తో రెండో మ్యాచ్‌ను కూడా భారత్ తమ ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది.

ఒత్తిడిలో సఫారీ: తొలి టీ20 పరాభవంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా నిరాశలో మునిగింది. టీ20 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత భారత్ చేతిలో ఆ జట్టుకిది వరుసగా రెండో ఓటమి. అయితే ప్రధాన ఆటగాళ్లు డికాక్, పేసర్లు రబాడ, నోకియా స్పిన్నర్ షంసీ లేకపోవడం జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపింది. విండీస్‌తో సిరీస్ ఓటమి, ఐర్లాండ్‌తో సిరీస్ సమం తర్వాత భారత్‌తో మ్యాచ్‌లు ఆ జట్టుకు సవాల్‌గా మారాయి. మరోవైపు బ్యాటింగ్‌లో ఏ బ్యాటర్ కూడా 25 పరుగులు దాటలేకపోయాడు. రెండో టీ20లోనైనా సీనియర్ బ్యాటర్లు క్లాసెన్, మిల్లర్, కెప్టెన్ మార్‌క్రమ్ తమ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించాలనుకుంటున్నారు. ఇక బౌలర్లు కూడా శాంసన్ ధాటిని అడ్డుకోలేకపోయినా డెత్ ఓవర్లలో మాత్రం ప్రభావం చూపారు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శాంసన్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, హార్దిక్, రింకూ సింగ్, అక్షర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, వరుణ్, అవేశ్.

దక్షిణాఫ్రికా: హెన్‌డ్రిక్స్, రికెల్టన్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్, కొట్జీ, పీటర్, బార్ట్‌మన్.

పిచ్, వాతావరణం

ఇక్కడి సెయింట్ జార్జి పిచ్ కూడా మ్యాచ్ జరిగే కొద్దీ స్పిన్‌కు అనుకూలించనుంది. ఆరంభంలో మాత్రం బ్యాటర్లకు సహాయకంగా ఉండనుంది. అందుకే టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. సగటు స్కోరు 135 మాత్రమే. సాయంత్రం చిరు జల్లులకు ఆస్కారముంది.

హిమతేజ అజేయ శతకం

రాజస్థాన్‌తో హైదరాబాద్ రంజీ డ్రా

జైపూర్: హైదరాబాద్-రాజస్థాన్ జట్ల మధ్య జరిగిన రంజీ పోరు డ్రాగా ముగిసింది. హైదరాబాద్ ఆటగాళ్లు మిడిలార్డర్ బ్యాటర్ హిమతేజ (101 నాటౌట్) శతకంతో, ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (79) అర్ధసెంచరీతో సత్తా చాటారు. నాలుగో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 36/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ ఆట ముగిసేసరికి 3 వికెట్లకు 273 పరుగులు చేసింది. ఓపెనర్లు తన్మయ్, అభిరథ్ రెడ్డి (46) తొలి వికెట్‌కు 56 పరుగులతో శుభారంభం ఇచ్చారు. తర్వాత హిమతేజ, తన్మయ్ నాలుగో వికెట్‌కు 139 పరుగులు జోడించి హైదరాబాద్‌ను పటిష్ట స్థితిలో నిలిపారు. ఆనక కెప్టెన్ రాహుల్ సింగ్ (47 నాటౌట్)-హిమతేజతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. చివరికి మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో అంపైర్లు డ్రాగా ప్రకటించారు. అయితే, తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యంతో రాజస్థాన్‌కు 3 పాయింట్లు, హైదరాబాద్‌కు ఒక పాయింట్ లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 410, రాజస్థాన్ 425 రన్స్‌కు ఆలౌటయ్యాయి.

ఆసీస్ 'ఎ' క్లీన్‌స్వీప్

భారత్ 'ఎ'కు మరో ఓటమి

జురెల్ పోరాటం వృథా



కోన్‌స్టాస్ (73 నాటౌట్)

మెల్‌బోర్న్: ధ్రువ్ జురెల్ (68) వరుసగా రెండో అర్ధసెంచరీతో రాణించినా.. భారత్ 'ఎ'కు ఓటమి తప్పలేదు. శనివారం ముగిసిన రెండో అనధికార టెస్టులో ఆస్ట్రేలియా 'ఎ' 4 వికెట్ల తేడాతో గెలిచింది. అలాగే సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 168 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు 47.5 ఓవర్లలో 169/4 స్కోరుతో నెగ్గింది. కోన్‌స్టాస్ (73 నాటౌట్), వెబ్‌స్టర్ (46 నాటౌట్) రాణించారు. అంతకుముందు భారత్ 'ఎ' 73/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా జురెల్ అద్భుత పోరాటం ప్రదర్శించాడు. నితీశ్ (38)తో కలిసి ఆరో వికెట్‌కు 94 పరుగులు సమకూర్చాడు. కోటియన్ (44), ప్రసిద్ధ్ (29) పర్వాలేదనిపించగా.. తమ రెండో ఇన్నింగ్స్‌ను 229 పరుగుల వద్ద ముగించింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 161, ఆసీస్ 223 రన్స్ చేశాయి.

సెమీస్‌లో కిరణ్‌కు నిరాశ

ఇక్సాన్ సిటీ (కొరియా): భారత యువ షట్లర్ కిరణ్ జార్జ్ కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు. శనివారం జరిగిన సెమీఫైనల్లో కిరణ్ 12-21, 20-22తో టాప్‌సీడ్, ప్రపంచ ఐదో ర్యాంకర్ కున్లావత్ వితిద్‌సార్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

రిత్విక్ జోడీ పోరు ముగిసె

న్యూఢిల్లీ: తెలుగు టెన్నిస్ ఆటగాడు రిత్విక్ చౌదరికి మోసెలె ఓపెన్‌లో నిరాశ ఎదురైంది. ఫ్రాన్స్‌లోని మెట్జ్ సిటీలో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో రిత్విక్-ఫ్రాన్సిస్కో కాబ్రెల్ (పోర్చుగల్) జోడీ 3-6, 6-7 (4-7)తో ఫ్రాన్స్ జంట అల్బానో ఒలివెట్టి-హర్‌బర్ట్ చేతిలో ఓటమి పాలైంది.

రెండో స్థానానికి టైటాన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా సీజన్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా నాలుగో విజయాన్ని ఖాతాలో వేసుకొని పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. సొంతగడ్డపై జరిగిన ఆఖరి మ్యాచ్‌లో టైటాన్స్ టేబుల్ టాపర్ పుణెరి పల్టాన్స్‌కు షాకిచ్చింది. శనివారం ఇక్కడ జరిగిన ఈ పోరులో టైటాన్స్ 34-33తో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టాన్స్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 40-29తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. ఇక, ఈ సీజన్ రెండో అంచె పోటీలు ఆదివారం నుంచి నోయిడాలో జరగనున్నాయి.

అర్జున్, హారిక గేమ్‌లు డ్రా

చెన్నై: తెలుగు జీఎం ఇరిగేసి అర్జున్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో రెండో డ్రాను నమోదు చేశాడు. శనివారం జరిగిన ఐదో రౌండ్‌లో పర్హామ్ మగ్సూద్లు (ఇరాన్)తో తలపడిన అర్జున్ 44వ ఎత్తు తర్వాత డ్రాకు అంగీకరించాడు. ప్రస్తుతం అర్జున్ 4 పాయింట్లతో టాప్‌లో నిలవగా, లెవాన్ 3.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక, చెన్నై గ్రాండ్‌మాస్టర్ చాలెంజర్స్ ఐదో రౌండ్‌లో వైశాలితో గేమ్‌ను ద్రోణవల్లి హారిక డ్రాగా ముగించింది. టోర్నీలో ప్రణవ్ (4.5 పాయింట్లు) టాప్‌లో ఉండగా, హారిక (1) ఆఖరి స్థానంలో నిలిచింది.


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

డిసెంబరులో రూ.13 వేల కోట్ల రుణమాఫీ

» మిగిలిన రైతులందరికీ వర్తింపజేస్తాం: పొంగులేటి

కూసుమంచి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): 'రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన 27 రోజుల్లోనే రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశాం. మిగిలిన అర్హత గల రైతులందరికీ రూ.13 వేల కోట్ల మేర డిసెంబరు చివరికల్లా రుణమాఫీ చేసి చూపిస్తాం" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. శనివారం ఖమ్మం జిల్లా కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాదాపు 57వేల మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలను నిర్వహించామన్నారు. రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్ని పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొరు. కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇస్తామన్న హామీని సైతం త్వరలోనే అమలు చేస్తామని ఆయన చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి..

» అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు



హైదరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరికోతలు ఊపందుకున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, అందుకు తగ్గట్టు కింది స్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటైన అన్ని కొనుగోలు కేంద్రాల దగ్గర సౌకర్యాలు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వీలుగా గోదాములను గుర్తించాలన్నారు. ఈ విషయంలో మార్కెటింగ్, గోదాముల విభాగం అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలో ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంతో పాటు, తాలు, చెత్త తీయడానికి ప్యాడీ క్లీనర్లు, ఫ్యాన్లను ఏర్పాటు చేయాలన్నారు.

సమ్మక్కసాగర్‌కు ఎన్‌వోసీ పొందండి

» మూసీ గరిష్ఠ వరదపై పునఃపరిశీలన: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,నవంబరు9(ఆంధ్రజ్యోతి): సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం పొందడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమ్మక్కసాగర్‌లో ముంపు ప్రభావిత ఛత్తీస్‌గఢ్ రైతులకు పరిహారంపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించి, సమస్యను పరిష్కరించాలని సూచించారు. మూసీ గరిష్ఠ వరదపై హైడ్రాలజీ నివేదికను ఐఐటీ-హైదరాబాద్ నిపుణులతో పునఃపరిశీలన చేయిస్తున్నామని అధికారులు గుర్తు చేశారు. కాగా, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నార్లాపూర్ నుంచి ఏదుల దాకా ప్రధాన కాలువ సవరణ అంచనాలను ఆమోదించాలని మంత్రి నిర్దేశించారు. ప్రాజెక్టుల్లో పూడికతీతను ప్రయోగాత్మకంగా కడెం ప్రాజెక్టులో చేపట్టాలని నిర్ణయం తీసుకున్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మొడికుంటవాగు సవరణ అంచనాలను ఆమోదించారా అని మంత్రి అడగ్గా ఇటీవలే స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీలో ఆమోదించి, అనుమతుల కోసం ప్రభుత్వానికి ఫైలు పంపించనున్నట్లు అధికారులు గుర్తు చేశారు.

తెలంగాణ ప్రవాసులకు ప్రత్యేక విధానం: దుద్దిళ్ల

హైదరాబాద్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ ప్రవాసుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానం తెస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. కౌలాలంపూర్‌లో శనివారం జరిగిన మలేషియా తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదేళ్లు పూర్తి చేసుకున్న మలేషియన్ తెలంగాణ అసోసియేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. ప్రవాసులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

బీసీ గురుకులాలకు 429 కోట్ల ఆర్థిక సాయం

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ గురుకులాల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణకు ప్రభుత్వం రూ.429 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధుల పరిపాలనాపరమైన అనుమతలకు సంబంధించి శనివారం రెండు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. జీవో నెంబర్ 175లో రూ.294.56కోట్లు, 176లో రూ.135.09కోట్లు కలిపి మొత్తం రూ.429.66 కోట్లను మంజూరు చేసింది.


సమావేశంలో పాల్గొన్న తెలంగాణ సర్పంచుల ఫోరం ప్రతినిధులు

సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

» తెలంగాణ సర్పంచుల ఫోరం

పంజాగుట్ట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సర్పంచులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ సర్పంచుల ఫోరం డిమాండ్ చేసింది. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచులు అప్పులు చేసి మరీ ఖర్చు పెట్టారని ఫోరం అధ్యక్షుడు జి. లక్ష్మీ నరసింహ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పి.ప్రణీల్ చందర్, ఉపాధ్యక్షుడు జి.బలవంత్ రెడ్డి, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. బిల్లులు అందక, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల కోసం చేసిన అప్పులు తీర్చలేక పలువురు సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వంలో స్పందన లేదని ఆయన ఆరోపించారు. తమ పదవీ కాలం ముగిసి పది నెలలవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వం తమకు పెండింగ్ బకాయిలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లు అందక ఆత్మహత్య చేసుకున్న, విధి నిర్వహణలో మృతి చెందిన సర్పంచుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ఈ నెల చివరి లోగా నెరవేర్చాలని, లేకపోతే ఇందిరా పార్కు వద్ద నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు.

12న సాహితీ పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 2022 సంవత్సరానికి సాహితీ పురస్కారాలను ప్రకటించింది. ఈ నెల 12న నాంపల్లి తెలుగు వర్సిటీ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాలను అందజేస్తామని వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రెడ్డి శ్యామల తెలిపారు. పద్యకవితా ప్రక్రియలో పెండ్యాల కిషన్ శర్మ, వచన కవితా ప్రక్రియలో మెర్సీ మార్గరెట్, బాల సాహిత్యంలో ఎన్నవెళ్లి రాజమౌళి, కథానిక ప్రక్రియలో కొట్టం రామకృష్ణారెడ్డి, నవలా ప్రక్రియలో తాళ్లపల్లి యాకమ్మ, సాహిత్య విమర్శలో వెలుదండ నిత్యానందరావు, నాటక ప్రక్రియలో పీఏ దేవి, అనువాదంలో గురుమూర్తి గుబిలి, వచన రచన విభాగంలో సయ్యద్ నశీర్ అహ్మద్, రచయిత్రి ఉత్తమ గ్రంథం విభాగంలో డాక్టర్ చాగంటి తులసిలకు పురస్కారాలను అందిస్తున్నామని, ఒక్కొక్కరికీ రూ.20,116 అందజేసి సత్కరిస్తామని తెలిపారు.

మోదీ అబద్ధాల ప్రచారం!

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో దీన్ని తిప్పికొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుక్కు రంగంలోకి దిగారు. ముగ్గురూ ముంబైలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలనూ క్రమ పద్ధతిలో అమలు చేస్తూ వస్తున్నామని, ఆ వివరాలను మహారాష్ట్ర ప్రజల ముందు ఉంచడం తన బాధ్యతగా భావించి ఇక్కడికి వచ్చానని చెప్పారు. "కులగణనను రాహుల్‌గాంధీ ఎక్స్‌రేతో పోల్చారు. ఆ ఎక్స్‌రేను నేను మెగా ఫ్యామిలీ హెల్త్ చెకప్ వరకూ విస్తరించాలని అనుకుంటున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శుక్రవారం మొదలు పెట్టిన కులగణనను నెల రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. 4 కోట్ల మంది ప్రజల సమగ్ర వివరాలను సేకరించి, ఇదే రీతిన కులగణన చేపట్టాలని ప్రధాని మోదీకి సవాల్ చేస్తామన్నారు. 2025 జనవరి నుంచి దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణన కార్యక్రమంలో కులగణననూ చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానం కూడా చేశామన్నారు.

అంబానీ, అదానీలకు రైతుల్ని అప్పగించే కుట్ర

గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేసింది ఏమీ లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. పంటలకు మద్దతు ధర ఇవ్వకపోగా నల్ల చట్టాలు తీసుకువచ్చి అమెజాన్, అంబానీ, అదానీలకు రైతుల భవిష్యత్తును అప్పగించే కుట్రకు మోదీ పాల్పడ్డారని ముఖ్యమంత్రి ఆరోపించారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం హామీలిచ్చే అలవాటు సోనియాగాంధీ కుటుంబానికి లేదని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం ఇచ్చిన హామీని ఎట్టి పరిస్థితుల్లో అమలు చేసి తీరుతుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా, 25 రోజుల వ్యవధిలో 22,22,067 మంది రైతులకు రూ.17,869 కోట్ల రుణం మాఫీ చేశామని వెల్లడించారు. దీనికి సంబంధించి ఎవరికైనా వివరాలు కావాలంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. తెలంగాణ రుణమాఫీకి సంబంధించి ట్విటర్ వేదికగా ప్రధాని మోదీ చేసిన విమర్శలకు పూర్తి వివరాలతో తాను సమాధానం ఇచ్చానన్నారు. దాంతో ఆ విమర్శలను మోదీ తొలగించాల్సి వచ్చిందని చెప్పారు. గత పదేళ్లుగా బీజేపీతో దోస్తీ చేస్తున్న బీఆర్ఎస్ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. దీనికి సంబంధించి బీజేపీ గానీ, ఏక్‌నాథ్‌షిండే గానీ, అజిత్ పవార్‌లు గానీ తెలంగాణకు వస్తే పూర్తి వివరాలను అందజేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మహాలక్ష్మీ పథకం ద్వారా 49 లక్షల కుటుంబాలకు రూ.500లకే గ్యాస్ సిలెండర్ అందిస్తున్నామని, 50 లక్షల కుటుంబాలు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ద్వారా లబ్ధి పొందుతున్నాయని వివరించారు. వరికి మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. గత పది నెలల్లో 1.04 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, ఇందుకుగాను ఆర్టీసీకి రూ.3,541 కోట్లు చెల్లించామని వివరించారు.

వీరుల గడ్డలో గుజరాత్‌కు గులాములా?

మహారాష్ట్ర అంటే ఛత్రపతి శివాజీ, జ్యోతిబా పూలే, అంబేద్కర్, ఠాకరే, శరద్ పవార్ గుర్తుకు వస్తారని, ఎందరో వీరులకు జన్మనిచ్చిన ఈ గడ్డలో గుజరాత్‌కు గులాములు అయిపోయిన ఏకనాథ్ షిండే, అజిత్ పవార్‌లు ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్రకు రావాల్సిన 17 మెగా పెట్టుబడులను ప్రధాని మోదీ గుజరాత్‌కు తరలించుకు పోయారని ఆరోపించారు. మహారాష్ట్ర ప్రజలు సత్తా చూపించాలని, రాష్ట్రాన్ని మోసం చేసిన బీజేపీని మట్టి కరిపించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి నేతలు కర్ణాటకకు వచ్చి ఐదు గ్యారెంటీలు ఎలా అమలు అవుతున్నాయో చూసుకోవచ్చని చెప్పారు. గ్యారెంటీలకు ముందు కర్ణాటక జీడీపీ 8.2 కాగా ప్రస్తుతం 10.2కు పెరిగిందని, ఇవి కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన గణాంకాలేనని వివరించారు. గ్యారెంటీలపై బీజేపీ తప్పుడు ప్రకటనలపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. గ్యారెంటీలకు ఏటా రూ.52 వేల కోట్లు ఖర్చు అంచనా వేశామని, అదనంగా రూ.4 వేల కోట్లు అవుతోందని వివరించారు. ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ ప్రస్తావించారు.



చంచల్‌గూడ పర్యటనకు సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం చంచల్‌గూడలోని జైళ్ల శాఖకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సీఎం పర్యటనకు దాదాపు షెడ్యూల్ ఖరారైనట్లు తెలిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న వార్డన్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరిస్తారు. జైలు ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును ప్రారంభిస్తారు. జైల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డి అడిక్షన్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. కాగా, మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. జ్యోతి మరణం పట్ల స్పీకర్ ప్రసాద్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కు గౌడ్ సంతాపం తెలిపారు.

14 నుంచి 'ప్రజా విజయోత్సవాలు': భట్టి



హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నందున.. ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు 26 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా విజయోత్సవాల'ను నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా, ప్రభుత్వ విజన్‌ను తెలియజేసేలా 'ప్రజా విజయోత్సవాల'ను రూపొందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, దాదాపు రూ.18 వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేయడంతో పాటు మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందజేశామని పేర్కొన్నారు. మూతపడిన ములుగు జిల్లాలోని కమలాపూర్ రేయాన్స్ పరిశ్రమను రూ.4 వేల కోట్లతో పునరుద్ధరించబోతున్నామన్నారు. నెహ్రూ జయంతి రోజున ప్రారంభమయ్యే ఈ 'ప్రజా విజయోత్సవాల' సందర్భంగా రాష్ట్రంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. చివరి రోజైన డిసెంబరు 9న హైదరాబాద్‌లో వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు, లేజర్ షోలు, క్రాకర్స్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉత్సవాల మధ్య కాలంలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కాగా, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి శనివారం భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. ధరణి సమస్యలు, ప్రతిపాదన దశలో ఉన్న కొత్త రెవెన్యూ రికవరీ చట్టం గురించి కోదండరెడ్డి వివరించారు.

వచ్చే ఏడాది 27 సాధారణ సెలవులు

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి 1 నుంచి ప్రారంభం కానున్న 2025 సంవత్సరంలో సాధారణ సెలవులు(జనరల్ హాలిడేస్), ఐచ్ఛిక సెలవుల(ఆప్షనల్ హాలిడేస్)ను ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 27 సాధారణ సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులు ఉంటాయని తెలిపింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. సాధారణ సెలవు దినాల్లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూసి ఉంటాయని ప్రకటించింది. ఆదివారం, రెండో శనివారం కూడా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలని తెలిపింది. అయితే... ఫిబ్రవరి 8న వచ్చే రెండో శనివారం మాత్రం పని దినం(వర్కింగ్ డే)గా ప్రకటించింది. దానికి బదులుగా జనవరి 1న(బుధవారం) ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సాధారణ సెలవు ఉంటుందని వెల్లడించింది. 23 ఐచ్ఛిక సెలవుల్లో ఉద్యోగులు ఏవైనా ఐదింటిని వినియోగించుకోవచ్చని తెలిపింది. ఈ సెలవు దినాలు పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజా పనుల విభాగంలో పని చేసే కార్మికులకు వర్తించబోవని తెలిపింది. ముస్లింలు జరుపుకొనే పర్వదినాల తేదీల్లో చంద్రుడు దర్శనమిచ్చే దానినిబట్టి మార్పులు ఉంటాయని తెలిపింది.

సాధారణ సెలవులు

ఆంగ్ల కొత్త సంవత్సరం	జనవరి 1	బుధవారం
భోగి	జనవరి 13	సోమవారం
సంక్రాంతి/పొంగల్	జనవరి 14	మంగళవారం
గణతంత్ర దినోత్సవం	జనవరి 26	ఆదివారం
మహా శివరాత్రి	ఫిబ్రవరి 26	బుధవారం
హోలి	మార్చి 14	శుక్రవారం
ఉగాది	మార్చి 30	ఆదివారం
రంజాన్	మార్చి 31	సోమవారం
రంజాన్ తర్వాతి దినం	ఏప్రిల్ 1	మంగళవారం
జగ్జీవన్‌రామ్ జయంతి	ఏప్రిల్ 5	శనివారం
శ్రీరామ నవమి	ఏప్రిల్ 6	ఆదివారం
అంబేద్కర్ జయంతి	ఏప్రిల్ 14	సోమవారం
గుడ్ ఫ్రైడే	ఏప్రిల్ 18	శుక్రవారం
బక్రీద్	జూన్ 7	శనివారం
మొహరం	జూలై 6	ఆదివారం
బోనాలు	జూలై 21	సోమవారం
స్వాతంత్ర్య దినోత్సవం	ఆగస్టు 15	శుక్రవారం
శ్రీ కృష్ణాష్టమి	ఆగస్టు 16	శనివారం
వినాయక చవితి	ఆగస్టు 27	బుధవారం
మిలాద్ ఉన్ నబి	సెప్టెంబరు 5	శుక్రవారం
బతుకమ్మ ప్రారంభం	సెప్టెంబరు 21	ఆదివారం
గాంధీ జయంతి/దసరా	అక్టోబరు 2	గురువారం
దసరా తర్వాతి రోజు	అక్టోబరు 3	శుక్రవారం
దీపావళి	అక్టోబరు 20	సోమవారం
గురునానక్ జయంతి	నవంబరు 5	బుధవారం
క్రిస్మస్	డిసెంబరు 25	గురువారం
క్రిస్మస్ తర్వాతి రోజు	డిసెంబరు 26	శుక్రవారం

మూసీ కంపు కంటే రేవంత్ నోటి కంపే ఎక్కువ

» నేతల మాటలకు సెన్సార్ ఉండాలి

» కేసీఆర్‌ను మూడుముక్కలు చేస్తారా?

» మంత్రి కోమటిరెడ్డిపై హరీశ్ రావు ఫైర్



మెదక్/నర్సాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): "మూసీ మురికి కంటే రేవంత్ నోటి కంపే ఎక్కువగా ఉంది. సినిమాలకు సెన్సార్ బోర్డు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చినట్లు.. సీఎం రేవంత్ బూతులు వింటుంటే రాజకీయాల్లో కూడా నేతల ప్రసంగాలకు సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంత్రి హోదాలో ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా మాజీ సీఎం కేసీఆర్‌ను చంపి మూడు ముక్కలు చేసి, మూసీలో వేస్తామని అనడం దారుణం. పోలీసులు ఈ వ్యాఖ్యలను ఎలాగూ పట్టించుకోరు.. కనీసం గవర్నర్ అయినా పట్టించుకుని మంత్రిని బర్తరఫ్ చేయాలి" అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. శనివారం మెదక్ జిల్లా కొల్చారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్షలో, అంతకు ముందు విలేకరులతో హరీశ్ రావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతుపక్షపాతిగా పేరుగడిస్తే, రేవంత్‌రెడ్డి బూతుల సీఎంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా విజయోత్సవాలు జరపాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునివ్వడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతుబంధు ఎగ్గొట్టినందుకు విజయోత్సవాలా? మహిళలకు రూ.2500 ఇవ్వనందుకా.. ఒక్క ఇల్లు కూడా ఇవ్వకుండా ఉన్న ఇళ్లు కూల్చినందుకా? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు తెలంగాణాలో ఆరు హామీలు అమలు చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని, తాను హైదరాబాద్‌లో కలిసి పాదయాత్ర చేయడానికి సిద్ధమని చెప్పారు.

సిక్కోలు వాసి అరుదైన రికార్డు

» ఆన్‌లైన్‌లో 2,500 కోర్సులు పూర్తి

» 51 ఏళ్ల వయసులో ఘనత

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సిక్కోలు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అరుదైన ఘనత సాధించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగించేందుకు భారత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఉచిత కోర్సు ప్రవేశపెట్టగా.. శ్రీకాకుళం నగరానికి చెందిన ఎంవీఎస్ఎస్ శాస్త్రి తన కుమార్తెకు బోధించేందుకు ఆ కోర్సు చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. అలా 2022 అక్టోబరులో ప్రారంభించిన ఆన్‌లైన్ కోర్సుల విద్యాభ్యాస్యాన్ని ఆయన తన అలవాటుగా మార్చుకున్నారు. రెండేళ్లలో ఏకంగా 2,500 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారు. 51 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా అరుదైన రికార్డు సాధించారు. చదువుకు వయసు అడ్డుకాదని శాస్త్రి నిరూపించారు. శనివారం శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో శాస్త్రిని వివిధ సంఘాల నాయకులు, విద్యావంతులు సన్మానించారు.

రౌడీ పంచాయితీలు మాకూ తెలుసు

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత పరపాటి శ్రీనివాస్‌రెడ్డి, సినీ ఆర్టిస్ట్ రవితేజ తదితరులు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఈ 11 నెలల్లో ఏం కోల్పోయారో పరజలకు అర్థమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చింది కూల్చడానికి కాదని, నిర్మించడానికని అన్నారు. ప్రభుత్వం అంటే.. అందరినీ కాపాడుకోవాలని, పిచ్చిపిచ్చిగా మాట్లాడడం కాదన్నారు. సమాజాన్ని నిలబెట్టి, నిర్మించాలని హితవుపలికారు. "రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో 100% మనమే అధికారంలోకి రాబోతున్నాం. అందులో ఎలాంటి అనుమానం లేదు. ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమైంది. ప్రజలు మనపై విశ్వాసంతో ఉన్నారు. మనమంతా కష్టపడి పనిచేయాలి" అని సూచించారు. అధికారంలోకి రాగానే వాడిని లోపలేయాలి.. వీడిని లోపలేయాలని చూడబోమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఎలా మాట్లాడుతున్నారో అంతా స్వయంగా చూస్తున్నారని అన్నారు. ప్రజలు అధికారమిచ్చింది సేవ చేయడానికా? లేనిపోని మాటలతో కాలయాపన చేయడానికా అని కాంగ్రెస్ సర్కారును ప్రశ్నించారు. "గత ఎన్నికల్లో మన మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు 10 శాతమే. కానీ, ఎవరూ అడగకున్నా 90% పనులు చేసి, చూపించాం. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కార్యకర్తలు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. కాగా, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ బీఆర్ఎస్ నేతలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మూసీని వ్యతిరేకిస్తే కేసీఆర్‌ను ఖండఖండాలుగా నరికి మూసీలో వేస్తామంటూ వ్యాఖ్యలు చేశారని.. ఇది శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉందని శనివారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బాల్కసుమన్, దాసోజు శ్రవణ్ తదితరులున్నారు.


పాలకుర్తి నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

కేసీఆర్ పేరు చెరపలేరు: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం ఉద్యమం చేసి, సాధించిన రాష్ట్రాన్ని సగర్వంగా తలెత్తుకునేలా చేసిన కేసీఆర్.. ఈ రాష్ట్రానికి గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన మీద పిచ్చి ప్రచారాలు చేస్తూ, దుర్భాషలాడి.. చరిత్ర నుంచి కేసీఆర్ పేరు చెరిపేయవచ్చని అనుకోవటం మూర్ఖత్వమే అవుతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ పేరును ఎవరూ చెరిపేయలేరని, తెలంగాణ ఉన్నంత కాలం ఆయన పేరు ఉంటుందని అన్నారు. దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడత ఆర్థిక సాయం చేయాలని అడిగితే.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేస్తారా..? అని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డిపై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హుజూరాబాద్‌లో ఉద్రిక్తత

» దళితబంధు కోసం లబ్ధిదారుల ధర్నా

» కౌశిక్‌రెడ్డి, పోలీసుల మధ్య తోపులాట

» ఎమ్మెల్యేకు అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు


కరీంనగర్ అపోలో రీచ్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని శనివారం దళితులు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారి తీసింది. దళిత బంధు రెండో విడత డబ్బులు రాని వారు తమ ఇంటికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం పిలుపునిచ్చారు. దీంతో లబ్ధిదారులు శనివారం ఎమ్మెల్యే ఇంటికి పెద్దఎత్తున తరలివచ్చారు. హుజూరాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద తాము చేపట్టే ధర్నాలో పాల్గొనాలని లబ్ధిదారులు కౌశిక్‌రెడ్డిని కోరారు. దీంతో అందరూ కలిసి ర్యాలీగా చౌరస్తాకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. పోలీసులు ఎమ్మెల్యేను అడ్డుకోవడంతో తీవ్రవాగ్వాదం జరిగింది. కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు యత్నించగా లబ్ధిదారులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎమ్మెల్యేను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో కౌశిక్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కౌశిక్‌రెడ్డిని విడుదల చేయాలని దళితబంధు లబ్ధిదారులు గంట పాటు రాస్తారోకో చేశారు. దీంతో కరీంనగర్-హనుమకొండ ప్రధాన రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దళిత బంధు రెండో విడత నిధులు లబ్ధిదారులకు ఇచ్చే దాకా పోరాటం చేస్తామని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే హుజూరాబాద్‌లోని దళితుల కాలనీల్లో పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు రెండో విడత డబ్బులు ఇవ్వాలని ధర్నా చేస్తే పోలీసులు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, లబ్ధిదారులపై దాడి చేస్తారా..? అని గంగుల కమలాకర్ ప్రశ్నించారు.

రైతులపై రేవంత్ చిన్నచూపు

(మొదటిపేజీ తరువాయి)

శనివారం కిషన్‌రెడ్డి పరిశీలించారు. రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బోటు షికారు చేసిన సీఎంకు.. రైతుల కష్టాలు చూసే తీరిక లేదా? అని ప్రశ్నించారు. పంటకు గిట్టుబాటు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన రేవంత్.. ఇప్పుడు సన్న ధాన్యానికి మాత్రమే ఇస్తామంటూ మాట తప్పారని మండిపడ్డారు. రైతు డిక్లరేషన్ పేరుతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీ భరోసా, రైతుబంధు లాంటి అనేక వాగ్దానాలను విస్మరించారని అన్నారు. మూసీప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, రేవంత్ విధానాలకు మాత్రమే వ్యతిరేకమన్నారు. పేదల ఇళ్లకూల్చడం తగదని కిషన్‌రెడ్డి అన్నారు.


రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే: సంజయ్

నక్సలైట్ భావజాలమున్న వారికి విద్యా కమిషన్‌లో చోటు కల్పించడం సిగ్గు చేటని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. వెంటనే కమిషన్‌ను రద్దు చేసి, కొత్తది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లో ఆయన కార్యకర్తలతో కలిసి జితేందర్‌రెడ్డి సినిమాను వీక్షించారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన జితేందర్‌రెడ్డి చరిత్రను సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపారని అన్నారు. రేవంత్‌రెడ్డి మహారాష్ట్రకు వెళ్లి అన్నీ అబద్ధాలే చెబుతున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలపై తెలంగాణలో తిరిగి చెప్పే దమ్ముందా..? అని ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఫాంహౌస్ నుంచి రాని కేసీఆర్.. కేటీఆర్ బావమరిది రేవ్ పార్టీలో దొరికితే మాత్రం డీజీపీకి ఫోన్ చేశారని సంజయ్ విమర్శించారు.

ఫ్యాటీ లివర్.. నేటి కిల్లర్

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతూపోయాక అదే కాలేయం 'పని చేయడం ఇక నావల్ల కాదు' అని చేతులెత్తేస్తుంది! అంటే.. లివర్ పూర్తిగా చెడిపోయాక గానీ ఆ తాలూకు లక్షణాలు బయటపడవు. ఇప్పుడీ ముప్పు ప్రతి 100 మందిలో 30-40 మందికి పొంచి ఉందనేది జీర్ణించుకోలేని వాస్తవం! మితిమీరిన మద్యం అలవాటు ఫ్యాటీ లివర్‌కు దారితీస్తుందని చాలామందికి తెలుసు! అయితే.. ఆహారపు అలవాట్లలో తేడాలు, జీవనశైలిలో మార్పులు, శారీరక వ్యాయామం లేకపోవడమూ ఫ్యాటీ లివర్‌కు దారితీస్తుంది. ఇది మరింత ప్రమాదకరం! ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్, నాన్ ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ ఏదైతేనేమీ శరీరంలోని ప్రధాన అవయవాలను పని చేయించే కాలేయానికి కొవ్వు పడుతోంది. అది స్టేజ్ 1, 2, 3, 4గా పెరిగిపోయి చివరికి లివర్ సిరోసిస్‌కు దారితీస్తోంది. నాన్ ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ ప్రధానంగా ఊబకాయులు, మధుమేహంతో బాధపడుతున్నవారు, రక్తంలో అధిక కొవ్వు ఉన్నవారికి వస్తుంది. నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ తరచుగా మెటబాలిక్ సిండ్రోమ్‌తో సంబంధం కలిగి ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ సిండ్రోమ్‌తో బాధపడే వారిలో 80 శాతం మందికి ఫ్యాటీ లివర్ సమస్య వస్తుందని అంటున్నారు.



రానున్న రెండు మూడేళ్లల్లో ఇతర జబ్బుల కంటే ఫ్యాటీ లివర్ ప్రధాన అనారోగ్య సమస్యగా మారబోతోందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మనదేశంలోనే 30-40 కోట్ల మంది ఫ్యాటీ లివర్ బాధితులున్నారు. అయితే ఈ సమస్య ఇంతలా పెరగడానికి ప్రధానంగా పీఎన్‌పీఎల్‌పీ 3 అనే జన్యువు కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫ్యాటీ లివర్ అనేది సైలెంట్ కిల్లర్‌గా మారి, (అసంక్రమిత వ్యాధులు) ఎన్‌సీడీ వ్యాధులను మించిపోతుందని అంటున్నారు. కాగా, పీఎన్‌పీఎల్‌పీ 3 జన్యువు అనేది మన శరీరంలో అడిపోన్యూట్రిన్ అనే ప్రొటీన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది కొవ్వులో, కాలేయ కణాల్లో ఉంటుంది. కొవ్వు ఉత్పత్తి, విచ్ఛిన్నతను నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. అలాగే మనం ఏం తినకుండా ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు దీని ఉత్పత్తి తగ్గుతుందని.. తిన్న తర్వాత పెరుగుతుందని అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. ఆహారంలోని కొవ్వులను ప్రాసెస్ చేయడం, నిల్వ చేయడంలో సాయపడటానికి, నియంత్రించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ జన్యువుకు హెపాటోసెల్లర్ కార్సినోమా, స్టీటోసిస్, ఫైబ్రోసిస్ వంటి కాలేయ వ్యాధులతో సంబంధం ఉంటుంది. ఈ జన్యువు పనితీరును కోల్పోతే హైపటోసైట్(కాలేయ కణాల)లో ట్రైగ్లిజరైడ్ చేరడాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది ఫ్యాటీ లివర్‌కు దారి తీస్తుంది.

మద్యం సంబంధిత లివర్ డ్యామేజ్ కేసులు పెరుగుతున్నాయి



మన దగ్గర గడిచిన పదేళ్లలో ఆల్కహాల్ సంబంధిత కాలేయ సమస్యల కేసుల సంఖ్య భారీగా పెరిగాయి. ఆస్పత్రుల్లో 50 శాతం కాలేయ సమస్యలు కేవలం ఆల్కహాల్ సంబంధించినవే ఉంటున్నాయి. దీంతో లివర్‌సిరోసిస్ పెరుగుతోంది. చాలామంది ఫ్యాటీ లీవర్‌ను చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు. పట్టించుకోవడం లేదు. తెలుసుకునేసరికి జరగాల్సిన నష్టం జరుగుతోంది. ఊబకాయం, మధుమేహం సమస్యలున్నవారిలో 90 శాతం మందికి ఫ్యాటీ లీవర్ ఉంటుంది. ఫ్యాటీ లివర్‌కు దేశం రాజధానిగా మారిపోయింది. దీనిపై ఇటీవలే నేషనల్ హెల్త్ టాస్క్‌ఫోర్స్‌కు కూడా లేఖ రాశాం. అందులో ఫ్యాటీలివర్ ఒక అంటువ్యాధిలా మారిందని, దానిపై తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని కోరాం. ప్రస్తుతం జీవనశైలి వల్ల కూడా త్వరగా లీవర్ డ్యామేజ్ అవుతోంది.

- డాక్టర్ నాగేశ్వర రెడ్డి,
చైర్మన్ ఏఐజీ ఆస్పత్రి, హైదరాబాద్

ఫ్యాటీ లివర్ కేసుల తీవ్రత పెరుగుతోంది

రాబోయే రెండు మూడేళ్లలో ఫ్యాటీలివర్ అనేది ప్రధాన అనారోగ్య సమస్యగా మారబోతోంది. ఇతర వ్యాధుల కంటే దీని తీవ్రత పెరగబోతోంది. రక్త పరీక్షలతో పాటు అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లో ఇది బయటపడుతుంది. ఉదర భాగంలో కుడివైపు నొప్పి కలిగితే లీవర్ సమస్య ఉన్నట్లు భావించాలి. దీన్ని నివారించాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలి.గుండె జబ్బులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటామో అలాంటి కేర్‌నే దీని విషయంలోనూ పాటించాలి. శరీర బరువు ఐదు నుంచి పది శాతం వరకు తగ్గాలి. ప్రోటీన్లు, తృణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు వంటి సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి విదేశాల్లో మద్యం మానేసి, లీవర్ జబ్బుల బారినపడకుండా ఉంటే..మనదగ్గర మాత్రం దానివల్ల ఎక్కువ మంది కాలేయ సంబంధిత సమస్యలతో వస్తున్నారు.

- డాక్టర్ బూరుగుమళ్ల సుకన్య,
హెచ్‌వోడీ గ్యాస్ట్రోఎంట్రాలజీ, నిమ్స్ ఆస్పత్రి.

72 కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి

- దక్షిణాది రాష్ట్రాలకు 17.. తెలంగాణకు 8 కాలేజీలు మంజూరు.. వివరాలు వెల్లడించిన ఎన్ఎంసీ

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి కొత్తగా 72 నూతన వైద్య కళాశాలలకు అనుమతులు మంజూరు చేసినట్లు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) వెల్లడించింది. కొత్తగా అనుమతులు పొందిన కాలేజీలు, సీట్లు అప్‌గ్రేడేషన్ అయిన కాలేజీలు, సీట్ల వివరాలను ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో ఉంచింది. 72 కొత్త కాలేజీల్లో 6850 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతులివ్వగా మరో 30 కాలేజీల్లో అదనంగా 1872 సీట్ల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తంగా ఈ విద్యా సంవత్సరంలో అదనంగా 8722 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించింది. కొత్త కాలేజీల్లో దక్షిణాది రాష్ట్రాలకు 17 మంజూరు కాగా అత్యధిక మెడికల్ కాలేజీలను దక్కించుకుంది తెలంగాణ రాష్ట్రమే. ఈ విద్యా సంవత్సరానికి ఏకంగా 8 ప్రభుత్వ (యాదాద్రి, మెదక్, గద్వాల, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, ములుగు, నారాయణపేట్, నర్సంపేట) ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీకి (నోవా) ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి, కర్నాటకలో 3, కేరళలో 1, తమిళనాడులో 3 కాలేజీలకు అనుమతులిచ్చింది. కాగా తెలంగాణ నుంచి మరో రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు అనుమతులు కోసం దరఖాస్తు చేయగా ఎన్ఎంసీ వాటిని తిరస్కరించింది. కొత్తగా అనుమతులు పొందిన కాలేజీలతో దేశంలో వైద్య కళాశాలల సంఖ్య 766కు చేరింది. అలాగే యూజీ మెడికల్ సీట్ల సంఖ్య కూడా 1.15 లక్షలకు చేరింది. ఎన్ఎంసీ గణాంకాల మేరకు తెలంగాణలో గతేడాది 56 మెడికల్ కాలేజీలుండగా ఈ ఏడాది వాటి సంఖ్య 65కు చేరింది.

సోషల్ సైకోల్లో వణుకు!

- నోటీసులు, కేసులు, కౌన్సెలింగ్‌తో బెంబేలు
- ఏపీవ్యాప్తంగా పోలీసుల ముమ్మర వేట
- భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవు

అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలపై సోషల్ మీడియాలో నీచ వ్యాఖ్యలతో చెలరేగిపోయిన వారు దారికి వస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆక్రోశం... ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహంతో 'సోషల్ సైకో'లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వారు పెట్టిన పోస్టులను బట్టి... నోటీసులు ఇవ్వడం, కౌన్సెలింగ్ చేయడం, కేసులు పెట్టడం, అవసరమైన చోట అరెస్టులూ చేస్తున్నారు. వాళ్ల కుటుంబ సభ్యులకు కూడా విషయం వివరిస్తున్నారు. గ్రూపుల్లో ఫార్వర్డ్ చేసిన వారిని పోలీసు స్టేషన్లకు పిలిచి వివరాలు సేకరిస్తున్నారు. లైకులు కొట్టిన వారికి వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ద్వారా 160 సీఆర్పీసీ నోటీసులు పంపారు. మార్ఫింగ్ ఫొటోలు, అసభ్యకరమైన వీడియోలు సృష్టించిన వారిపై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన సెక్షన్ 111 ప్రయోగిస్తున్నారు. పోలీసుల వరుస చర్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్న సోషల్ సైకోలు పలువురు రాష్ట్రం విడిచి పారిపోతున్నారు. మరి కొందరు 'ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చెయ్యం. వదిలిపెట్టండి' అని పోలీసులను వేడుకుంటున్నారు. ఇంకొందరు భయంతో న్యాయవాదుల్ని వెంట బెట్టుకుని ఠాణాలకు వచ్చి రక్షణ కోరుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.